www.jagritiweekly.com
సంపుటి: 77 సంచిక : 05 పుటలు : 52

# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి కార్తిక బహుళ దశమి
25 నవంబర్-01 డిసెంబర్ 2024
వెల : ₹20/-




## ఆవిష్కృతమైన హిందూ జీవన విధానం

# తళుక్కుమన్న బాల్యం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# గురుకుల విద్యాలయం

(ప్రాచీన భారతీయ మరియు ఆధునిక విద్యా విధానాల మేలు కలయిక)

## 2025 - 2026 : 4 వ తరగతికి ప్రవేశములు జరుగుచున్నవి

### పరీక్ష జరుగు తేది (24, 25 & 26 డిసెంబర్ 2024)

(పరీక్ష మరియు ముందుగా ఇవ్వబడే శిక్షణ కాలంలో విద్యార్థుల దక్షత ఆధారంగా ఎంపిక జరుగును)

సమర్థవంతమైన మరియు ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలంటే భారతీయ జీవనాన్ని పునరుద్ధరించాలి. అందుకు మన ప్రాచీన గురుకుల విద్యావ్యవస్థను తిరిగి తీసుకురావడం ద్వారానే ఇది సాధ్యమవుతుంది. మన సమాజంలోని ఇప్పటితరానికి మనం ఈ భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అందిస్తే వారు దీన్ని భవిష్యత్ తరాలకు సమర్థవంతంగా అందించగలరని మేము నమ్ముతున్నాము. ఈ గురుకుల విద్యను అభ్యసించే కాలం పూర్తిగా 12 సంవత్సరాలు ఉంటుంది. 12 సంవత్సరాల విద్యను పూర్తిచేసుకున్న గురుకుల విద్యార్థులు జాబ్ సీకర్స్‌గా కాకుండా జాబ్ గివర్స్‌గా (Entrepreneur) మారుతారు.

గురుకులంలోని విద్యార్థులకు ఈ 12 సంవత్సరాలు గురుకుల శిక్షణాకాలంలో 64 రకాల కళలను దశలవారీగా నేర్పబడును. ఇందులో వేదవిద్యతో పాటుగా గుర్రపుస్వారీ, త్రినేత్రవిద్య, మల్లఖంబ విద్య, విలువిద్య, జ్యోతిష్యము, సంగీతము మరియు చిత్రలేఖనము వంటి విషయాలును నేర్పించబడును.

## బాలుర కొరకు

శ్రీ సాందీపని గురుకులం,
వికారాబాద్ జిల్లా, తాండూరు మండలం,
జింగుర్తి గ్రామం- హైదరాబాద్ దగ్గర
94418 44454

Link : https://forms.gle/nHWTw3vq42kKFdbK7

## బాలికల కొరకు

శ్రీ నివేదిత గురుకులం, కృష్ణా జిల్లా,
గన్నవరం, విజయవాడ దగ్గర
ఉంగుటూరు గ్రామం,
83411 53131

Link : https://forms.gle/tjfRUBQJ71LuAVqP9

**దరఖాస్తు చేసుకోవడానికి ఆన్లైన్ లింక్ లేదా QR కోడ్ ద్వారా చేసుకోవచ్చు. పాఠశాల ఆఫీస్‌లో కూడా అప్లికేషన్లు లభిస్తాయి.**

## గురుకుల వాతావరణం

* ఉచిత విద్య
* గురుకుల విద్య పూర్తిగా CBSE సిలబస్‌ను అనుసరిస్తుంది.
* కుటుంబం నుండి ఒక అడ్మిషన్ మాత్రమే అనుమతించబడుతుంది.
* సాంకేతిక మరియు వైజ్ఞానికమైనటువంటి విషయాలు పూర్తిస్థాయిలో అందించడం జరుగుతుంది.
* విద్యార్థులకు నాలుగు భాషలు (తెలుగు, ఇంగ్లీష్, హిందీ మరియు సంస్కృతము) నేర్పించడం జరుగుతుంది.
* తల్లిదండ్రులు తమ పిల్లలను 12 సంవత్సరాల కాలం పాటు గురుకులంలో ఉంచవలసి వుంటుంది.
* విద్యార్థులకు జ్ఞానార్జనే ప్రధానము. మార్కుల ఒత్తిడి విద్యార్థి మనసుమీద ప్రభావము చూపరాదు.
* ప్రతి సంవత్సరం రూ. 25000/- కాషన్ డిపాజిట్ చెల్లించాలి. 12 సంవత్సరాల విద్య పూర్తి అయిన తరువాత తిరిగి విద్యార్థికి చెల్లించబడుతుంది.
* తల్లిదండ్రులు తమ పిల్లలకు పుస్తకాలు మరియు ఇతర సామాగ్రిని అవసరానికి తగినట్టుగా అందించాలి.
* శ్రీకృష్ణుడు మరియు సుధాముడు ఒకే గురుకులములో చదువుకున్నట్లు సాందీపని/నివేదిత గురుకులములలో కూడా అన్ని వర్గాల అబ్బాయిలు/అమ్మాయిలు కలిసి చదువుకుంటారు.
* పరీక్ష సమయంలో రూ॥ 500/- పరీక్ష ఫీజు చెల్లించవలసివుంటుంది.

# దీపావళి నుండి సంక్రాంతి వరకు

# జాగృతి కానుక !

త్వరపడండి..

సంవత్సర చందా రూ. 750/-

5 సం.రాల చందా రూ. 3500/-

సంఘ శతాబ్దిలో
ఇంటింటా
జాగృతి పత్రికను పంపి
హిందుత్వ జాగరణ చేయడం ద్వారా
జాతీయ భావనను బలోపేతం చేద్దాం!
జాగృతి చందాదారులుగా చేర్పించడంలో మనవంతు కృషి చేద్దాం!!

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో
మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే
గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

సంవత్సర చందా రూ. 750/-
http://payit.cc/S18970

5 సం.రాల చందా రూ. 3500/-
http://payit.cc/S18973

సం.ర చందా మ్యాగ్జిన్ పోస్టు
వెల : రూ.1374/-
https://payit.cc/S32796

**Jagriti Bank A/c details**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch,
Hyderabad. IFSC : UTIB0002157,

వివరాలకు సంప్రదించండి
సర్క్యులేషన్ మేనేజర్ :
040-2756 1453
99599 97013

jagritiweekly.com | facebook.com Jagriti Telugu Weekly | youtube.com/@Jagrititv | 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | **9959991304** |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అంకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.3500 సంవత్సర చందా రూ.750

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

తిరుమల తిరుపతి దేవస్థానాల పరిపాలనా విభాగంలో తిష్ట వేసుకున్న హిందూయేతర ఉద్యోగుల పీడ ఎట్టకేలకు తొలగబోతున్నది. ఇది హిందువులకు శుభవార్తే. ఇలాంటి వారిని త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి సరెండర్ చేస్తామని నవంబర్ 18న టీటీడీ వెల్లడించింది. కొత్త పాలక మండలి చైర్మన్ బొల్లినేని రాజగోపాలనాయుడు అధ్యక్షతన నిర్వహించిన తొలి సమావేశంలో దీనితో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో ఉపయోగించే నెయ్యి జంతువుల కొవ్వు పదార్థాలతో కలుషితమైందన్న ఆరోపణలు వెల్లువెత్తిన తరువాత బోర్డు సమావేశం కావడం ఇదే మొదటిసారి. సమావేశం తరువాత కొత్త చైర్మన్ బోర్డు నిర్ణయాలను వెల్లడించారు. తిరుమల శ్రీవారి పరిపాలనా విభాగంలో ఎంతమంది హిందూయేతర ఉద్యోగులు ఉన్నారో త్వరలోనే వివరాలు సేకరించి వారిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి సరెండర్ చేస్తామని తేల్చి చెప్పారు. 2018లో సేకరించిన వివరాల ప్రకారం ఇతర మతాలకు చెందిన 44 మంది తిరుమల పరిపాలనా విభాగంలో వివిధ హోదాలలో పనిచేస్తున్నారు. టీటీడీ ఉద్యోగుల సంఖ్య తక్కువేమీ కాదు. 6000 మంది శాశ్వతోద్యోగులు సహా, 22000. ఈ సిబ్బంది సేవలను సక్రమంగా వినియోగించుకోవడంలో బోర్డు సఫలం కాగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు చైర్మన్. ఇది సరైన మాట.

టీటీడీ పూర్తిగా హిందూ ధార్మిక సంస్థ. కాబట్టి ఇందులో హిందూయేతరులు ఉద్యోగులుగా ఉండడం సరికాదని బోర్డు భావించిందని చైర్మన్ చెప్పడం సబబే. వీరి భవిష్యత్తు గురించి తగు నిర్ణయం తీసుకోవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని చెప్పారు. వీరికి స్వచ్ఛంద పదవీ విరమణ అవకాశం కూడా కల్పిస్తున్నారు. అవన్నీ పాలనా పరమైన లేదా, మానవతా దృక్పథంతో తీసుకుంటున్న చర్యలే అయినా, టీటీడీలో హిందూయేతరులు ఉండడం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. లడ్డులో వినియోగించిన నెయ్యిలో కొవ్వు పదార్థాల కల్తీ జరిగిందన్న ఆరోపణ నిజంగానే కోట్లాది హిందువుల మనోభావాలను గాయపరిచింది. అందుకే లడ్డుతో పాటు, ఇతర అన్నప్రసాదాల నాణ్యతా ప్రమాణాల రక్షణకు ఒక సంఘాన్ని

**శాలివాహన 1946 శ్రీ క్రోధి కార్తిక బహుళ దశమి**

## లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం
**ఆవిష్కృతమైన హిందూ జీవన విధానం**
**తలుక్కుమన్న బాల్యం**
6లో

ధారావాహిక నవల
**తూర్పు-పడమర**
– గన్నవరపు నరసింహమూర్తి
20లో



ప్రత్యేక వ్యాసం
**కమలవాసిని కార్తిక బ్రహ్మోత్సవం**
26లో



# జాగృతి

## సంపాదకీయం

# ఓం నమో వేంకటేశాయ!

నియమించాలని కూడా బోర్డు సమావేశంలో తీర్మానించారు. నిత్యాన్నదాన పథకాన్ని ఇంకా మెరుగుపరిచేందుకు కూడా బోర్డు నిర్ణయం తీసుకుంది. ఏ రాజకీయ పార్టీ అయినా తిరుమల కొండ మీద రాజకీయ ప్రకటనలు చేయడాన్ని కూడా బోర్డు నిషేధించాలని నిర్ణయించింది. మరొక మంచి, కీలక నిర్ణయం శ్రీవారి అన్ని నగదు నిల్వలను ప్రైవేటు బ్యాంకుల నుంచి జాతీయ బ్యాంకులకు బదలీ చేయబోతున్నారు.

స్వామివారి దర్శనానికి ఒక్కొక్క సందర్భంలో 20 నుంచి 30 గంటల వరకు సమయం తీసుకుంటూ ఉంటుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఈ సమయాన్ని రెండు మూడు గంటలకు తగ్గించడానికి ఉన్న వీలు గురించి బోర్డు నిపుణులతో చర్చించాలని నిర్ణయించింది. శ్రీవాణి పథకాన్ని రద్దు చేయాలని కూడా నిర్ణయించారు. బ్రేక్ దర్శనం పేరుతో భక్తుల నుంచి రూ. 10,000 వసూలు చేసి, ఆ నిధులను రాష్ట్రంలోని పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు ఉపయోగించాలని ఇంతకు ముందు ఉన్న ప్రభుత్వం ఆలోచించింది. ఈ పథకం కొనసాగుతుంది కానీ, అది వేరే రూపంలో ఉంటుంది. ఇంతవరకు శ్రీవాణి పథకం కింద వచ్చిన సొమ్మును టీటీడీ ఖాతాలో జమ చేస్తారు. టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా అలిపిరి వద్ద రాష్ట్ర పర్యాటక శాఖకు జరిగిన 20 ఎకరాల భూ కేటాయింపును, విశాఖ శారదా పీఠానికి చేసిన భూకేటాయింపును కూడా బోర్డు రద్దు చేసింది.

టీటీడీలో హిందూయేతరులను నియమించడమే తప్పిదం. హిందూ ధార్మిక సంస్థగా టీటీడీ నిలబడాలంటే హిందువులే ఉండాలి. అంతేకాదు, వారు ఆస్తికులు కావాలి. తిరుమల పవిత్రతను కాపాడేందుకు కొత్త బోర్డు చేసిన ప్రతిపాదనలు కూడా స్వాగతించదగినవి. హిందూయేతరులు తిరుమలలో చొరబడడం వల్ల భారీ మూల్యమే చెల్లించవలసి వచ్చింది. ఇటీవలి కాలంలో టీటీడీ పని తీరు మీద, అక్కడి వ్యవహార సరళి మీద ఆరోపణలు వెల్లువెత్తాయి. లడ్డూ ప్రసాదం కల్తీ ఆరోపణ వాటికి పరాకాష్ట. తిరుమలకు ఏడుకొండలు అవసరం లేదు, రెండు కొండలు చాలునన్న నికృష్ట నినాదం, శ్రీవారి ఆధ్యాత్మిక పత్రిక 'సప్తగిరి'లో క్రైస్తవ ప్రచారం, రాధామనోహర్ దాస్ వంటి వారి మీద చేయి చేసుకోవడం, ఓ దేవస్థానం ఉద్యోగి, సంస్థ కారు మీద చర్చ్‌కు వెళ్లడం, పరకామణి చోటు మార్చడం, సూతకంలో ఉన్న ఉన్నతోద్యోగి విధులకు హాజరు కావడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచినవే. ఇందులో పరమత ఉద్యోగుల నిర్వాకాలు కొన్ని అయితే, పరమత ముఖ్యమంత్రి వీర విధేయ హిందువుల అపరాధాలు ఇంకొన్ని. నిజానికి ఇలాంటి దుర్గతిని ఎదుర్కొన్నది కేవలం టీటీడీ ఒక్కటే కాదు. తెలుగు రాష్ట్రాలలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలన్నీ ఇలాంటి అవకతవకలతో, అపచారాలతో బాధపడుతున్నాయి. వాటిని పూర్తిగా ప్రక్షాళన చేయాలి. హిందూ పుణ్యక్షేత్రాలలో, జాతరలలో, ఉత్సవాలలో పరమత ప్రచారానికి తెగబడేవారిని కఠినంగా శిక్షించడం అవసరమే. హిందువుల ఇంట పిండివంటకాలను కూడా ప్రసాదం పేరిట నిరాకరించే సిలువ అభిమానులు తిరుమలలో ఎందుకు కాలు మోపాలి? స్వామివారి ఆదాయం నుంచి వేతనం ఎందుకు తీసుకోవాలి? ఏమైనా టీటీడీ తరహా నిర్ణయాలు అక్కడితో ఆగరాదు. ఇంతటితో అగవలసనవీ కాదు. తిలక ధారణ సహా, ఏ ఒక్క హిందూ మనోభావాన్ని గౌరవించడానికి సిద్ధంగా లేని ప్రభుత్వాలూ, అధికారులూ అక్కడ ఎందుకు? ★

25 నవంబర్ 2024, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్



38లో

కథ

**లోగుట్టు**

– దేశరాజు

కార్టూన్





| | | |
|---|---|---|
| ఈవీ వాహనాల ప్రకటన ఉభయ తారకం (తెలంగాణ) | - | 14 |
| ప్రజా సమస్యలపై సభలో బీజేపీ గళం (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| అభినవ మొల్ల లక్ష్మీనరసమ్మ (మహిళ) | - | 22 |
| ఉగ్ర మూకలకు ఆక్స్‌ఫర్డ్ ఎర్ర తివాచి (అంతర్జాతీయం) | - | 24 |
| హిందూ ఐక్యతా నినాదానికి మరింత పదును! (జాతీయం) | - | 28 |
| మణిపూర్ మంటలు - అసలు వాస్తవాలు (జాతీయం-1) | - | 31 |
| ఇలాంటి సర్వేలతో దేశ విచ్ఛిన్నమే! (తీర్పు) | - | 34 |
| అంతరిక్ష అద్దంలో జీవితం (రక్షణ) | - | 42 |
| దొరకునా ఇటువంటి సేవ! (క్రీడ) | - | 43 |
| 'అమరన్'లో ఏం చూపించారు? ఎందుకు ఉలికిపాటు!? (సినిమా) | - | 50 |

అక్కడ.. బాల్యానికి హిందూ జీవన విధానం పరిచయమైంది...
అందులోని సౌందర్యం, సమానత, ఐక్యతల అనుభవమైంది..
కుటుంబాల్లో మరుగునపడిపోతున్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక జీవనశైలి ఆవిష్కృతమైంది...
నేటి సమాజంలో బలపడుతున్న విషానికి విరుగుడు మన జీవన విధానమేనని మార్గదర్శనం అందించింది..
మన జీవనం అంటే బయట పెద్ద తెరమీద, ఇంట్లో బుల్లి తెరమీద, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ వంటి ఓటీటీ వేదికల్లో చూపేది కాదని తెలిసేలా చేసింది...
హిందూ నాగరికత, ఒక జాతిగా భారత్ పట్ల ఉన్న దురభిప్రాయాలను తొలగించడమే లక్ష్యంగా...
అన్నీ విస్మరించి కాలంతోపాటు పరుగులు తీస్తున్న తల్లిదండ్రులు మర్చిపోతున్న విషయాలను జ్ఞాపకం చేసింది
ఇంతటి మహత్తరమైన కార్యక్రమాన్ని నిర్వహించడం ఒక ఎత్తు అయితే, అందులో పాల్గొంటున్న బాలబాలికలకు కార్యక్రమం పట్ల ఆసక్తి, ఉత్సాహం జావగారకుండా పకడ్బందీగా రూపొందించి, వారిని కట్టిపడేసింది 'హిందూ స్పిరిచ్యువల్ సేవా ఫౌండేషన్' ఫెయిర్.









భవిష్యత్ తరాలను ప్రభావితం చేస్తున్న నేటి సామాజిక పరిస్థితుల నుంచి వారిని తప్పించి, భారతీయతకు వారసులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో భాగ్యనగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రదర్శనకు జంటనగరాల్లో అనేక పాఠశాలల నుంచి విద్యార్థినీ విద్యార్థులు హాజరై ఉత్సాహంగా పాలుపంచుకున్నారు.

## ఏమిటీ హెచ్ఎస్ఎస్ఎఫ్?

బహుళంగా ఉన్న హిందూ ఆధ్యాత్మిక సంస్థలు ఉన్నతమైన స్ఫూర్తితో ప్రజా సేవ చేసేందుకు ప్రేరణ కలిగించి, ప్రోత్సహించి, కొనసాగించేందుకు, భారతదేశ వ్యాప్తంగా మేళాలను, కార్యక్రమాలను నిర్వహించడం ప్రాథమిక లక్ష్యంగా హిందూ స్పిరిచ్యువల్ సేవా ఫౌండేషన్ పని చేస్తోంది. విలువలను, నాగరికతా ధర్మాలను ప్రోత్సహించేందుకు భారతదేశ వ్యాప్తంగా గోష్ఠులు, సదస్సులు, సమావేశాలు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తుంది. డా॥ రమేష్ ప్రభు వర్సెస్ ప్రభాకర్ కాశీనాథ్ కుంతే (1995) కేసులో సుప్రీం కోర్టు 'హిందుత్వం' అన్న పదానికి ఆపాదించిన అర్థానికి అనుగుణంగా, 'హిందుత్వ'ను సంకుచిత మతపరమైన భావనగా కాక భారత ప్రజల సంస్కృతీ, ఆచార వ్యవహారాలను ఆవరిస్తూ, వారి జీవన విధానాన్ని అభివర్ణించేలా ఉండాలని హెచ్ఎస్ఎస్ఎఫ్ భావిస్తుంది.

## ప్రారంభ సమావేశం

నవంబర్ 7వ తేదీ సాయంత్రం జరిగిన ప్రారంభ సమావేశంలో ఆశీః ప్రసంగం చేస్తూ ఇన్ని సేవా సంస్థలు తమ శక్తిని, యుక్తిని సమాజానికి అందిస్తున్నాయి, మన సమాజం అందుకుంటున్నది అనే విషయాన్ని తెలిపేందుకు కార్యకర్తలు చేస్తున్న కృషిని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి ప్రశంసించారు. భారతీయులు ఎప్పుడూ ప్రచారం కోరుకోలేదని, వారికి ఎప్పుడూ మార్కెటింగ్ స్ట్రాటజీల అవసరం పడలేదని, ఎందుకంటే స్వార్థంగా పరిధులు నిర్ణయించుకున్న వ్యక్తులు వారు కాకపోవడమేనని ఆయన అన్నారు. ప్రస్తుత ఈ సభ, ప్రదర్శన అన్నీ కూడా భారతీయ స్ఫూర్తిని, దాని విశిష్ట ఆత్మను ప్రదర్శిస్తున్నాయని ఆయన ప్రశంసించారు. భూమినంతా కూడా ఒక కుటుంబమనుకునే విశాలత్వాన్ని కలిగినటువంటి వ్యక్తులని శ్రీ జీయర్ స్వామి పేర్కొన్నారు. మనకు వనరులకు కొరతలేదు, నేడు వాటిని వినియోగించే వ్యక్తుల నిజాయితీగా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, మేధోపరమైన బానిసత్వంలో




# ఆవిష్కృతమైన హిందూ జీవన విధానం

# తళుక్కుమన్న బాల్యం

మనం జీవిస్తున్నామన్న విషయాన్ని ఆయన పట్టి చూపారు. మనకు స్వయంపోషకత్వం ఉన్నప్పటికీ, ఎక్కడి నుంచో వచ్చిన సాంకేతికతలను తెచ్చుకొని మనను మనం కోల్పోతున్నామంటూ స్వామీజీ అప్రమత్తం చేశారు. కొవిడ్ మహమ్మారి కాలంలో డబ్బున్నవారంతా ముందస్తు జాగ్రత్తగా అన్నట్టుగా ఆక్సిజన్ సిలిండర్లను, మందులను తెచ్చి నిల్వ ఉంచుకుంటున్న సమయంలో నెల్లూరులో ఆనందయ్య అనే వ్యక్తి ఇంట్లోని కొన్ని మొక్కలను ఉపయోగించి మందు చేసి ఇస్తే, అప్పటిదాకా ఆసుపత్రిలో రోజుకు లక్ష రూపాయలకు పైగా ఖర్చు పెట్టినవారంతా, ఆయన ఇచ్చిన మందు తీసుకొని హాయిగా ఇంటికి నడిచివెళ్లిపోయారని, తర్వాత ఆయనపై ఒత్తిడి తెచ్చి, రాజకీయ నాయకులు ఆ ఫార్ములా తీసుకుని వేరే పేరుతో అందరికీ ఇచ్చి వాళ్లు సంపాదించుకున్నారంటూ గుర్తు చేశారు. మనకు సహజంగా ప్రాణాన్ని, శక్తిని, ఐశ్వర్యాన్ని ఇచ్చేవి ఏవైతే ఉన్నాయో వాటిని వీడ్స్ (కలుపుమొక్కలు) అనే పేరుతో బయటపారేస్తూ, విదేశీ మందులను మాత్రం నాణ్యమైనవిగా భావించే మనస్తత్వం ఇంకా కొనసాగుతోందని ఆయన చెప్పారు. ఒకనాడు అరటిపండు తిని, అరగ్లాసు పాలు తాగి పడుకుంటే వ్యాధులు రావని అనేవారని, ఇప్పుడు పరాయి దేశానికి చెందిన ఆపిల్‌ను వాడే పద్ధతి స్వతంత్ర భారతం అయిన తర్వాత కూడా కొనసాగుతూ రావడం విచారకరమన్నారు. నేడు ఈ దేశానికి కూడా ఒక ఆత్మ ఉంది, చిత్తం ఉంది, సంకల్పం ఉంది, దీన్ని మళ్లీ చూపించాలని మన వారు నిర్ణయించడాన్ని ప్రోత్సహించవలసిన అవసరం ఉన్నది. ఈ దేశానికి సంబంధించినంతవరకూ ఏ వ్యక్తీ కూడా నా చిన్నారి బొజ్జకు శ్రీరామ రక్ష అనుకోలేదని ఆయన అన్నారు. సూర్య నమస్కారం చేసే ప్రతి వ్యక్తీ రోజుకు మూడు సార్లు ఆయనకు నమస్కరించిన తర్వాత లోకాస్సమస్తా సుఖినోభవంతు అనుకుంటాడని, మన పూర్వీకులు చేసిన ఈ అలవాటు నేటికీ కొనసాగుతోందని అన్నారు.

మన రుషులు, మునులు, బోధించిన ‘మానవ సేవే మాధవ సేవ’ అన్న బోధపై దృష్టి పెట్టినట్టు ఈ ప్రదర్శన పట్టి చూపుతోందని, రామకృష్ణ మఠం, నిర్వాహకులు స్వామి శితికంఠా నంద స్వామి ప్రశంసించారు. మానవాళి దైవత్వాన్ని సాధించే సాధనంగా సేవా మార్గాన్ని మన రుషులు మనకి చూపారని ఆయన అన్నారు. సనాతన ధర్మంలో నిస్వార్థ సేవకు మరో పేరుగా, మహోన్నత వ్యక్తిత్వాలుగా కీర్తినందుకున్న దధీచి, శిబి మహారాజు, రంతి దేవుడిని ఉదంతాలను ఆయన ప్రస్తావించారు. గుర్తింపును ఆశించకుండా సమాజ సేవ చేస్తున్న వ్యక్తులు, సంస్థలు ఎన్ని ఉన్నాయో ఈ ప్రదర్శన మనకు పట్టి చూపుతోందని ఆయన పేర్కొన్నారు. మన అహాన్ని నిర్మూలించుకోవ డానికి మార్గంగా సేవ అనే అంశంపై అనేక బోధలు చేసిన స్వామి రంగనాథానంద మాటలను ప్రస్తావిం చారు. సేవా ప్రదర్శనిలో భాగంగా నిర్వహించనున్న కన్యావందనం, గురు వందనం, మాతృ-పితృ వందనం కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆయన ఆశీస్సులు అందించారు.

ఆర్‌ఎస్‌ఎస్ అఖిలభారత కార్యకారిణి సభ్యులు భాగయ్య ప్రసంగిస్తూ, భారతీయ మౌలిక స్వభావం, దాని సాంస్కృతిక తాత్వికత, ఆత్మ విశ్వాసానికి హెచ్‌ఎస్‌ఎస్‌ఎఫ్ 2024 సేవా ప్రదర్శిని అద్దం పడుతోందంటూ అభివర్ణించారు. భారతీయ సమాజాన్ని నిర్వచించే మౌలిక విలువల గురించి ఆయన ఎంతో ఉద్వేగంగా మాట్లాడారు. సేవకు ప్రతిరూపమైన శ్రీకృష్ణుడి బోధల నుంచి స్ఫూర్తిని పొంది, ఆయన వారసులుగా భారతీయులు ఎప్పుడూ దేశ ధార్మిక కార్యకలాపాలకు వెన్నుముకగా నిలిచారని అన్నారు. బ్రిటిష్ పాలనకు ముందు, భారత్‌కు దరిద్రం అంటే ఏమిటో తెలియ దని, విదేశీ దాడులు జరుగుతున్న సమయంలో కూడా భారతీయ



కన్యావందనం



ప్రకృతి వందనం



నారీవందనం

గ్రామాలు స్వయంసమృద్ధితో ఉన్నాయని పేర్కొంటూ, స్వావలంబన స్ఫూర్తి అనాదిగా కొనసాగుతూ వస్తున్న విషయాన్ని పట్టి చూపారు. గ్రామాలలోని కుటీర పరిశ్రమల వల్ల ఏనాడూ దేహీ అనే పరిస్థితి లేదని నొక్కి చెప్పారు. '1785 వరకు తమిళనాడు నుంచి బరంపురం వరకూ లక్ష పాఠశాలలు ఉండేవని, ఇందులో అగ్రకులాలు, వెనుకబడిన వర్గాలు, షెడ్యూల్డు కులాలుగా నేడు పిలుస్తున్నవారూ అందరూ కలిసిమెలిసి విద్యనభ్యసించారని ఆయన చెప్పారు. ఈ పాఠశాలలను సమాజమే పోషించిందని, సామాన్య రైతులు, వ్యాపారులు, సామాన్య ప్రజలే పాఠశాల నిర్వహణకు అవసరమైన నిధులను సమకూర్చేవారని ఆయన వివరించారు. ఈ దేశం గొర్రెలు కాదని, వీరులను కన్న భూమంటూ ఉద్వేగంగా పేర్కొన్నారు. 'త్వమేవ సర్వం మమ మాతృభూమి' అంటూ శాస్త్రాలు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు.

ఆంగ్లేయులు దాదాపు మూడు శతాబ్దాల పాటు భారతీయుల మనస్సులను దెబ్బ తీయడంతో ఆత్మవిశ్వాస హీనతతో మనం కుంగి పోయామని, నిజానికి ఈ దేశంలో ఏ పని చేసినా, చేయాలనుకున్నా డబ్బుకు లోటు లేదని, పని చేస్తామని అనేవారు, చేసేవారు కావాలని ఆయన పేర్కొన్నారు. హిందూ సంస్థలన్నీ కలిసి మెలిసి, నేను అనే అహం లేకుండా నేడు ఈ కార్యక్రమం చేస్తున్నాయని, ఇలా కలిసి పని చేయడం వల్లే దేశంలో పెద్ద మార్పు చోటు చేసుకోబోతోందని ఆయన చెప్పారు. రామకృష్ణ మఠం, సత్యసాయి సంస్థలు, మాతా అమృతానందమయి మఠం, సేవాభారతి వంటి సంస్థలు చేస్తున్న సేవలను కొనియాడుతూ, భారతీయుల సేవా స్ఫూర్తి ప్రపంచవ్యాప్తంగా మన్ననలు అందుకుంటోందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, భారతదేశ నిజమైన చరిత్ర గురించి పౌరులకు అవగాహన లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. 'ఈ దేశంలో పుట్టి పెరిగిన పౌరులుగా, చాలామందికి ఈ జాతి వాస్తవ చరిత్ర తెలియదు'ని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నిస్వార్థ సేవలను అందించే వ్యక్తులను, సంస్థలను ఒక చోటకు చేర్చి, ఐకమత్యాన్ని ప్రదర్శించిన హెచ్ఎస్ఎస్ఎఫ్ 2024 సేవా ప్రదర్శిని నిజమైన పౌరసత్వానికి ప్రాతినిధ్యం వహిస్తోందని ఆయన కొనియాడారు. ప్రభుత్వాలు గుర్తించకపోయినా, ఈ కృషి నిజమైన పౌరసత్వ స్ఫూర్తికి ప్రతిరూపమని ఆయన నొక్కి చెప్పు, ప్రతి ఒక్కరూ ఈ ప్రదర్శనలో ప్రదర్శిస్తున్న సేవల నుంచి స్ఫూర్తిని, ప్రేరణను పొందాలని ఉద్బోధించారు.

ఈ సందర్భంగా హెచ్ఎస్ఎస్ఎఫ్ – ఐఎంసిటిఎఫ్ అఖిలభారత సమన్వయ కర్త గుణ్వంత్ సింగ్ కొఠారీ, తమ ఫౌండేషన్ లక్ష్యం గురించి మాట్లాడుతూ, 'హిందూ ధర్మంలో అంతర్లీనంగా ఉన్న సేవా స్ఫూర్తిని ఈ ప్రదర్శన ప్రతిబింబిస్తుంద'ని అన్నారు. తాము వివిధ రాష్ట్రాల్లో ఇటువంటి మేళాలు అనేకం నిర్వహించామన్నారు.

భారతీయతను ఆచరిస్తూ, ప్రపంచ సంక్షేమం కోసం కృషి చేస్తున్న సంస్థలన్నింటినీ ఒకచోటకు తేవడం ద్వారా సేవకు, సామాజిక అవసరాలకు మధ్య గల అంతరాన్ని భర్తీ చేయాలన్నది తమ లక్ష్యమని హెచ్ఎస్ఎస్ఎఫ్ 2024, హైదరాబాద్ నిర్వాహక మండలి ప్రతినిధి రవి పేర్కొన్నారు. సమాజ అవసరాలను పరిష్కరిస్తూనే భారతీయ విలువలను నిలబెట్టేందుకు కృషి చేస్తుందని ఆయన అన్నారు. దేశ నిర్మాణంలో సేవా పాత్రను బలోపేతం చేయడం హెచ్ఎస్ఎస్ఎఫ్ లక్ష్యమని ఆయన అన్నారు.

## రెండవ రోజు

### కన్యావందనం

రెండవ రోజు విశిష్టమైన సాంస్కృతిక వేడుకలను నిర్వహించారు. ఉదయం జరిగిన కన్యావందన కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా భారతీయ సంస్కృతిలో ఆడపిల్లలకు సమాజం ఇచ్చే, ఇవ్వవలసిన గౌరవాన్ని పట్టిచూపారు. వందలాది మంది బాలబాలికలు హాజరైన ఈ కార్యక్రమంలో, బాలికలు కుర్చీలపై ఆసీనులై ఉండగా, బాలురు కింద కూర్చుని, ఒక దేవతను పూజించినట్టుగా పూజిం చడం ఒక అపురూప దృశ్యం! మన సమాజంలో ఆడపిల్లలకు అంత గౌరవం ఉందని బాలురకు తెలిసేలా చేయాలన్న లక్ష్యంతో హెచ్ఎస్ఎస్ఎఫ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

వేదికపై నుంచి స్తోత్రాలు వినిపిస్తుండగా, పసుపు, కుంకుమ, పూలతో బాలురు శ్రద్ధగా పూజ చేయడం ప్రతివారి హృదయాలను స్పృశించింది. ఇది కేవలం సంకేతాత్మక కార్యక్రమంగా కాక, ఆడపిల్లలను అక్కచెల్లెళ్లుగా, తల్లులుగా ,దేవతలుగా జీవితకాలమంతా గౌరవించాలన్న భావనను వారిలో కలిగించేందుకు, నిర్వహించారు. ప్రతిరోజూ ఒకరినొకరు చూసుకునే సహ విద్యార్థులు తమను అలా పూజించడంతో బాలికలు పొంగిపోయారు.

ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త డా॥ అనంతలక్ష్మి ప్రసంగిస్తూ, భారతీయ సమాజంలో ఆడపిల్లలకున్న ప్రాధాన్యతను, గౌరవాన్ని వివరించారు. ఒక సత్కార్యం జరిగినప్పుడు, బాల, కన్య, కుమారి, దంపతిపూజ అంటూ నిర్వహిస్తారని, కాని మగపిల్లలకు వివాహం జరిగితే తప్ప పూజలందుకునే అర్హత కలగదంటూ వివరించారు. తల్లిదండ్రులు కూడా ఆడపిల్లలను, మగపిల్లలతో సమానంగా చూడాలని, వారిని ఇంట్లోనే చులకనగా చూస్తే, బయట సమస్య అవుతుందని అప్రమత్తం చేశారు. దసరాల్లో తొలి రోజున చేసే బాలపూజలో రెండేళ్ల బాలికకు 'కుమారిక' అన్న పేరుతో, రెండవ రోజున మూడేళ్ల బాలికను త్రిమూర్తిగా, నాలుగేళ్లకు కల్యాణిగా, ఐదేళ్ల బాలికను రోహిణిగా, ఆరేళ్లకు కాళికగా, ఏడేళ్లకు చండిగా, ఎనిమిది శాంభవిగా, తొమ్మిదేళ్ల పిల్లను దుర్గగా, పదేళ్ల బాలికను సుభద్రగా పూజించి, గౌరవించుకోవడం మన సంస్కృతి అని వివరించారు. ఆడపిల్లను గౌరవిస్తే జగన్మాత సంతోషిస్తుందన్నారు. అలాగే, మమ్మీడాడీ సంస్కృతిని మానుకొని అమ్మా, నాన్న అని పిలవడం అలవాటు

చేసుకోవాలని, 'అమ్మ' అనే పదాన్ని పలికితే, 'అ' నుంచి 'మ' మధ్యనే అన్ని బీజాక్షరాలు ఉన్నందున అలా పిలిస్తే పుణ్యం వస్తుందని వివరించారు.

**ప్రకృతి వందనం**

కాలుష్యం పెరిగిపోతున్న ఈ కాలంలో ప్రకృతిని మనం గౌరవించుకోవలసిన, పర్యావరణాన్ని పరిరక్షించుకోవలసిన అవసరాన్ని పట్టి చూపుతూ బాలబాలికలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారిణి శోభ మాట్లాడుతూ, 'పరిరక్షించిన ప్రతివృక్షం జీవరాశి మొత్తం సంక్షేమానికి దోహదం చేస్తుంద'న్నారు. ప్రకృతిలో ఉన్న కీలక వనరులు, వాటి పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. బాలిబాలికలు ఈ పృథ్విని పరిరక్షణకు తామే బాధ్యులమన్న సంకేతాత్మకంగా విద్యార్థులు అందుకనుగుణమైన ప్రతిజ్ఞ చేసి, మొక్కలను ఇంటికి తీసుకువెళ్లారు.

**నారీవందనం**

అదే రోజు సాయంత్రం, సమాజంలో అనివార్యమైన మహిళల పాత్రను పట్టిచూపుతూ 'నారీ వందనం' కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా సభకు హాజరైన జాతీయ మానవ హక్కుల కమిషన్ యాక్టింగ్ చైర్‌పర్సన్ ఎస్. విజయభారతి మహిళలకు ఇవ్వవలసిన గౌరవించాలని, వైదిక కాలంలో పరిఢవిల్లిన స్త్రీ, పురుష సమానత్వం గురించి మాట్లాడారు. భగవద్గీత ఫౌండేషన్ చైర్మన్ గంగాధర శాస్త్రి మాట్లాడుతూ, మహిళల పట్ల గౌరవం, వారు చేసే సేవ, వారి సహకారం వంటి అంశాలన్నింటినీ హిందూ ధర్మంలో పొందుపరిచిన విషయాన్ని పట్టి చూపారు.

ఆ రోజు ఉదయం ప్రదర్శనను తిలకించేందుకు వచ్చిన కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, 'ఇక్కడ ప్రదర్శనలో పాలుపంచుకుంటున్న సేవా సంస్థల స్ఫూర్తి ఎంతో ప్రేరణాత్మకంగా ఉంది. ప్రజల నుంచి గుర్తింపు లేకున్నా తమ వంతుగా మన సంస్కృతికి కేంద్రంగా ఉన్న ధర్మం, సేవ అన్న విలువలను బలోపేతం చేస్తూ సేవలందిస్తున్న గుర్తింపులేని హీరోలు వీరు' అంటూ ప్రశంసించారు.

**మూడవ రోజు**

**గురువందనం**

మూడవ రోజు గురువందనం, మాతృ–పితృ వందనం కార్యక్రమాలు జరిగాయి. విద్యార్థులు భక్తి శ్రద్ధలతో, గౌరవంతో, కృతజ్ఞతా భావంతో తమ తల్లిదండ్రులకు, గురువులకు పూలతో పాదపూజ చేశారు.

ఈ సందర్భంగా అతిథిగా విచ్చేసిన రామకృష్ణా మిషన్‌కు చెందిన స్వామి శితికంఠానంద మాట్లాడుతూ, హిందూ ఆధ్యాత్మిక మార్గంలో తల్లి దండ్రులను, గురువులను గౌరవించడం అన్నది అంతర్భాగమని విద్యార్థులకు చెప్పారు. ఈ విలువలే బలమైన సమాజానికి పునాది అని వివరించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థుల ఈ పురాతన సంప్రదాయాల పట్ల ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి అదనంగా, పర్యావరణవేత్త దునర్ల సత్యానారాయణ మార్గదర్శనంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'భవిష్యత్తు కోసం చెట్లను రక్షించడం మన బాధ్యత' అని ఆయన అన్నారు.

**నాలుగవ రోజు**

**మాతృపితృ వందనం: కుటుంబ విలువల పట్ల గౌరవం**

**పరమవీర వందనం, ముగింపు సమావేశం**

నవంబర్ 10 ఉదయం మాతృపితృ వందన కార్యక్రమం ఘనంగా జరిగింది. భారతీయ సంస్కృతి లోని కుటుంబ విలువల్లో భాగమైన మాతృదేవో భవ, పితృదేవో భవ అంటూ బాలబాలికలు తమ తల్లిదండ్రులకు వందనం అర్పించారు. మాతా అమృతానందమయి ట్రస్టు ఇన్‌ఛార్జి స్వామిని సువిద్యామిత్ర సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తల్లిదండ్రులు డబ్బుకన్నా, జీవితం ముఖ్యమనే విషయాన్ని గ్రహించి, పిల్లలకు తగిన సమయాన్ని ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. పిల్లల్లో శీలం, విలువలను పెంచడంలో కుటుంబమే కీలక పాత్ర పోషిస్తుందనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు.

ఆధ్యాత్మికవేత్త వివిఎస్ఆర్ మూర్తి ప్రసంగిస్తూ, రామాయణ, మహాభారతాలలో పొందుపరిచిన కుటుంబ విలువలను, తల్లి పాత్రను, మనసును సోదాహరణంగా వివరించారు. కుటుంబ కేంద్రితమైన ఆధ్యాత్మికత, వ్యక్తిగత వృద్ధిపై దాని ప్రభావాన్ని ఆయన వివరించారు.

**మానవీయం**

ఆఖరురోజు మధ్యాహ్నం, సమాజ సేవ చేస్తున్న వారిని గుర్తించేందుకు మానవీయం కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజోద్ధరణకు పని చేస్తున్న వ్యక్తులను గౌరవించారు. 'మానవత' అన్న ఇతివృత్తం కింద, సామాజిక కార్యకర్తలు సమాజ సేవకు కట్టుబడి ఉన్న విషయాన్ని గుర్తిస్తూ, వారు ఎంతటి ఆదర్శమూర్తులో వెలుగులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర సేవా భారతి ట్రస్టీ ఎక్కా చంద్ర శేఖర్ మాట్లాడుతూ, సమాజ సేవను అలవరుచు కునేందుకు యువతకు ప్రేరణను ఇవ్వవలసిన అవసరం గురించి మాట్లాడారు. కరుణకు, పనికి మధ్య అంతరం లేకుండా పనిచేయడమే సామాజిక సేవ అని గుర్తించి, తమ జీవితాలలో దానిని ఒక కీలక భాగంగా చేసుకునేందుకు ఆయన మాటలు హాజరైన వారికి ప్రోత్సాహాన్ని ఇచ్చాయి.




గురువందనం



మాతాపితర వందనం














### పరమవీర వందన: జాతీయ హీరోలను గౌరవించుకోవడం

ఈ ప్రదర్శన కార్యక్రమం భారతీయ సేనల సేవలను, త్యాగాలను గౌరవించుకునేందుకు ఉద్దేశించిన పరమవీర వందన కార్యక్రమంతో ముగిసింది. ఈ సందర్భంగా, పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి, మన దేశాన్ని ధైర్యసాహసాలతో రక్షిస్తున్న వీరులకు పరమవీర వందన గొప్ప నివాళి అని ప్రశంసించారు. మన సైనికులు ఈ దేశానికి గర్వకారణమని అంటూ, సాయుధ దళాల పట్ల గౌరవాన్ని, కృతజ్ఞతను విద్యార్థులలో పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేయడంపై ప్రశంసల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా సామాజిక సమరసత వేదిక కన్వీనర్ అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ, భారత సైనికులంటే నమ్రత, వినయం, చిత్తశుద్ధి, క్రమశిక్షణ కలిగిన వారంటూ అత్యంత ఉద్వేగంగా ప్రసంగించారు. ఒకవైపు కుల, మతాల పేరుతో దేశాన్ని చీలుస్తుంటే, దాని అఖండత్వాన్ని కాపాడేందుకు యత్నం చేస్తున్న వీర సైనికుల పట్ల మనం ఎంతో రుణపడి ఉండాలన్నారు.

అనంతరం ముఖ్య అతిథి, పిన్న వయసులోనే పరమవీర చక్ర అవార్డు పొందిన సుబేదార్ మేజర్ యోగేంద్ర సింగ్ యాదవ్ యువతకు ప్రేరణ కలిగించేలా మాట్లాడారు. శీతాకాలం వచ్చి టెంపరేచర్లు కాస్త తగ్గితేనే సాధారణ పౌరులు గజగజా వణికిపోతూ, వీలైతే ఆఫీసులకు శలవు పెట్టి కూచుంటారని, కానీ మన వీర సైనికులు మైనస్ ఇరవై డిగ్రీల చలిలో, ఎత్తైన పర్వతశ్రేణులపై కాపలా కాస్తున్న విషయాన్ని ఆయన యువతకు వెల్లడించారు. కార్గిల్ యుద్ధంలో బుల్లెట్లను ఎదుర్కొని, తాను చేసిన సాహసాన్ని, తనలో ఆ సమయంలో ముప్పిరి గొన్న దేశభక్తిని వివరించారు. నేడు యువతలో అహంకార భావన కనిపిస్తోందే తప్ప నమ్రత, సహనశీలతలు లోపిస్తున్నాయని, కానీ సైనికులు అహంకారం తమ తలకెక్కకుండా నిస్వార్థ సేవలను అందిస్తున్న విషయాన్ని పట్టి చూపుతూ, ఇదే ఒక సాధారణ పౌరుడికి, సైనికుడికి మధ్య తేడా అన్నారు.

### భారతీయ విలువలతో యువతకు ప్రేరణ కల్గించే యత్నం

ఈ నాలుగు రోజుల ప్రదర్శన కార్యక్రమంలో, భారతీయ సంస్కృతి, విలువలు, సంప్రదాయాలకు అంకితమై, కుటుంబం, సమాజం, దేశ బాధ్యత పట్ల గౌరవాన్ని పెంపొందింపచేసేందుకు అనేక 'వందన' కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలకు హాజరైన విద్యార్థులకు, యువతకు భారతీయ వారసత్వానికి కేంద్రమైన సామాజిక, సాంస్కృతిక విలువల పట్ల అవగాహనను పెంపొందించే యత్నం జరిగింది. తల్లిదండ్రులు, పెద్దల నుంచి నిస్వార్థ



సామాజిక సేవను గౌరవించడం వరకు జరిగిన ఈ కార్యక్రమాల ద్వారా ఈ ఆదర్శాలను యువతలో పాతుకుపోయేలా చేసే ప్రయత్నం జరిగింది.

**కార్యక్రమ సాధకులు, కృషి**

హిందూ ధర్మంలో అంతర్లీనంగా ఉన్న సేవా స్ఫూర్తిని పట్టి చూపడమే ఈ ప్రదర్శన లక్ష్యమని, హెచ్ఎస్ఎస్ఎఫ్– ఐఎంసిటిఎఫ్ అఖిలభారత సమన్వయకర్త గుణ్వంత్ సింగ్ కొఠారీ పేర్కొన్నారు. హైదరాబాదు వ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతి రోజూ విద్యార్థులు, పాఠశాల ప్రతినిధులు హాజరవ్వడం పట్ల హర్షాన్ని వ్యక్తం చేశారు. రోజుకు ఐదువేలమంది విద్యార్థులు, వెయ్యిమంది ప్రతినిధులు వస్తారని తాము వేసిన అంచనాకు మించి రావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. వారికి ఉదయం నుంచి రాత్రి భోజనం వరకూ అన్ని ఆహార సదుపాయాలు కార్యక్రమ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

హెచ్ఎస్ఎస్ఎఫ్ 2024 కార్యదర్శి ఎం.రామ్మూర్తి మాట్లాడుతూ, ప్రదర్శనలో స్టాళ్లు ఏర్పాటు చేసిన వారందరికీ ఫీజు రద్దు చేయడంతో, స్వల్ప బడ్జెట్లతో లేదా వ్యక్తిగత విరాళాలతో పని చేసే చిన్న సంస్థలు కూడా భారీ సంస్థల సరసన తమ పనిని ప్రదర్శించే అవకాశం లభించిందన్నారు. ఇది కేవలం సామాజిక కార్యం లేదా పనిని ప్రదర్శించడం మాత్రమే కాదని, ఈ ప్రదర్శన ఒక లక్ష్యంతో జరుగుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమం మన సాంస్కృతిక మూలాలలోకి ప్రయాణమని, భారతీయ విలువలను సజీవం చేసిన ప్రదేశమన్నారు. నిరాడంబరత, స్వావలంబన, సమాజం కేంద్రంగా ఉండే జీవితం ఎంత సుసంపన్నంగా ఉంటుందో ప్రజలకు తెలిసేలా చేసేందుకు ఉద్దేశించిందన్నారు.

బాల్యంలోనే సార్వత్రిక, మానవ కేంద్రిత విలువలను పొందుపరచాలన్న లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమం విజయవంతం కావడం పట్ల హెచ్ఎస్ఎస్ఎఫ్ (తెలంగాణ చాప్టర్) అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్ ఉత్సాహం వ్యక్తం చేశారు.

పాఠశాలల నుంచి పెద్ద ఎత్తున స్పందన రావడం పట్ల స్పందిస్తూ, విద్యార్థులలో కరుణ, బాధ్యతను పెంచిపోషించేందుకు ఎంతో జాగ్రత్తగా కార్యక్రమాలు రూపొందించామన్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమాలన్నింటి పట్లా సహకరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంతో ఉప్పొంగడం చూస్తున్న పెద్దలను ఉద్వేగానికి లోను చేసింది.. వీరు భవిష్యత్తులో దీనిని ముందకు తీసుకెళ్లాలి భగవంతుడా అని ప్రార్థించేలా చేసింది. ★



పరమవీర్ వందనం

# నిస్వార్థ సేవలకు నిలువెత్తు రూపాలు

అన్నీ డబ్బులు పడేసి కొనుక్కుంటున్న ఈ కాలంలో, ఏమీ ఆశించకుండా సేవలు చేసేవారున్నారంటే జనం నమ్మశక్యం కాదంటుంటారు. కానీ, ఇటీవలే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన హిందూ ఆధ్యాత్మిక సేవా ప్రదర్శనలో అటువంటి అజ్ఞాతవీరులు కొల్లలుగా కనిపించారు. అత్యంత స్వల్ప బడ్జెట్‌లతో, మనం ఊహించలేని సేవలు అందిస్తున్న సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు, ధ్యాన కేంద్రాలు  ఇలా ఒకటేమిటి, ఆధ్యాత్మికత, సామాజిక సేవ పక్క పక్కనే ఉంటూ సేవ, ఆధ్యాత్మికతల మధ్య అంతర్లీనంగా గల లంకెను పట్టి చూపాయి. అరక్షిత బాలబాలికల కోసం ఎన్ని ఆశ్రమాలు నగరంలో, తెలుగు రాష్ట్రాలలో ఉన్నాయో ఈ ప్రదర్శనలోనే అర్థమైంది. వీటితోపాటుగా యువతకు సాంకేతిక నైపుణ్యాలు అందిస్తున్న సంస్థలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఎంతో నిరాడంబరంగా, అజ్ఞాతంగా పేరు కోసం అర్రులు చాచకుండా వీరు చేస్తున్న సేవలను మనం అభినందించి తీరవలసిందే.

**కరుణశ్రీ సేవా సమితి సేవలు**

విశ్వహిందూ పరిషద్ సేవా చొరవలో భాగంగా అరక్షిత బాలబాలికల కోసం నడుస్తున్న ఆశ్రమాలు కోకొల్లలు అనే విషయం అక్కడే అర్థమైంది. బాలలకు, బాలికలకు వేర్వేరు ప్రాంతాల్లోని ఆశ్రమాల్లో వారిని చేరదీసి, పెంచి, పోషించి, సంస్కారం, క్రమశిక్షణ, దేశభక్తి, దైవభక్తితో భారతీయ సంప్రదాయాలకు వారసలుగా తీర్చి దిద్దటమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నారు. సరిగ్గా పాతికేళ్ల కింద ఈ సమితి కింద ప్రారంభమైన సంస్థలకు స్వంత భవన సముదాయం, శిక్షణా వ్యవస్థలకు ప్రత్యేక గదుల ఏర్పాటు, సోలార్ వ్యవస్థ, ఆర్ఓ నీటి శుద్ధి వ్యవస్థలతో అత్యాధునిక సౌకర్యాలతో ఇవి ఉంటాయి. ఇక్కడ నివసించే విద్యార్థులందరికీ శ్రీ సరస్వతీ శిశుమందిర ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నారు. నేటి వరకూ దాదాపు

రెండువందల యాభైమంది విద్యార్థులు లబ్ధిపొంది మంచి ఉద్యోగాలలో స్థిర పడ్డారు. వీరిలో ఉపాధ్యాయులే కాదు, వైద్యులు, ఇంజినీర్లు, వ్యాపారస్తులు కూడా ఉన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు చదువుకునే సమయంలో వారికి కంప్యూటర్, కుట్టు శిక్షణ, క్రాఫ్ట్, బ్యుటీషియన్ కోర్సులు, మగ్గం పని, జూట్ బ్యాగ్ల తయారీలో శిక్షణను ఇచ్చి, వారి చేత తయారు చేయించి, ఇటువంటి ప్రదర్శనలలో ప్రదర్శించి వారికి పాకెట్ మనీగా ఇస్తారని అక్కడి నిర్వాహకులు తెలిపారు. సహాయం చేయమని నిర్వాహకులు విసిగించకపోయినా, స్వచ్ఛంద విరాళాలను వారు స్వీకరిస్తారు. నాగర్కర్నూల్లో నడుస్తున్న జ్ఞానేశ్వర సేవా ట్రస్టు కూడా ఈ కోవకు చెందిందే.

**వాత్సల్య సింధు**

గత 35 సంవత్సరాలుగా కేశవ సేవా సమితి ఆధ్వర్యంలో సేవాభారతికి అనుబంధ సంస్థగా సేవలందిస్తున్న వాత్సల్యం సింధు తమ కార్యకలాపాలను వివరించింది. ఎవ్వరూ లేక, నిరాశ్రయులైన బాలురను తమ ఆశ్రమంలో ఉంచుకుని వారికి విద్యను, ఉపాధిని కల్పించే పని చేస్తోంది. ఆసక్తి ఉన్న బాలురకు ప్రత్యేక నైపుణ్యాల శిక్షణను అందించడమే కాక, లెప్రసీ కాలనీకి చెందిన కౌమార దశలోని ఆడపిల్లలకు నైపుణ్యాలలో శిక్షణనందిస్తోంది.

ప్రతి బ్యాచ్కు 31 మంది ఆడపిల్లల చొప్పున నేటివరకూ 186మందికి శిక్షణను ఇచ్చారు. దాతల సహకారంతో నడుస్తున్న ఈ సంస్థకు ఆసక్తి ఉన్నవారు తోడ్పడవచ్చని నిర్వాహకులు అన్నారు.

**సేవాభారతి ఆధ్వర్యంలో శిక్షణా కేంద్రాలు**

దిగువ మధ్య తరగతి, మధ్య తరగతి మహిళలకు స్వయం ఉపాధి వట్ల ఆసక్తిని కల్పించి, ప్రోత్సహించాలన్న లక్ష్యంతో పలు వృత్తి విద్యా శిక్షణ తరగతులను సేవా భారతి ఆధ్వర్యంలో కౌశలం సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ నిర్వహిస్తోంది. తెలంగా ప్రభుత్వ అనుబంధ విభాగం సెట్విన్తో కలిసి అతి తక్కువ ఫీజులతో ఈ కేంద్రం ఫ్యాషన్ డిజైనింగ్, బ్లౌజ్ డిజైనింగ్, మగ్గం, టై అండ్ డై ఫ్యాబ్రిక్, పెయింటింగ్, ఎంబ్రాయిడరీ తదితర సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తోంది.

మంచిర్యాలకు చెందిన నయీదిశ– సేవాభారతి సైన్యంలో, గ్రూప్స్ పరీక్షలలో అర్హులయ్యేందుకు శిక్షణను అందిస్తోంది. నిరుద్యోగ యువతీయువకులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఈ ఆశిక్షణను అందిస్తారు. నయీఈ దిశ కార్యక్రమం ద్వారా 700మంది శిక్షణ పొందారు. 2022లో జరిగిన పోలీసు నియామకాల కోసం 75మంది శిక్షణ తీసుకొని, మొత్తం 75మంది భౌతిక పరీక్షలలో విజయం సాధించగా, అందులో నలుగురు బాలికలు పోలీసు ఉద్యోగం సంపాదించగా, 10మంది గ్రూప్స్లో ఉత్తీర్ణులయ్యారని నిర్వాహకులు చెప్పారు. నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు నయీదిశ ద్వారా యువతకు సాంకేతిక నైపుణ్యాలలో శిక్షణను ఇవ్వాలని సంస్థ నిర్ణయించుకుంది.

**అనాథ వృద్ధులు, వికలాంగులు, అంధులకు సేవలు**

జడ్చర్లలోని శ్రీ సత్యేశ్వర సేవా ఆశ్రమం, భారతీ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భాగ్య నగరంలోని మేడిపల్లిలో అనాథల, అభాగ్యుల పట్ల ప్రేమను మించిన భగవదారాధన లేదన్న స్వామి వివేకానందుడి ప్రబోధాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రారంభించామని నిర్వాహకులు చెప్పారు. నిస్సహాయ స్థితిలో రోడ్లపై తిరిగే అనాథలను తీసుకువచ్చి, వారికి అవసరమైతే వైద్యం చేయించి సేవలు అందిస్తున్నదీ ఫౌండేషన్. అంధులు, వికలాంగులు, వృద్ధులు సహా నిస్సహాయంగా ఉన్నవారికి సేవలు అందిస్తోంది. కాగా, ప్రస్తుతం రేకుల షెడ్లో నడుస్తున్న ఈ ఆశ్రమాన్ని పక్కాభవనంగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

**ఆలయాల పూర్వ వైభవం కోసం..**
**అన్నామలయార్ ట్రస్టు:**

గ్రామాలలో ఆలనాపాలనా లేక నిర్లక్ష్యానికి గురవుతున్న ఆలయాలను గుర్తించి, ఆ గ్రామస్తులను ఒప్పించి, తామే శ్రమదానం చేసి వాటిని వాటి అసలు స్వరూపానికి తీసుకువచ్చి, గ్రామస్తులకు అప్పగిస్తున్నారు అన్నామలయార్ ట్రస్టు నిర్వాహకులు, వాలెంటీర్లు గత పంతొమ్మిది ఏళ్లుగా. చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయి, అక్కడ ఆలయం ఉందని కూడా గ్రామస్తులు మర్చిపోయిన ఆలయాన్ని గుర్తించి, ఆ మొక్కలను పీకి, శుభ్రం చేసి మరీ అందిస్తున్నారు వారు. వి. రామచంద్రన్ అనే వ్యక్తి అనారోగ్యంతో ఉన్న సమయంలో ఆలయానికి వెళ్లినప్పుడు ఎవరో, ఆలయాలకు సేవ చేస్తే ఆరోగ్యం, ఆయుష్షు కలుగుతాయన్న మాటలను గంభీరంగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు వాలంటీర్లు తెలిపారు. కంచి జిల్లాలో ఈ రకంగా ప్రారంభమైన వారి సేవ రాష్ట్ర సరిహద్దులను దాటి ఆంధ్ర ప్రదేశ్లోని చిత్తూరు జిల్లాలోకి ప్రస్తుతం ప్రవేశిస్తోంది. ఈ సేవా కార్యక్రమంలో ఐటి, బ్యాంకు, ఇన్సూరెన్స్ ఉద్యోగులు స్వచ్ఛందంగా వారితో కలిసి పని చేస్తున్నారు. నేటి వరకూ 102 ఆలయాలను శుభ్రం చేసి గ్రామస్తులకు అప చెప్పినట్టు వారు తెలిపారు. తాము విరాళాలు



కోరడం లేదని, ఇచ్చే వారి నుంచి కూడా పారదర్శక రూపంలో ఉంటేనే తీసుకుంటున్నామని వారు తెలిపారు.

**కాలడి మఠం:**

ఆదిశంకరులు జన్మ స్థలం కేరళలోని కాలడి. ఆ ప్రాంతం కేంద్రంగా పని చేస్తోంది తెలంగాణ కాలడి మఠం. పురాతన ఆలయాల పునరుద్ధరణ, ఆధ్యాత్మిక, సామాజిక అభ్యున్నతికి తాము అంకితమైనట్టు మఠ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం దేవసేవ ప్రాజెక్టు కింద నిరుపేద విద్యార్థులకు వేద విద్యను అందించి, చిన్న చిన్న ఆలయాలలో నియమిస్తున్నట్టు వారు తెలిపారు. భవిష్యత్తులో ప్రాచీన జ్ఞానానికి ఆధారమైన ఉన్నత విద్యను అందించే విద్య, ఆధ్యాత్మిక కేంద్రంగా ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణకు కృషి చేయాలన్నది తమ లక్ష్యమని వారన్నారు.

**డా॥ సూరి భగవంతం ఫౌండేషన్**

దేశ అభివృద్ధిలో శాస్త్ర విజ్ఞాన ప్రాముఖ్యతను నొక్కి చెప్పిన డా॥ సూరి భగవంతం దార్శనికుడు. నాడే రక్షణమంత్రికి శాస్త్ర సలహాదారుగా, డిఆర్‌డిఓ డైరెక్టర్ జనరల్‌గా, బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్‌గా, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా ఆయన అందించిన సేవలు మరువలేనివి ఫౌండేషన్ ప్రతినిధి ఎస్‌బి రామ్ పేర్కొన్నారు. రక్షణ రంగంలో 'మేకిన్ ఇండియా' భావనకు ప్రాణం పోసింది ఆయనేనని, దీనికి అనుగుణమైన ప్రయోగశాలలను దేశవ్యాప్తంగా స్థాపించడంలో క్రియాశీలక పాత్ర పోషించారని ఆయన చెప్పారు. నాటి శాస్త్రవేత్తలను నేటి యువతకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఉస్మానియా యూనివర్సిటీలో ఇటీవలే ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించినట్టు తెలిపారు. ప్రభుత్వ బడులు, కళాశాలలకు ప్రయోగశాలల పరంగా అన్ని సౌకర్యాలూ లేవని, అందుకే వాటిని సందర్శించి, అక్కడి ప్రయోగశాలల పరిస్థితిని గమనించి, అక్కడ అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానాన్ని కల్పించేందుకు డిఆర్‌డిఓ మాజీ డైరెక్టర్ జి. సతీష్‌రెడ్డి నేతృత్వంలో తమ సంస్థ పని చేస్తోందని ఆయన వివరించారు. బడులు, కళాశాలలు ఈ అంశంలో తమను సంప్రదిస్తే, తాము చేయగలిగిందంతా చేస్తామని ఆయన అన్నారు.

**గోరక్షణే తక్షణ కర్తవ్యం**

తెలంగాణ ప్రాంతం గో సేవా విభాగం ఈ ప్రదర్శనలో తమ స్టాల్‌ను పెట్టి మన జీవితాలలో గోవు ఆధ్యాత్మిక ప్రాధాన్యతను, ఆరోగ్య ప్రదాయినిగా ఆవు వల్ల మనకు కలిగే లాభాలను, ఆర్థికంగా, వైజ్ఞానికంగా ఆవుకున్న ప్రాధాన్యతను సందర్శకులకు వివరించారు. దానితో పాటుగా గోఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచి, వాటిని వాడటం వల్ల కలిగే లాభాలను వివరించారు. దానితో పాటుగా 1947లో జనాభా 33 కోట్లు ఉండగా, గోసంతతి 130 కోట్లు ఉండేదని, ప్రస్తుతం మానవ జనాభా సుమారు 140 కోట్లు ఉండగా, గోసంతతి మాత్రం 20 కోట్లు మాత్రమే ఉందని, ఇది ఆందోళనకరమైన విషయమని వారు వివరించారు. మన రాజ్యాంగంలో ఆర్టికల్ 48 'గోవధ నిషేధాన్ని' సూచించగా, తెలుగు రాష్ట్రాలలో మాత్రమే పాక్షిక 'గోవధ నిషేధ చట్టం' ఉందని వారు తెలిపారు. కనుక గోవులను కాపాడుకునేందుకు ప్రజలు విస్తృత స్థాయిలో గో ఉత్పత్తులను వినియోగించడాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు.

**గోవులకు స్నేహితులు 'గో పాల్స్'**

దేశవాళీ ఆవుల గురించి ప్రజలలో జాగృతిని తెచ్చేందుకు ఈ సంస్థ పని చేస్తోంది. రసాయన రహిత ఆహార పదార్థాలకు, కర్బన ఉద్గారాలు లేని వాతావరణానికి, విష రహిత వ్యవసాయానికి, నిలకడైన జీవనానికి గోవులు ఎంత ముఖ్యమో వారు సందర్శకులకు వివరించారు. తద్వారా ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటుగా, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడం వంటి లక్ష్యం కోసం పాల్పడుతున్నట్టు నిర్వాహకులు వివరించారు.

**ప్రదర్శనకు తరలి వచ్చిన అమ్మవారు, అయ్యవార్లు**

ఈ ప్రదర్శనకు బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారు, కొమరవెల్లి మల్లన, కొండగట్టు ఆంజనేయుడు తరలి వచ్చి భక్తులకు ఆశీస్సులను అందించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి, అయ్యవారి దర్శనం చేసుకొని సంతోషించడం కనిపించింది. వీరితో పాటుగా, హంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థాన పర్యవేక్షణలో, రంగారెడ్డి జిల్లా, నందివనపర్తి గ్రామానికి చెందిన శ్రీశ్రీశ్రీ జ్ఞానసరస్వతి ఆలయం వారు కూడా తమ స్టాల్‌ను ఏర్పాటు చేసి, తాము చేపడుతున్న కార్యక్రమా లను వివరించారు.




**మార్గదర్శనానికి విచ్చేసిన ఆధ్యాత్మిక సంస్థలు**

ప్రదర్శనలో చిన్న జీయర్ స్వామి నిర్మించిన సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం వారు తాము నిర్వహిస్తున్న కార్యకలాపాలను వివరిస్తూ, తమ సాహిత్యాన్ని ప్రదర్శనలో ఉంచారు. వీరితో పాటుగా మాతా అమృతానందమయి, శ్రీశ్రీ రవిశంకర్‌కు చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్, రామకృష్ణ మఠం, ఆశారాం బాపూ, సహజ యోగ, వివేకానంద కేంద్ర కన్యాకుమారి, అరబిందో సహా పలు ఆధ్యాత్మిక సంస్థలు తమ సాహిత్యాన్ని, కార్యకలాపాలను ప్రదర్శించారు. సహజయోగ, హిమాలయ ధ్యాన యోగ వంటి సంస్థలు సందర్శకులకు ధ్యానం చేయడాన్ని, దానివల్ల కలిగే లాభాలను సందర్శకులకు వివరించారు.

**డి. అరుణ**

# ఈవీ వాహనాల

**భాగ్యనగర వాయుకాలుష్యం ఢిల్లీతో పోటీ పడుతున్నదన్న వార్త నేపథ్యంలో ఎలక్ట్రానిక్ వాహనాల వినియోగం మీద రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయంగానే అనిపిస్తుంది. కానీ ఇదే వేగం అన్ని విధానాలలోను కనిపించక పోవడమే విచారకరం. సంక్రాంతి నుంచి సన్నబియ్యం అందుకోవాలన్న ప్రజల మనోవాంఛ నెరవేరేటట్టు కనిపించక పోవడమే ఇందుకు నిదర్శనం.**

ఎలక్ట్రానిక్ వాహనాల(ఈవీ)పై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అటు పర్యావరణానికి, ఇటు వాహనదారులకు ప్రయోజనం కలిగించేలా ఉందని హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకానికి కొనసాగింపుగా తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తాజాగా విడుదలైన భారత కాలుష్యకారక నగరాల జాబితాలో రాజధాని ఢిల్లీ నగరం అత్యంత కాలుష్యకారక నగరంగా నమోదు కాగా.. హైదరాబాద్ ఏడో స్థానంలో నిలిచింది. అంటే.. ఈ విషయంలో హైదరాబాద్ కూడా ఆందోళనకర స్థాయిలోనే ప్రధానంగా వెనుకడుగు వేయిస్తోంది. ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బ్యాటరీ వాహనాల కొనుగోళ్లు భారీగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు రోడ్‌ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు పూర్తిగా మినహాయింపు ఇచ్చింది. ఈ సదుపాయం అన్నిరకాల ఎలక్ట్రిక్ వాహనాలకు అమలు చేస్తారు. గతంలో రోడ్‌ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజుకు పరిమితులు ఉండేవి. ప్రతి యేడాది తొలి 2లక్షల బైక్‌లు, 8వేల కార్లు, 2వేల ఆటోలకు మాత్రమే ఈ మినహాయింపులు ఇచ్చేవారు. ఈ మినహాయింపులపై ఇప్పుడు ఎలాంటి పరిమితి లేదని




ఉందన్నది దీని సారాంశం. ఈ నివేదిక నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈవీ వాహనాలకు సంబంధించి తీసుకున్న ఈ నిర్ణయం వెంటనే అమలులోకి వచ్చిందని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. 2026 దాకా అమలులో ఉంటుందని వెల్లడించింది. ఎలక్ట్రిక్ వాహనాలకు రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు పూర్తిగా ఎత్తివేసింది. ఇది రాష్ట్ర ప్రజలకు ఆశాజనకంగా మారింది. అటు.. పర్యావరణానికి కూడా మేలు జరిగే పరిస్థితులు ఉన్నాయి. ప్రజలకు, పర్యావరణానికి రెండు రకాలుగా ప్రయోజనం చేకూర్చే ఈ నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నారు. అయితే, పథకం అమలులో అధికార వర్గాల నుంచి గానీ, ఇతర ప్రభుత్వ విభాగాల నుంచి గానీ ఏమైనా ఇబ్బందులు తలెత్తుతాయా? అన్నది చూడాల్సి ఉంది.

ఓవైపు.. పెట్రోల్, డీజిల్ ధరలతో బెంబేలెత్తి పోతున్న జనం.. మరోవైపు.. పర్యావరణ హితం గురించి కూడా కొంతకాలంగా ఆలోచిస్తున్నారు. అయితే, ఎలక్ట్రిక్ వాహనాల మైలేజీ అంశం ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది. ప్రస్తుతం రోడ్ ట్యాక్స్ రూపంలో చూసుకుంటే పదిలక్షలకు పైగా ధర ఉన్న కారుకు 17శాతం, బైక్‌లకు 12శాతం రోడ్‌ట్యాక్స్ విధిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూపంలో మరింత ఖర్చవుతుంది. ఇప్పుడు ఎలక్ట్రిక్ వెహికిల్ కొంటే ఈ ఖర్చులన్నీ తప్పించుకోవచ్చు.

పెట్రోల్, డీజిల్ ధరలకు తాళలేక ఎలక్ట్రిక్ వాహనాల వైపు చూస్తున్నవారికి ప్రస్తుత వెసులుబాటు మరింత ప్రయోజనకరంగా మారింది. ఇటీవలే కొన్నవారికి, ఇకపై కొనాలనుకుంటున్న వారికి ఇది బంపర్ ఆఫర్ అనే చెప్పుకోవచ్చు. వాహన కాలుష్యాన్ని నియంత్రించే ప్రధాన లక్ష్యంతో 2026 డిసెంబర్ 31దాకా అన్ని రకాల ఎలక్ట్రిక్ మోటారు వాహనాలకు రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజును మినహాయించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. శబ్ద, వాయు కాలుష్యాన్ని నిరోధించే ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, కార్లు, ట్యాక్సీలు, క్యాబ్‌లు, ఆటోరిక్షాలు, తేలికపాటి రవాణా వాహనాలు, బస్సులకు రోడ్‌ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు రద్దయ్యాయి. రాష్ట్రంలో కొన్న ఎలక్ట్రిక్ ట్రాక్టర్లకు కూడా ఈ పథకం వర్తిస్తుంది. ఈ మేరకు జీవో నెంబర్ 41 కూడా జారీ అయ్యింది. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 1.7 లక్షల ఈవీలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. అదే విధంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మూడువేల ఈవీసిటీ బస్సులు ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 15ఏళ్లు దాటిన పాత వాహనాలకోసం స్క్రాప్ పాలసీ తీసుకువచ్చింది. త్వరలో రెండు స్క్రాప్ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి.

కార్ల ధర 10 లక్షల లోపు అయితే 14శాతం, ధర 10 లక్షలపైన అయితే 17శాతం రోడ్ ట్యాక్స్ మిగులుతుంది. ఒకవేళ కొనుగోలుదారు పేరిట అప్పటికే బైక్ గనక ఉంటే 2 శాతం అదనంగా ట్యాక్స్ పడుతుంది. అంటే మొత్తం 19 శాతం మిగులుతుంది. ఆ రకంగా ఈవీ కారు కొన్నవారికి రూ.1.40 లక్షల నుంచి రూ.1.90 లక్షల దాకా మిగులుతుంది. ద్విచక్రవాహనాలయితే కొన్న ధరలో 12శాతం రోడ్ ట్యాక్స్ మిగులుతుంది. బైక్‌లు, కార్లకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1500–2వేల వరకు మిగలనుంది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పరిమిత ఎలక్ట్రిక్ వాహన విధానాన్ని అందుబాటులోకి తెచ్చే నాటికి రాష్ట్రంలో కేవలం పది వేల ఎలక్ట్రిక్ వాహనాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 1.61 లక్షల కొత్త వాహనాలు రోడ్డెక్కాయి. కొత్తగా కొన్న వాహనాలకు వర్తించిన రాయితీ మొత్తం రూ.473 కోట్లుగా అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు భారీగా పెరిగింది. అన్ని కేటగిరీ వాహనాలు కలిపి రోజూ దాదాపు 15 వరకు అమ్ముడవుతున్నాయి. వీటిల్లో ఐదారు కార్లు కూడా ఉంటున్నాయి. ఈ సంఖ్య రోజురోజుకూ క్రమంగా పెరుగుతోంది. దీంతో రాయితీ రూపంలో వాహన దారులకు కలిగే లబ్ధి విలువ భారీగానే ఉండనుంది. ఈ లెక్కన గతంతో పోలిస్తే రాయితీల మొత్తం మూడురెట్లు పెరుగు తుందని అంచనా. ప్రతి ఎలక్ట్రిక్ వాహనం వినియోగంతో సంవత్సరానికి రూ. లక్ష వరకు ఆదా అవుతుందని కూడా అంచనా వేస్తున్నారు.

.......

**సన్నబియ్యంపై ఊరింపు ఇంకెన్నాళ్లు?**

రాష్ట్రంలో కొన్ని పథకాలు విషయంలో వాటిని ప్రకటించడంలో ఉన్న ఉత్సాహం అమలులో కని పించడంలేదు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి, మంత్రులు చేసిన ప్రకటనలు కూడా అమల్లోకి రావడం లేదు. ముందూ వెనుకా చూసుకోకుండా, వాస్తవ పరిస్థితులను అంచనా వేసుకోకుండా ప్రకటనలు చేస్తున్నారు.

# ప్రకటన ఉభయ తారకం

ప్రకటనలు చూసి మురిసిపోతున్న జనం సంతోషం.. మూన్నాళ్ల ముచ్చటే అవుతోంది. ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పుడు రేషన్ కార్డుదారులను ప్రభుత్వం చేసిన సన్నబియ్యం ప్రకటన ఊరిస్తోంది. జనవరి నుంచి అంటే సంక్రాంతి నుంచి రేషన్ కార్డుల మీద సన్నబియ్యం అందిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆర్భాటంగా ప్రకటించారు. దీంతో రేషన్‌కార్డు దారులు సంక్రాంతి ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నారు. కానీ, ప్రాక్టికల్‌గా చూస్తే.. సంక్రాంతికి ఈ హామీ అమలయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో, ఈ హామీ కూడా ఊరించి. ఉసూరుమనిపించేలా తయారయ్యింది. ఈ పథకం 'సంక్రాంతికి కాదు.. ఉగాది నుంచి' అని అధికారులు అంటున్నారు. ఇప్పుడు రైతుల దగ్గర కొన్న ధాన్యాన్ని, మిల్లింగ్ చేస్తే.. అవి కొత్త బియ్యం కాబట్టి.. అన్నం ముద్దగా అవుతుందని చెబుతున్నారు. ఖరీఫ్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన కొత్త ధాన్యాన్ని వెంటనే మిల్లింగ్ చేస్తే... బియ్యంలో నూక శాతం పెరుగుతుందని, అన్నం ముద్దగా మారుతుందని, నాణ్యత లోపిస్తుందని నిపుణులు సూచిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. కనీసం మూడు నెలలపాటు ధాన్యాన్ని తప్పకుండా నిల్వ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సన్న బియ్యాన్ని స్టేట్ పూల్ రిజర్వు గోడౌన్లలో నిల్వ చేసి, మూడు నెలల తర్వాత ఉగాది నుంచి రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయాలనే ఆలోచన చేస్తున్నామంటున్నారు. ఆ బియ్యం వండుకునేందుకు అనువుగా అయ్యేందుకు కనీసం మూడు నెలలు ఆగాలంటే.. ఉగాది నుంచి సన్న బియ్యం ఇస్తారనే ప్రచారం మొదలైంది.

2025లో ఉగాది మార్చి 30న వచ్చింది. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి వరకూ బియ్యాన్ని నిల్వచేస్తే.. అవి పాతబియ్యంగా మారతాయి. అప్పుడు ప్రజలకు ఇవ్వాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. అదే జరిగితే.. రేషన్ కార్డుదారులకు నిరాశ తప్పదు. మరో 4 నెలలపాటూ ఎదురు చూడాల్సి ఉంటుంది. కానీ, సన్న బియ్యాన్ని సంక్రాంతి నుంచి ఇస్తారని ఎదురుచూస్తున్న ప్రజలు, అధికారుల ప్రకటనతో నిరాశ పాలవుతున్నారు. దీంతో, మంత్రులు ఇలా రేషన్ లబ్దిదారులను ఇబ్బంది పెట్టడం సరికాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మరోవైపు.. ప్రభుత్వం మరో సమస్యను తెరపైకి తెస్తోంది. రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం సంవత్సరం పాటూ ఇవ్వాలంటే.. ఈ పథకానికి నెలకు 2లక్షల టన్నుల చొప్పున ఏడాదికి 24 లక్షల టన్నుల బియ్యం అవసరం. అంటే.. 36 లక్షల టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేయాలి. కానీ, ప్రస్తుతం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సన్న ధాన్యం పెద్దగా రావడం లేదు. ఇప్పటి వరకు కేవలం 3 లక్షల టన్నులే వచ్చాయి. రైతులు బహిరంగ మార్కెట్లోనే సన్నాలను అమ్ముకుంటున్నారు. సన్నధాన్యం దిగుబడి అంచనాలు ఎప్పటికప్పుడు మారుతున్నాయి. కొనుగోలు కొనుగోలు కేంద్రాలకు 50 లక్షల టన్నుల సన్న ధాన్యం వస్తుందని సీజన్ ప్రారంభంలో అంచనా వేసిన ప్రభుత్వం, ఆ తర్వాత 40 లక్షల టన్నులుగా,



తాజాగా 35లక్షల టన్నులుగా ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో సన్న బియ్యం పంపిణీకి సరిపోయేలా ధాన్యం వస్తుందా? లేదా? అనే సందేహాలున్నాయి. ఒకవేళ లక్ష్యానికి అనుగుణంగా సన్న ధాన్యం రాకపోతే సన్న బియ్యాన్ని మళ్లీ బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయాల్సి వస్తుంది. అదే జరిగితే... మళ్లీ టెండర్లు పిలవడం, రైస్‌మిల్లర్ల నుంచి ప్రొక్యూర్మెంట్ చేయటం వంటి పనులుంటాయి. ఐతే.. రబీలో కూడా వరిని పండిస్తారు. ఆ బియ్యాన్ని కూడా రేషన్ కార్డుదారులకు ఇవ్వొచ్చు, అది సమస్య కానే కాదు. ఖరీఫ్‌లో పండించినవి కాకుండా.. అంతకుముందు రబీలో పండించిన సన్న బియ్యాన్ని సంక్రాంతి నుంచి ఇవ్వొచ్చు కదా.. అని కొందరు అంటున్నారు. అయినా సర్కారు నుంచి స్పందన లేదు.

కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ కార్డుదారులకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకు రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తామని ఇటీవలే ప్రభుత్వం తెలిపింది. పేదలకు ఉచితంగా సన్న బియ్యం అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30.50 లక్షల రేషన్ కార్డు దారులకు ఉచితంగా ఆరు కిలోల సన్నబియ్యాన్ని అందిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వచ్చే ఏడాది జనవరి 2025 నుంచి అంటే సంక్రాంతి పండుగ నుంచి సన్న బియ్యం సరఫరా చేస్తామని తెలిపారు. కానీ, ఇప్పుడు ఆ హామీ, ఆ ప్రకటన అమలులో కూడా మరింత జాప్యం జరుగుతోంది. అంటే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 16 నెలల తర్వాతే సన్నబియ్యం ఇచ్చినట్లవుతుంది. మార్చి 30న సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించినా, బియ్యం ఏప్రిల్ 1 నుంచి ఇచ్చి, వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ ఖాతాలో వెయ్యాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం దీనిపై కచ్చితమైన స్పష్టత ఇవ్వడంలేదు. ఏదో ఒక మెలిక పెడుతూ ఉంటే.. ఇక పేదలకు సన్న బియ్యం దక్కేదెప్పుడు? అధికారులు.. దక్కేలా చెయ్యాలి గానీ.. పేదల్ని ఇబ్బంది పెట్టడం సరికాదని నిపుణులు అంటున్నారు. అందువల్ల ప్రభుత్వం సంక్రాంతి నుంచి సన్న బియ్యం ఇస్తుందా, ఇవ్వదా అనేది సందేహంగా మారింది.

గత బీఆర్ఎస్ సర్కారు కూడా సన్నబియ్యం అంటూ ఊరించింది. అనేక సార్లు ప్రకటనలు చేసింది. ప్రజలు ఎదురుచూడటం తప్ప.. హామీలు, ప్రకటనలు అమల్లోకి రాలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు కూడా అలాగే కాలం గడిపేలా ఉంటాయా? ఆలస్యంగానైనా అమలవుతాయా? అనేది చూడాలి.

**సుజాత గోపగోని**
**సీనియర్ జర్నలిస్ట్, 6302164068**

# ప్రజా సమస్యలపై సభలో

**భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలు ప్రజాసమస్యలను శాసనసభ సభలో ప్రస్తావిస్తూ, వాటి పరిష్కారానికి చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే శాసనసభ సమావేశాలకు హాజరౌతానని వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొనడమేకాక ఎమ్మెల్యేలనూ పంపకపోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా బీజేపీ ప్రజాశ్రేయస్సుకు కృషిచేస్తోంది. ఆ మేరకు టిడ్కో ఇళ్లు, బోధనాసుపత్రుల నిర్మాణంలో జాప్యం, రుషికొండ ప్యాలస్ నిర్మాణం, 108 సర్వీసులు వంటి పలు అంశాలపై పార్టీ సభ్యులు తమ వాదనలు వినిపిస్తున్నారు.**




టిడ్కో హౌసింగ్‌పై లఘు చర్చను పార్టీ శాసన సభా పక్ష నేత విష్ణుకుమార్ రాజు ప్రారంభిస్తూ, 'వైసీపీ ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేయక అబ్ధిదారులకు అన్యాయం చేసింది. విలువైన ప్రజాధనాన్ని వృథా చేసింది. రాష్ట్రానికి 7 లక్షల 14 వందల ఇళ్లను కేంద్రం కేటాయించింది. 5 లక్షలు ఇళ్లకు పరిపాలను అనుమతి మంజూరు చేసి 4 లక్షల 54 వేల 706 ఇళ్లకు టెండర్‌లు పిలిచారు. నా ఎస్సీలు, బీసీలు అంటూ అధికారానికి వచ్చిన జగన్మోహన్ రెడ్డి 2 లక్షల 68 వేల 360 ఇళ్లు రద్దు చేశారు. కాంట్రాక్టర్‌లకు చెల్లింపులు ఆపేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారులను కక్ష గట్టి మరీ మార్చేశారు. లబ్ధిదారులు మీద రుణాలు తీసుకుని వాడేసుకున్న వైసీపీ ప్రభుత్వం అడ్వాన్సులుగా కట్టిన డీడీలను కూడా బ్యాంకుల్లో ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడింది. టిడ్కో ఇళ్లకు మంచి రంగులను చెరిపేసి, వైసీపీ రంగులు వేయించారు' అని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం అక్రమాలన్నింటిపై దర్యాప్తునకు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు.



**కక్షసాధింపు ధోరణితో నాశనం..**

2022 కల్లా ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు ఉండాలని 2014-19 మధ్య కాలంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్ణయించారు. అప్పటి కేంద్ర పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి వెంకయ్యనాయుడు ఆయనతో పలుమార్లు చర్చలు జరిపి దేశంలో ఇతర రాష్ట్రాల కన్నా ఎక్కువగా 7,01,481 టిడ్కో ఇళ్లు ఆంధ్రప్రదేశ్‌కు మంజూరు చేయించారు. వీటిలో తొలుత 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతి ఇచ్చారు. 4,54,704 ఇళ్ల నిర్మాణానికి 2017 జూలైలో టెండర్లు పిలిచి వెంటనే ఆ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారే సమయానికి అంటే 2019, మే నాటికి 77,371 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. అయితే తర్వాత వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో ఇళ్ల నిర్మాణాన్ని నిలిపివేసింది. టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన 5 లక్షల ఇళ్లలో 2,38,368 ఇళ్లను రద్దు చేసేసింది. మిగిలిన వాటిలో కేవలం 57 వేల ఇళ్లను మాత్రమే మౌలిక సదుపాయాలతో గత ఐదేళ్లలో పూర్తి చేశారు. అంతకుముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో 90 శాతం వరకు పూర్తి చేసిన మరో 1.10 లక్షల ఇళ్లను పూర్తి చేసినట్లు చెబుతున్నా.. అవి పేరుకు మాత్రమే. ఇక మిగిలిన ఇళ్లన్నీ అలాగే వదిలేశారు.

**ఇష్టానుసారం మార్చేశారు**

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల్లో రెండు రకాల ఇళ్లను మొదలుపెట్టారు. మొదటి రకం ఇళ్లకు అడ్వాన్సుగా రూ. 50 వేలు, రెండవ రకానికి రూ. లక్ష చొప్పున లబ్ధిదారులు ముందుగానే చెల్లించాలని అప్పట్లో నిర్ణయించగా, వారు ఆనందంగా ముందుకు వచ్చారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేసింది. అడ్వాన్సు కూడా తిరిగి చెల్లించలేదు. టిడ్కో ఇళ్ల సముదాయాల్లో ఆర్థిక కార్యకలాపాల కాంప్లెక్స్ కోసం కేటాయించిన 5 నుంచి 10 ఎకరాలను కూడా లేకుండా చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లకు ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో చాలా మందిని వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారం మార్చేసింది. 25 శాతం కంటే తక్కువ పనులు పూర్తయిన ఇళ్లను (52 వేలు) అర్థంతరంగా నిలిపివేయడంతో రూ. 339 కోట్ల ప్రజాధనం వృథా అయ్యింది. పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ. 540 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టేశారు. కరోనా సమయంలో మొబిలైజేషన్ అడ్వాన్సులపై వీవరింగ్ రూ. 110 కోట్లు, డీవియేషన్ ఆఫ్ ఐటమ్స్ కింద రూ. 1,225 కోట్లు, ప్రైస్ అడ్జెస్ట్‌మెంట్ రూ. 189 కోట్లు పెండింగ్ లో ఉన్నాయి. ఇలా టిడ్కో ఇళ్లను అన్ని విధాలుగా నాశనం చేశారు. దీనిపై అధికారులు విచారణ చేస్తున్నారు. ఇళ్లపై వైసీపీ రంగులు వేయడానికి ప్రభుత్వం నుంచి పరిపాలనాపరమైన అనుమతి లేదు. టెండర్లు పిలవలేదు. కేవలం నోటి మాటతో రూ. 300 కోట్లతో రంగులు మార్చేశారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఇంతవరకు డబ్బులు చెల్లించలేదు. నిర్మాణం పూర్తికాకుండానే 40,571 టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల పేర్లతో జగన్ ప్రభుత్వం రుణాలు తీసుకుంది. ఇప్పుడు ఆ రుణాలు చెల్లించాలంటూ బ్యాంకు అధికారులు లబ్ధిదారులపై ఒత్తిడి తెస్తున్నారు. వారి అకౌంట్లు ఎన్‌పీఏలోకి వెళ్లిపోయాయి.

**'ఆవాస్ యోజన' అవకతవకలపై దృష్టి పెట్టండి**

వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అమలులో జరిగిన అవకతవకలపై దృష్టి సారించాలని బీజేపీ శాసనసభ పక్ష నేత విష్ణుకుమార్‌రాజు, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్‌కు విజ్ఞప్తి చేశారు. 2019-24 మధ్య ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద.. నిర్దేశిత లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణం జరగకపోయినా లబ్ధిదారుల




పేరుతో రుణాలు సేకరించి, నిధులు పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఇళ్లు పూర్తికాకపోయినా, వాయిదాలు చెల్లించాలంటూ బ్యాంకులు జారీ చేసిన నోటీసులతోలబ్ధిదారులు మానసిక వ్యథకు గురవుతున్నారని, ఇళ్లు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరగక 43 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. అలాగే, కొవిడ్ వల్ల నిర్మాణాలు

# బీజేపీ గళం

ఆలస్యమైతే, ధరల పెరుగుదల నిబంధనను ప్రభుత్వం పట్టించుకోక 2019 ముందు ప్రారంభించిన ఇళ్లు కూడా పూర్తి కాలేదని తెలిపారు. ఇళ్లు పూర్తయినట్లు అప్పటి సీఎం జగన్ కేంద్రానికి తప్పుడు నివేదిక ఇచ్చారని వివరించారు. దీనిపై స్పందించిన దినకర్, సమగ్ర సమాచారం సేకరించి, సీఎంకు నివేదిక ఇస్తామని తెలిపారు.

**కొత్త మెడికల్ కళాశాలల్లో సౌకర్యాలపై....**

రాష్ట్రంలో నూతన వైద్య కళాశాలల నిర్మాణంలో గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దుయ్యబట్టారు. వైద్యకళాశాలల నిర్మాణం విషయంలో జగన్ పక్షపాతం చూపారని,అన్ని మెడికల్ కళాశాలల నిర్మాణానికి ఒకే విధంగా నిధులు ఖర్చుచేయలేదని మండిపడ్డారు. పులివెందులలో కాలేజీ నిర్మాణానికి రూ.500 కోట్లకుగాను రూ.293కోట్లు ఖర్చు చేసి, గిరిజన ప్రాంత విద్యార్థుల కోసం పాడేరులో కళాశాల నిర్మాణానికి పైసా ఖర్చు చేయలేదన్నారు. మార్కాపురం, ఆదోని, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో కేవలం 10 శాతం నిధుల్ని మాత్రమే ఖర్చు చేయడం వివక్ష కాదా? అని సత్యకుమార్ ప్రశ్నించారు. 2019–24 మధ్య కాలంలో రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేసిన 17 వైద్య కళాశాలలకు రూ.8,840 కోట్లు ఖర్చు చేయాలి. ఇందులో రూ.4,950 కోట్లు కేంద్రం, రూ.3,500 కోట్లు రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలి. గడిచిన ఐదేళ్లలో రూ.2,125 కోట్లు ఖర్చు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి చెల్లింపులు జరగలేదు. అరకొర వసతులు, ఫ్యాకల్టీ కొరత కారణంగా రెండో విడత కొత్త కళాశాలల మంజూరుకు జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) అభ్యంతరం చెప్పింది. దీంతో రెండో విడతలో కేవలం పాడేరు కళాశాల మాత్రమే 50 సీట్లతో ప్రారంభించింది. కొత్త వైద్య కళాశాలల్లో 70 శాతం బోధన సిబ్బంది లేరని, హాస్టల్స్ నిర్మాణం పూర్తి కాలేదన్నారు. కళాశాలలు ప్రారంభిస్తే విద్యార్థుల్ని చెట్లకింద కూర్చో పెట్టి పాఠాలు చెప్పాలా? అని మంత్రి మండిపడ్డారు. వాస్తవాలు ఇలా ఉంటే కూటమి ప్రభుత్వం వల్లే కొత్తగా వైద్య కళాశాలలు మంజూరు కాలేదని జగన్మోహన రెడ్డి సొంత మీడియాలో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏడాదిలో తాడేపల్లి ప్యాలెస్, 26 జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు, రిషికొండలో ప్యాలెస్ కట్టుకున్న జగన్.. వైద్య కళాశాలలను ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. పులివెందుల్లో వైద్య ఆస్పత్రి మాత్రమే కట్టారని, ఆడపిల్లలకు హాస్టల్స్ కట్టలేదని, వారు చెట్లకింద కూర్చొని చదువుకోవాలా? అని మంత్రి ఏకిపారేశారు. 15 వైద్య కళాశాలల నిర్మాణం పూర్తికాకపోవడంతో 750సీట్లు ఆగిపోయాయన్నారు. దీనికి బాధ్యత ఎవరిదో వైసీపీ సభ్యులే సమాధానం చెప్పాలని నిలదీశారు. మంత్రి సమాధానం సభను తప్పుదోవ పట్టించేలా ఉందంటూ వైసీపీ ఎమ్మెల్సీలు వాకౌట్ చేశారు.


**108 సర్వీసుపై**

అరబిందో సంస్థ, 2020 నుంచి రాష్ట్రంలో 108 సేవల ముసుగులో భారీ దోపిడీకి పాల్పడిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. కాలింగ్ అటెన్షన్ కింద రూల్ 74కింద 108 సేవలపై ఎమ్మెల్యేలు సమాచారం కోరగా, రూ. వందలాది కోట్లు దోచుకొని సకాలంలో రోగులను ఆస్పత్రులకు చేర్చలేక పోయిందని మంత్రి విమర్శించారు. 2005లో ఈఎంఆర్ఐ సర్వీసులను108 ప్రారంభించిందని గుర్తుచేశారు. సరైన సేవలు ఇవ్వకుండా కోట్లు దండుకుని 108 వ్యవస్థను దెబ్బతీశారని ధ్వజమెత్తారు. గోల్డెన్ అవర్‌లో వైద్య సర్వీసులు చాలా దారుణంగా ఉన్నాయని అన్నారు. 11 నుంచి 20 శాతం వరకూ మాత్రమే గోల్డెన్ అవర్‌లో రోగులను ఆస్పత్రులకు చేర్చగలిగారని మంత్రి వెల్లడించారు.


**రిషికొండ ప్యాలెస్‌పై...**

విశాఖలోని రిషికొండపై కొత్తగా నిర్మించిన భవనాలు అనే అంశంపై శాసన సభలో బీజేపీ ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, సీహెచ్ ఆదినారాయణ రెడ్డి ప్రశ్నలు లేవనెత్తారు. విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ, 'గతంలో రిషికొండపై పర్యాటక శాఖ కాటేజీలతోపాటు హోటల్ కూడా ఉండేది. వేర్వేరు ప్రాంతాలకు చెందిన పర్యాటకులు ఇక్కడ బస చేయడంతోపాటు విశాఖ నగరవాసులు హోటల్లో అల్పాహారం తీసుకునేవారు. ఆ తర్వాత కాటేజీలను పడగొట్టడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తే పర్యాటక శాఖ అధికారులు టూరిజం రిసార్ట్‌గా తెలిపారు. తీరా పూర్తయిన తర్వాత చూస్తే రూ. వందల కోట్లతో ప్యాలెస్ నిర్మాణం జరిగింది. సుమారు రూ.500 కోట్లతో వ్యయంలో రూ.434 కోట్లు తన అనుయాయులైన కంట్రాక్టర్లకు దోచిపెట్టారు. నిర్మాణ వ్యయాన్ని పరిశీలిస్తే చదరపు అడుగుకు రూ.28,096 ఖర్చవుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇది బలహీన వర్గాలకు చెందిన 27,043 ఇళ్లతో సమానం. అంతమంది పేదలకు ఇవ్వాల్సిన ఇళ్ల సొమ్ముతో ప్యాలెస్ నిర్మించుకొని ఎన్నికల ప్రచారంలో పేదలకు, పెత్తందార్లకు మధ్య పోటీ అంటూ జగన్ చెప్పుకొచ్చారు'అని ఎద్దేవా చేశారు. ఆ ప్యాలెస్ భవనాలను దేనికి వినియోగించాలనే దానిపై నివేదిక ఇచ్చేందుకు కమిటీ నియమిస్తూ గత నవంబర్ 22న జీవో 2282 జారీ చేసింది. ఆ మరుసటి నెల 7న సీఎం నివాసం కోసం కేటాయిస్తున్నట్లు పేర్కొంటూ, నోట్ ఇచ్చారు. ప్యాలెస్‌లోని పలు వస్తువుల రేట్లను ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు సభకు వివరించారు.నాటి సీఎం జగన్ "కమోడ్ కోసం రూ.11,46,840, షవర్ కోసం 5,4,27,317 ఖర్చు చేశారు.

అదేంటంటే ఆటో వాషింగ్ కమోడ్ అంటూ చెప్పారు. ఇంత విలాసవంతమైన ప్యాలెస్ కట్టుకున్న జగన్ పేదవారా? అని ఆయన ప్రశ్నించారు. గతంలో జగన్ అన్న 'పేదలు, పెత్తందారులు' మాటలను గుర్తుచేశారు.ఈ ప్యాలెస్ కోసం ప్రజల ధనం దుర్వినియోగం చేసిన జగన్‌ను జీవితాంతం జైలులో తప్పులేదని ఆయన వ్యాఖ్యానించారు. ఇదే అంశంపై మాట్లాడేందుకు ఆదినారాయణ రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు అనుమతి కోరగా, ఇది ప్రత్యేకంగా చర్చించ దగిన అంశం అంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చర్చను అప్పటికి ముగించారు.




**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్




46

# తత్వవేత్త, మహామాత్యుడు బసవేశ్వర్

సాధారణ శకం 2వ శతాబ్దంలో చాళుక్య సామ్రాజ్య పతనం తదుపరి, కర్ణాటక సామాజిక పరిస్థితి ఉచ్ఛస్థితిని అందుకున్నది. జైనమత ప్రభావం శైవమత ప్రాబల్యం వల్ల తగ్గిపోయింది. యావత్ దక్షిణభారతం, విభిన్న రూపాలలో ఉన్న శైవమత ప్రభావానికి లోనైంది.

12వ శతాబ్దం మొదటి భాగంలో బాగేవాడిలోని ఆరాధ్య కుటుంబానికి చెందిన మదారస, మదలాంబ దంపతులకు బసవేశ్వర్ జన్మించారు. ప్రతి గొప్ప వ్యక్తి జీవితాన్ని దైవత్వం ఆవేశిస్తుంది. బసవేశ్వర్ నంది అవతారమని వీరశైవుల విశ్వాసం. బసవేశ్వర్ కైలాసంలోని గాంధారులలో ఒకరనీ, భూమిపై మానవుడుగా జన్మించలసిందిగా ఆదేశితులని 'బసవరాజు దేవర్‌గాళీ' అనే గ్రంథాన్ని రాసిన విఖ్యాత కన్నడకవి హరిహరుడు పేర్కొన్నాడు. బసవేశ్వర్ నిస్సంశయంగా ఒక గొప్ప ఆధ్యాత్మిక నాయకుడు, సమూల సామాజిక సంస్కర్త , ప్రతిభావంతుడైన మంత్రి పుంగవుడు. చిన్నతనంలోనే తన కుటుంబ ఆచారాలపై తిరుగుబాటు చేసి జంధ్యం తెంపుకుని కుటుంబ వాతావరణానికి దూరంగా వెళ్లిపోయారు. కుడాల సంగమం చేరుకుని శంకరుని గూర్చి తపస్సు చేయటం ప్రారంభించారు. బసవేశ్వర్ భగవంతుని అంతేవాసి అయినా దేశ రాజకీయ జీవితంలో ఆయన ప్రధానమైన పాత్ర నిర్వహించవలసి ఉన్నందున, కశ్వాన్‌లోని బిజ్జల ఆస్థానానికి వెళ్లి అక్కడ గణాంక అధికారిగా పనిచేయ వలసిందిగా కూడా ఆదేశితులు. అయితే బసవేశ్వర్ తమ ఉత్తమ యోగ్యత కారణంగా అచిరకాలంలోనే బిజ్జల మంత్రి అయినారు.

బసవేశ్వర్ రాజకీయ జీవితం తమ ఆధ్యాత్మిక జీవనానికి ఉపయుక్తంగానే ఉండేది. శివుని పట్ల భక్తిని పెంపొందించి, మానవులను ఉన్నతులను చేయడమే ఆయన కార్యక్రమం. ఆత్మపరిశుద్ధత, ఆధ్యాత్మిక విమోచనలతో ఆసక్తి గల ప్రజల కోసం తమ యావదైశ్వర్యాన్ని ధారపోశారు. భగవంతుని సంతానమైన మానవుల మధ్య ఏ విధమైన సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలు ఉండరాదని, మానవ నిర్మితాలైన ఆ వ్యత్యాసాలు సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తాయని ఆయన వచించారు.

లింగధారులు పార్వతీపరమేశ్వరుల సంతానమని, అందుచేత ఒకరికీ మరొకరికీ మధ్య వ్యత్యాసం ఉండటానికి వీలులేదని ఆయన ఎలుగెత్తి చెప్పారు. సామాజిక హద్దులు అజ్ఞానం,అనారోగ్యకరమైన విశ్వాసాల వల్ల ఏర్పడినవేనని ఆయన చెప్పారు. కులాలపద్ధతిని ఖండించి అందరూ కులవివక్షత లేకుండా శివశరణు లేనని అన్నారు. శైవఉద్యమ ఛాయలలో ఆయన సమాజాన్నంతటినీ మతపాశంతో ఏకోన్ముఖం చేసి, విశ్వ జీవనసూత్రాలను ప్రపంచించారు. అస్పృశ్యతను ఎప్పుడూ అంగీకరించలేదు. బాహ్యమైన ఆచార వ్యవహారాలకన్నా, ఆత్మ పరిశుద్ధతయే ముఖ్యమని అన్నారు. శివునిపై భక్తి నిలిపి, మహేశ్వరారాధనతో దాసోహం కాగలిగితే, ప్రతివారికీ ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది.

మనిషి 'పశువు' అని, శివుడు 'పతి' అని, ఆ మహాదేవుని నిర్ణయానికి లొంగిపోవడంలోనే మనిషి జీవిత సాఫల్యత ఉన్నదనీ ఆయన చెప్పారు. బసవేశ్వరుని సిద్ధాంతాలు వేలకొలది ప్రజలను ఆయన వైపు ఆకర్షింపజేశాయి. వారిలో తీవ్ర ఆలోచనాపరులైనవారు 'అనుభవ మంటపం'గా రూపొంది అక్కడ ఆధ్యాత్మిక పెరుగుదలపై తమ అనుభవాలను వివరించేవారు. ఆ వివరణలు కన్నడ వచన సాహిత్యంలో భాగాలైనాయి.

మానవాత్మ ఉన్నతికై వ్యక్తులు పొందే ఆవేశపు ప్రయత్న రహితమైన వివరణే పతనము. బసవేశ్వరులు స్వయంగా గొప్ప గేయకర్త. శివుని పట్ల ఆయన గల భక్తిప్రపత్తుల వలన జీవిత విలువలను పెంపొందించాలని ఆయనకున్న ఆవేశం వల్ల, ఆయన చెప్పిన ప్రతి మాటా సాహిత్యంగా రూపొందింది, ఆయన ఉపదేశాలు చిత్తశుద్ధి, నిజాయతీ, ఆత్మపరిపూర్ణత, పనిమీద గౌరవం కలిసి రూపొందిన ఉత్తమ సాహిత్య ఖండికలు.

ఆంతరంగ పరిశీలనతో బసవేశ్వరులు తనను తాను నిర్దాక్షిణ్యంగా విమర్శించుకుని మానవ బలహీనతలను నిర్భయంగా వెల్లడి చేశారు.

– శ్రీ నరసింగరావు మన్వి
10.5.1965 జాగృతి




# కలహప్రియుడు కాదు లోకకల్యాణ కారకుడు

ఆధ్యాత్మికం

నారదుడు బ్రహ్మమానస పుత్రుడు. 'నారాయణ' నామోచ్చరణతో త్రిలోక సంచారం చేసే ఆయనను 'కలహభోజనుడు/కలహప్రియుడు' అని వాడుకలో ఉన్నా, లోకకల్యాణమే వాటి పరమార్థం. అందుకోసం సర్వలోకాల్లో స్వేచ్ఛగా సంచరించాడు. హరిభక్తుల్లో అగ్రగణ్యుడైన ఆయన ఎందరినో భగవద్భక్తులుగా చేశాడు. వాల్మీకి, వ్యాస, శుకుడు, ప్రహ్లాదుడు, ధ్రువుడు లాంటి వారిని మహాపురుషులుగా, మహాభక్తులుగా మలచిన దేవర్షి, వాల్మీకి, వ్యాసమహర్షులు శ్రీమద్రామాయణం, శ్రీమద్భాగవత మహాకావ్యాల రచనకు ప్రేరకుడు నారదుడు. 'గత జన్మలో సన్యాసులనుంచి పొందిన జ్ఞానఫలమే నా ఈ స్థాయికి కారణం. భగవద్భక్తుల సమాహారమైన భాగవతాన్ని చెప్పగలిగితే, ఆలకించిన వారు మరు జన్మలో మహాభక్తులు, జ్ఞానులు అవుతారు' అంటూ భాగవత రచనకు వ్యాసుడిని ప్రేరేపించాడు. దేవర్షి వెలువరించిన 'నారద భక్తి సూత్రాలు' పరమాత్మను సాక్షాత్కరింపచేసే అక్షర గుళికలు. భక్తి అంటే భజన,

# సమసమాజ ప్రతిష్ఠాపకులు రామానుజులు

46




సమసమాజ,ఆధ్యాత్మిక ప్రతిష్ఠాపన,ఏకత్వ ఆరాధన లక్ష్యంతో రామానుజాచార్యులు శిష్యులతో దేశవ్యాప్తంగా పర్యటించి అనేక గ్రంథాలు రాశారు. శిష్యుడు కూరేశునితో కాశ్మీరమునకేగి శారదా పీఠంలోని బోధాయన వృత్తిని గ్రహించి శ్రీరంగానికి బయలుదేరారు. ఇది తెలిసి, ఆ పీఠాను యాయులు ఆయనను వెంటాడి, దానిని తిరిగి తీసికొని వెళ్లిపోయారు. మహా ప్రజ్ఞావంతుడైన కూరేశుడు దానిని సాంతముగ చదివి జ్ఞప్తియందుంచు కున్నాడు ఆయన సహకారంతో, ఈ బోధాయానవృత్తి సహాయంతో రామానుజులు బ్రహ్మసూత్రాలపై శ్రీ భాష్యం రాశారు. శ్రీ భాష్య రచనానంతరం ఆచార్యులు తిరిగి కాశ్మీరమునకు వెళ్లి, అక్కడి పండితులకు దానిని చూపారు. సరస్వతీ పీఠంలో ఆ భాష్యమునకెంతో సన్మానం జరిగింది. ఆ విద్వాంసులే దానికి 'శ్రీ భాష్యం' అని నామ కరణం చేశారు.అక్కడి పండితులు రామానుజులకు హయగ్రీవమూర్తి నొకదానిని ఉపహారముగ ఇచ్చారు. ఆ హయగ్రీవమూర్తి నేటికీ మైసూరు పరకాల మఠంలో ఆరాధనలు అందుకుంటోంది. రామానుజులు ఉత్తర దక్షిణ భారతములందు విరివిగా పర్యటించారు. పూరిలో మఠం కూడా స్థాపించారు.

సాధారణ శకం 1070లో కులతుంగుడు (రెండవ రాజేంద్రుడు) చోళదేశ సింహాసనమును అధిష్టించాడు. ఆయన శైవుడు. ఆయన మహాపూర్ణుని, కూరేశుని కళ్లు తీయించాడు. రామానుజులు హోయసల రాజ్యం మైసూరులోని జైనరాజు విత్తిదేవుడుని ఆశ్రయించగా, ఆయనఎంతో సత్కరించి, వైష్ణవుడై విష్ణువర్ధనుడనే పేరు పొందాడు. ఆ రాజు సహాయముతో రామానుజులు వైష్ణవ ప్రచారం బాగా చేశారు. కులతుంగుడు మరణానంతరం రామానుజులు తిరిగి శ్రీరంగం చేరి ఆళ్వారుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. తిరుపతికి వెళ్లి గోవిందరాజ స్వామిని విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించారు. సముద్రంలో పారవేసిన దానిని బయటకు తీయించి తిరిగి స్థాపించారు. అప్పటి నుండి రామానుజులు దేశ పర్యటన విరమించారు. ఎన్నో మఠాలు, దేవాలయములు కట్టించారు.

ఆయన శిష్యులలో జైనులు బౌద్ధులు, శూద్రులు, పంచములు ఉన్నారు. విత్తిదేవుడు జైనుడే. స్వయంగా ఆయన ఒక శూద్రునికి శిష్యుడు. నిత్యం స్నానానంతరం ఆయన తన మిత్రుడగు ఒక పంచముని కుటీరంలో కొంత సమయం గడుపుతుండేవారు. ఆయన 74 పీఠాలకు అధ్యక్షుడు. ఆయన అనుచరులలో 700 మంది సన్యాసులు, 1200మంది భిక్షువులు, 500మంది స్త్రీ శిష్యులు ఉన్నారు. రామానుజులను ఎంతో బాధపెట్టిన కులతుంగుని (క్రిమికంఠుని) తర్వాతి రాజు ఆయన శిష్యుడయ్యాడు. రామానుజులు 120వ ఏట సాధారణ శకం 1137లో దివ్య ధామమున కేగారు. కూరేశుని కుమారుడు పరాశరభట్టు ఉత్తరాధికారి అయ్యారు. అనంతా చార్యులు రాసిన 'ప్రసన్నామృతం' అనే గ్రంథంలో రామానుజుల జీవిత కథ ఉంది. .

శ్రీరామానుజులు శ్రీ భాష్యం కాక, బ్రహ్మ సూత్రాలపై వేదాంతసారం, వేదాంత దీపం అనే రెండు టీకాలు కూడా రాశారు. వేదార్థ సంగ్రహము, గద్యత్రయము, భగవదారాధన క్రమం అనేవి కూడా ఆయన రాసినవే. ఇవికాక ఎన్నో గ్రంథాలు రాశారని చెబుతారు.సుదర్శన సూరి అనే ఆయన రామానుజుల శ్రీభాష్యంపై "శ్రుత ప్రకాశిక" అనే టీక రాశారు. ఇదికాక రామానుజుల శిష్యుడు రామ మిశ్రుడు శ్రీ భాష్యవిస్తృతి అనే మరొక టీకను గురువు ఆధ్వర్యంలోనే రాశారు.

"నయమయూఖ మాలిక" అనే గ్రంథంలో అప్పయ్య దీక్షితులు రామానుజ సిద్ధాంతాన్ని క్రోడీకరించారు. వేదాంత దేశికులు శ్రీ భాష్యంపై "తత్త్వ టీకను" రాశారు. శ్రీ భాష్యంలోని విష యాలను "అధిక రణసారావలి"లో సంగ్రహిం చారు. మేఘనాచారి శ్రీభాష్యంపై "నయప్రకాశిక" అనే టీక రాశారు. ఇవి రామానుజ దర్శన మందలి అతి ముఖ్య గ్రంథాలు ఇంకా ఎన్నో ఉన్నవి.

**–కె.సచ్చిదానందమూర్తి,**
**10.5.1965 జాగృతి**

సేవ అని నారద సూత్రాలు చెబుతున్నాయి. భక్తికి నారదుడు, సేవకు గరుడుడు అని పురాణవాక్కు.

నారదుడు గత జన్మలో దాసీపుత్రుడు. ఐశ్వర్య వంతుడైన బ్రాహ్మణుడి ఇంటి వద్ద పనిచేసే తల్లితో నిత్యం అక్కడికి వెళ్లేవాడు.బ్రాహ్మణులు చదివే వేదవేదాంగాలను వింటూ ఆ పరిసరాల్లో స్వేచ్ఛగా తిరిగేవాడు.ఒకసారి చాతు ర్మాస్య దీక్షకు అక్కడికి వచ్చిన సన్యాసుల సేవకు నియుక్తుడైన ఆ బాలుడు తన పరిచర్యలతో వారిని ఆకట్టుకున్నాడు. దీక్ష అనంతరం వీడ్కోలు తీసుకుంటున్న సన్యాసులు, ఆ బాలుడిని పక్కన కూర్చోపెట్టుకుని ద్వాదశాక్షరీ మహామంత్రం, ప్రణవాన్ని ఉపదేశించారు. మాయ, సత్యం తదితర అంశాలపై చేసిన బోధనలు ఆ బాలుడి మనసులో నాటుకుపోయాయి. తల్లి మరణంతో ఈశ్వర అన్వేషణ ద్వారా జీవనం సాగించాలని అడవి దారిపట్టాడు. క్రూరమృగాల మధ్య ఒక రావిచెట్టు కింద ద్వాదశాక్షరిని జపిస్తుండగా, లీలా మాత్రంగా శ్రీహరి దర్శనమైంది.'నా రూపాన్ని స్పష్టంగా చూడాలనుకునే నీవు నన్ను కీర్తిస్తూ, నా గురించి తలుస్తూ, మాట్లాడుతూ ప్రకృతి ధర్మానుసారం దేహం వీడిన తరువాత బ్రహ్మ పుత్రుడిగా జన్మి స్తావు. అప్పుడు వీణ (మహతి)పై నారాయణ స్తోత్రంతో స్వేచ్ఛగా లోకాల్లో విహరిస్తావ'ని నారాయణుడు అనుగ్రహించాడు. ఆ ప్రకారమే, కల్పాంతం తరువాత బ్రహ్మ ఆయనను తన కుమారుడిగా సృష్టించి,'మహతి'ని బహూకరించాడు. అన్నియుగాలలో, అన్ని లోకాల సంచారంలో సమాజహితం, జగత్కల్యాణం కోసం ప్రయత్నించే వాడు. దేవదానవ భేదం లేకుండా అందరికీ ఉప దేశాలు చేయడం వల్ల వారికి సమాన గౌరవ నీయుడు. మొత్తమ్మీద ఆయన ఏడుసార్లు జన్మించి నట్లు పురాణాలు చెబుతున్నాయి.

**– రామచంద్ర రామానుజ**

## వివేకానంద సూక్తిశతి

**Do not be dragged away out of this Indian life. Donot for a moment think that it wouldbe better for India,if all the Indians dressed, ate and behaed like any other race.**



పాడుచేయు జనుల ప్రాశ్చాత్య మోహము
భారతీయ దృష్టిబాగుపరచు
ఇతర వేషభాషలెందుకు సోదరా
వినుడి స్వామి సద్వివేకవాణి॥



బండిరాజుల శంకర్

# తూర్పు పడమర



**ఒకరోజు మేము కాలేజీకి వెళ్లేసరికి కాలేజ్‌లో బుక్ ఫెస్ట్ జరుగుతుండడం వల్ల సెలవిచ్చేసారు. మా ఊరు తిరిగి వెళ్లాలంటే మళ్లీ సాయంత్రమే బస్సు. అంతవరకు ఏం చెయ్యాలో అర్థం కాలేదు.. అప్పుడు సమీర "వంశీ... ఇక్కడకు దగ్గర్లో జలపాతం ఉందట... వెళదామా!" అని అడిగింది. నేను వెంటనే ఆటో పిలిచాను. ఇద్దరం అందులో జలపాతం దగ్గరకు బయలుదేరాము. అది అక్కడికి పది కిలోమీటర్ల దూరంలో, అడవి మధ్యలో ఉంది. కొద్ది నిమిషాల తరువాత మేము ఆ జలపాతం దగ్గరకు చేరుకున్నాము. ఆటోవాడిని అక్కడే ఉండమని చెప్పి మేమిద్దరం జలపాతం దగ్గరకు వెళ్లాము.**

చుట్టూ పచ్చటి అడవి. – మధ్యలో పాపిడిలా రహదారి..– దూరంగా జలపాతపు హోరు వినిపిస్తోంది. చెట్ల మీద వందల పక్షులు ఎగురుతూ కనిపిస్తున్నాయి. వాటి కిలకిలా రావాలతో అడవంతా సందడిగా ఉంది. దూరంగా కోకిల కలకూజితం ఆగి ఆగి వినిపిస్తోంది.. చూడటానికి అక్కడి దృశ్యం చాలా అందంగా కనిపిస్తోంది.

**"ఆకాశం రాగ రంజితం**
**అడవి కోకిల కలకూజితం**
**కిలకిల రావాలు కీరవాణి రాగాలు"** లా ఉంది అక్కడి వాతావరణం. కొద్దిసేపటికి జలపాతాన్ని చేరుకున్నాము. దూరంగా కొండ మీద నుంచి ఉరుకుతున్న జలధార తలమీద నుంచి నుదుటి మీదకు పడే పాపిడి చేరులా కనిపిస్తోంది. మీద నుంచి కిందకు పడుతున్నప్పుడు హోరుమన్న శబ్దం నేపథ్య సంగీతంలా వినిపిస్తోంది.

సమీర ఆ అందమైన దృశ్యాన్ని దూరం నుంచి చూసి ఆశ్చర్యానికి లోనైంది.



గన్నవరపు నరసింహమూర్తి

ఆమెను చూసి నేను కూడా ఆ జలధారని వీక్షించసాగేను. కాలేజీలకు సెలవు కావడంతో అప్పటికే అక్కడ చాలామంది విద్యార్థినీ విద్యార్థులు కేరింతలు కొడుతూ కనిపించారు. చాలా మంది జలపాతం కింద అరుస్తూ స్నానాలు చేస్తున్నారు...

ఇద్దరం దగ్గరకు చేరుకున్నాము. ఇప్పుడు జలధార హోరు జోరు పెరిగింది. ఎత్తు నుంచి రాళ్ల మీద పడుతున్న జలపాతం నురుగుగా రూపాంతరం చెంది ప్రవాహంగా పరిణామం చెందుతూ పరుగులు పెడుతోంది. సమీర ఒక్కసారిగా చిన్నపిల్లగా మారిపోయి జలకాలాటలు ఆడటం మొదలుపెట్టింది.

జలధార రాళ్లను ముద్దాడి నీటి తుంపరులుగా మారుతున్నప్పుడు సప్తవర్ణ మిశ్రమ ఇంద్రధనుస్సు ఆ లోయలో ఆవిష్కారమవుతోంది. అంత ఎత్తు నుంచి లోయలోకి జారుతున్న జలపాతాన్ని చూస్తుంటే నాకు

**"ఆకాశంబు నుండి శంభుని శిరం, బందుండి**
**శీతాద్రి, సు / శ్లోకంబైన హిమాద్రి నుండి భువి,**
**భూలోకంబు నందుండి య**
**స్తోకాంబోధి, పయోధి నుండి పవనాంధోలోకమున్**
**జేరె గం / గా కూలంకష! పెక్కుభంగులు వివేక**
**భ్రష్ట సంపాతముల్"**

అన్న ఏనుగు లక్ష్మణ కవి పద్యం గుర్తుకు వచ్చింది.

సమీర ఆనందంగా ఆ ఎగిసిపడుతున్న జలధారలో తడుస్తూ నన్ను కూడా రమ్మనమని అడిగింది. కానీ సున్నితంగా తిరస్కరించాను. కొద్దిసేపటి తరువాత ఆమె నా దగ్గరకు వచ్చి "బట్టలు తడిసిపోయాయి, ఏం చెయ్యాలి?" అంది ముఖాన్ని తుడుచుకుంటూ...

"మరి జలపాతం కిందకు వెళితే తడిసిపోవా? మనం ముందే అనుకొని ఇక్కడికి రాలేదు. మార్చుకోడానికి బట్టలు కూడాలేవు. పద.. దూరంగా ఆ చెట్టు కింద కూర్చుని మాట్లాడుకుందాం. ఓ గంట తరువాత అవే ఆరిపోతాయి" అన్నాను ఆ చెట్టు వైపు నడుస్తూ. సమీర బట్టలు పిండుకుంటూ నా వెనకాలే వచ్చింది.. ఆమె మొహమాటపడుతుందనీ నేను ఆమె వైపు చూడకుండా చెట్టు కింద ఉన్న బండరాయి మీద కూర్చున్నాను. కొద్దిసేపటికి ఆమె కూడా వచ్చి ఎదురుగా ఉన్న రాయి మీద కూర్చుంది..–

దూరంగా జలపాతపు హోరు వినిపిస్తోంది. స్నానాలు చేస్తున్న కుర్రాళ్ల అరుపులు మధ్య మధ్యలో వినిపిస్తున్నాయి.

"చలేస్తోందా?" అని అడిగానామెను.

"కొద్దిగా ... ఇప్పుడు తగ్గింది".

"ఇలా మనం ఇక్కడికి వచ్చినట్లు మీ నాన్నకు తెలిస్తే కోప్పడతాడా?" అని అడిగాను.



‘జాగృతి’ నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన

“ఎలా తెలుస్తుంది? చెబితే మనిద్దరమే చెప్పాలి. అది జరగదు కదా?” అంది నవ్వుతూ...

“ఇంటర్ తరువాత ఏం చేద్దాం అనుకుంటు న్నావు?” మా ఇంట్లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చెయ్యమంటున్నారు.

“వాళ్లు సరే ..నీకేం చదవాలని ఉంది?”

‘నాకైతే ఏ బి.ఏనో, బీకామో చదవాలని ఉంది కానీ నా మాట ఎవరు వింటారు చెప్పు?’

“నువ్వు గట్టిగా నిలబడితే ఎందుకు వినరు? వాళ్లు చెప్పింది చదివితే ఎలాగ? నీకంటూ ఓ అభిప్రాయం ఉండొద్దా ? నీకు కావాలసింది చదువు. అప్పుడు చదువుని ఎంజాయ్ చెయ్యవచ్చు. లేకపోతే జీవితాంతం బాధపడాలి. అయినా మీ వాళ్ళు అదే ఎందుకు చదవమంటున్నారు?” అన్నాను.

“ఈ కాలంలో అందరూ సాఫ్ట్‌వేర్ చదివి అమెరికాకు వెళ్లిపోతున్నారు కదా? మా వాళ్లు కూడా నన్ను అక్కడికి పంపిద్దామనుకుంటున్నారు”...

“వాళ్లకి సరే... నీకు ఇంట్రస్టు ఉందా?”

‘వంశీ! అన్నీ తెలిసీ మళ్లీ ఇలా అడుగుతావేంటి? మా నాన్నను కాదనీ నేనేమైనా చెయ్యగలనా చెప్పు? నీలా నాకు ఇండివిడ్యుయాలిటీ లేదు..– అంత ధైర్యం కూడా నాకు లేదు” అంది... ఆమె మాట్లాడుతుంటే



ఆ గొంతులో నిరాశ ధ్వనించింది’...

‘మరి నీకు అమెరికా వెళ్లి చదవడం ఇష్టమేనా?’

‘ఆ విషయం నేనింకా ఆలోచించలేదు..’

“మరీ గిరి గీసుకొని కూర్చోడం కంటే ప్రపంచాన్ని తెలుసుకుంటే మంచిది... కేవలం చదువంటే పాఠ్య పుస్తకాలే కాదు. రకరకాల పుస్తకాలు చదవచ్చు. మన లైబ్రరీలో బోలెడు పుస్తకాలు. పేపర్లు ఉన్నాయి. వాటిని చదివితే చాలా విషయాలు తెలుస్తాయి. హిందూ పేపరు రోజూ చదివితే ఇంగ్లీషు మీద మంచి పట్టుతో పాటు ప్రపంచంలోని అనేక విషయాలు తెలుస్తాయి. నేను పదవ తరగతికి వచ్చేసరికి మన తెలుగు సాహిత్యంలో బోలెడు మంచి పుస్తకాలు చదివాను. దానికి కారణం మానాన్నగారు. ఆయనకి పుస్తకాలంటే గొప్పిష్టం. నాకూ అదే అలవాటు చేశారు” అన్నాను.

“ఇంట్లో క్లాసు పుస్తకాలు తప్ప ఏం చదివినా నాన్నగారూ కోప్పడతారు. మొన్నొకసారి పేపరు చదివితినే బాగా కోప్పడ్డారు” అంది.

“మన స్కూళ్లలోనూ, కాలేజీల్లోనూ ఉపా ధ్యాయులు ఏం చెబుతున్నారు చెప్పు? ఎంతసేపూ పాఠాలు, సూత్రాలు, ముఖ్యమైన ప్రశ్నలు..ఇవే కదా? ఎవరైనా మూలాలు చెబుతున్నారా? మన చదువులు కేవలం మార్కుల కోసం, ఉద్యోగాలు సంపాదించ డానికే పనికొస్తాయి కానీ జ్ఞానం కోసం కాదు.. చదువైపోయిన తరువాత మన ఉద్యోగాల్లోనో, డబ్బు సంపాదన మీదో ధ్యాస పెడతాము. అప్పుడే జ్ఞానం కావాలన్నా రాదు. అందుకే ఇప్పుడే మనం చదవాలి. పాఠ్య పుస్తకాలైనా మూలాలు చదవాలి. ఉదాహరణకు పైథాగరస్ సిద్ధాంతం, ట్రిగోనామెట్రీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లాంటివి. ఫార్ములాలు కాకుండా క్షుణ్ణంగా చదవాలి” అన్నాను...నా మాటలకు సమీర ముఖం చిన్నబోయింది.

“నువ్వు ఏ పుస్తకాలు చదివావు”

“నేను విశ్వనాథవారి ‘వేయిపడగలు’, శ్రీశ్రీ ‘మహా ప్రస్థానం’, తిలక్ ‘అమృతం కురిసిన రాత్రి’... ఇలా కొన్ని మంచి పుస్తకాలు చదివాను. అలాగే ఖాళీ ఉన్నప్పుడు పొలంలో కూర్చొని మన టెక్స్టబుక్స్ క్షుణ్ణంగా చదువుతాను.. దానివల్ల నాకు చాలా మేలు జరిగింది” అన్నాను.

“నేను కూడా వాటిని, పేపర్లు చదవటానికి ప్రయత్నిస్తాను, ముఖ్యంగా ఇంగ్లిష్ పేపరు చదువుతాను” అంది నవ్వుతూ,

“సరే ... పద! టైమైపోయింది. ఆలస్యం అయితే బస్సు దొరకదు” అంటూ లేచాను.

ఇద్దరం ఆటోలో బస్టాండుకి వచ్చాము. అప్పటికీ మా ఊరు బస్సు సిద్ధంగా ఉంది. మా ఊరు వెళ్లేసరికి 5 గంటలైంది.

(సశేషం)



'కందువ మాటలు, సామెత / లందముగా గూర్చి చెప్పినది తెనుగునకున్/ బొందై, రుచియై, వీనుల / విందై, మరి కానుపించు విబుధుల మదికిన్' మొల్ల కవితా విలసన భాగం ఇది. శ్రీ మహిమాభిరాముడు, వశిష్ఠ మహాముని పూజితుండు, సుత్రామ వధూ కళాభరణ రక్షకుడు, ఆశ్రితపోషకుడు, దూర్వామల సన్నిభాగుండు, మహాగుణశాలి, దయాపరుండు అంటూ కొనియాడుతుంది ఇష్టదేవతా సన్నుతి. బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ, సుందర, యుద్ధకాండల ఆశ్వాసాలన్నింటిలోనూ అనేకానేక వైభవ ప్రాభవాలు. ఆశ్వాస ముగింపున –

'జలజాక్ష, భక్తవత్సల
జలజాసన వినుతపాద జలజాత, సుధా
జలరాశి భవ్యమందిర
జలజాకర చారుహంస, జానకినాథా!'

# అభినవ మొల్ల 'లక్ష్మీ

'మధుర కవయిత్రి'గా లక్ష్మీ నరసమ్మకు పేరు. ఎనిమిదన్నర దశాబ్దాల క్రితం భద్రాచలాన జనించిన ఆమె బాల్యమంతా సీతారాముల దేవస్థాన ప్రాంగణ విభవంతో ముడివడి ఉంది. తండ్రి వీరరాఘవా చార్య, తల్లి నరసమాంబ. తొలి నుంచీ చదువుమీద మక్కువ ఎక్కువగా ఉన్న లక్ష్మీనరసమ్మకు నివాసగృహమే విద్యాలయం. బోధక వృత్తి శిక్షణ తదుపరి, తన ప్రాంతంలోనే ఉపాధ్యాయినిగా ఉద్యోగ బాధ్యతల నిర్వహణ. ఉన్నత విద్యాభ్యాస కాలాన ఎప్పుడూ ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత. ప్రతిభా సామర్థ్యాల నిధి.

కవిత అంటే ఎంత ఇష్టమో తెలుసా? ప్రథమంగా రాసినపుడు తనది ఆరేడు ఏళ్ల వయసు! కవితలతోపాటు కథలనూ రచించి, నాటి మేటి పత్రికల ప్రోత్సాహాన్నీ సాధించి, తనదైన విలక్షణతను కనబరిచారు. భద్రగిరి పేరిట నవలను కూడా వెలువరించినపుడు ఆమెది పాతికేళ్లప్రాయం. భద్రాద్రి ముంగిట వరకల్పవల్లీ, రాముని పాదాల పాద్యాల వెల్లీ, నా కవితల్లె పొంగవే గోదారి తల్లీ! అని సుమనోహర వర్ణన చేశారు.

హృదయోల్లాస కవితా రీతికి, మరొక ఉదాహరణ 'రామదాసు'. ఆ పేరు వినీ వినగానే 'రామమయం' గుర్తుకొస్తోందా? భద్రాద్రి గౌతమి మదిలో మెదులుతోందా? ఇక్ష్వాకుల తిలకా స్ఫురణ కొస్తోందా? రఘునందనా రఘువీరా అంటూ హృదిలో నాద ధ్వని పలుకుతోందా?

రామదాసు కావ్యరచనమే ఆ మహనీయ సాహితీ జీవితాన్ని మరింత మేలిమలుపు తిప్పింది. మరంద మాధురీతత్వానికి సాకారరూపం ఇచ్చినట్లు యింది. అది 1981. ఇప్పటికి నాలుగు దశాబ్దాలపైన మాట. అప్పటికి లక్ష్మీనరసమ్మకు యాభై ఏళ్లు పైగా ఉంటాయి. పద్య, గద్య రచనా ధురీణతకు ముగ్ధులైన 'కరుణశ్రీ' అభినవ మొల్లగా బిరుదాంకితం చేశారు.

నాటి ఆ శుభ సందర్భాన్ని పురస్కరించుకునే ఇప్పుడు ఆ కవయిత్రి సారస్వత కుటుంబ సభ్యులంతా ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. కరుణ కవికుమారుల్లోని వేంకట రమణ చేతుల మీదుగా నల్లాన్ చక్రవర్తుల శ్రీరామచక్రవర్తి, స్థలశాయి స్వామి, తాళ్ళూరి పంచాక్షరయ్య సన్నిధిలో గ్రంథావిష్కరణ. అయోధ్యాపుర వైభవం, దశరథ ధర్మపాలనం, పుత్రకామేష్టి నిర్వాహకత్వం, రామలక్ష్మణ భరత శత్రుఘ్నుల అవతార తత్వం, సీతా స్వయంవరం, సీతారాముల పరిణయ శుభసందర్భం, మరెన్నో విశాషాంశాల సమాహారమే బాలకాండ.


శైలీ విన్యాస నిదర్శనంగా సీతాస్వయంవర ఘట్టాన్ని ప్రస్తావించుకుందాం.

***'ద్రవిడ కర్ణాటాంధ్ర యవన మహారాష్ట్ర – రాజకుమారులు తేజమలర/ బాంధ్య ఘూర్జరలాట బర్బర మలయాళ – భూపనందనులు విస్ఫూర్తి మీర / గౌళ కేరళ సింధు కాశి కోసల సాళ్వ – ధరణీశ పుత్రులు సిరి వెలుంగ / మగధ మత్స్య కళింగ మాళవ నేపాళ – నృపతనూభవులు నెన్నికకు నెక్క ఉత్కల కొంకణ మద్ర పాంద్ర వత్స గాంధార సౌరాష్ట్ర వంగ చోళ…'*** ఇలా రాజ్యాల పేర్లన్నింటితోనూ స్వయంవర నిర్ణయ సభామండపం ఉందన్నది ఇతివృత్త అంశం. అంతా ఏకధాటిగా చదివించేదే!

ఇదే బాలకాండలో ఉన్న పారావారా గభీరి, నిత్య విస్ఫారోదార విహారి, సుజన రక్షాదక్ష దక్షారి, దశరథోర్వీనాథ జంభారి.... వంటి పదప్రయోగాలు వేటికి అవే సాటి, మేటి. వీటన్నింటి నేపథ్యంలో గతంలో ఆమెకు ప్రదానం చేసిన 'అభినవ మొల్ల' అనేకానేక ప్రకాశ వికాసాలందుకుంది.

సాహితీ స్వర్ణమహిళ, విశిష్ట వనిత, భద్రాద్రి ఉత్సవాల సాకేతపురి, అంతర్జాతీయ మహిళా దినోత్సవ పురస్కృతులూ లక్ష్మీ నరసమ్మను అలనాడే ఏరికోరి వరించాయి. ప్రపంచస్థాయిన విద్యాశాస్త్రీయ సాంస్కృతిక సంస్థ (యునెస్కో) బహూకృతీ ఆమెదే.

భద్రగిరి నవలకు దాశరథి పీఠిక, రామదాసు కావ్యప్రభకు కరుణశ్రీ నుంచి బిరుదు బహూకరణ, మధునాపంతులవారి ప్రత్యేక ప్రశంస మధురాతి మధుర సందర్భాలు. భద్రగిరి ధామ శతకం, భద్రాచల యోగానందలక్ష్మీ నృసింహ సుప్రభాతం, భద్రాచల క్షేత్ర మహత్మ్యం, శ్రీపదం పేరిట ప్రబంధ



అన్నపుడు మహదానంద తరంగితం కాని హృది ఉంటుందా?

గద్యానికి సంబంధించీ.. శ్రీగౌరీశ్వర వరప్రసాద లబ్ధి గురు జంగమార్చన వినోద సూరి జన వినుత కవితా చమత్కార.. అని కొనసాగుతుంటే – పఠించినా, ఆలకించినా మరెంత భావనోత్తేజమో కదా! వందలాది పద్యాలను కొద్ది రోజులలోనే విరచించిన ఆమెది సరళసుందర శైలి.కవితలల్లిన తొలి తెలుగు విదుషీమణిగా, శ్రీమద్ రామాయణ కావ్య రచనా రసఘునిగా పేరొందిన ఆమె పదబంధాలన్నీ ఆపాత మధురాలు.

అంతటి నవ్యత, భవ్యత, దివ్యత నిండిన తనతో పోలుస్తూ 'అభినవ మొల్ల' అనిపించుకోవడమంటే మాటలా? అంత ప్రశస్తినీ సొంతం చేసుకున్న చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ సంస్కృతి సభా కార్యక్రమ వేదిక భద్రాచలంలోని శ్రీ జీయర్ మఠం. అక్కడే వాల్మీకి శ్రీరామాయణ బాలకాండ అనుసృజనగా గ్రంథ ఆవిష్కరణ, 'భద్రభారతి' పురస్కార ప్రదానోత్సవం నవంబర్ 24న ఏర్పాటైంది.




# నరసమ్మ'

అనువాద పద్యకృతి, గోదాకల్యాణం, కావ్యగౌతమి, పద్య కవితా సంపుటిగా నీరాజనం, భక్తి గీతాలుగా తులసీదళాలు.. ఇంకా ఎన్నెన్నో ఆ లేఖిని నుంచి వెలువడ్డాయి. భద్రగిరి శతకానికి 'సమతాభిరామం' అనే నామకరణం కవయిత్రీ తిలకం అక్షర శక్తికి ప్రతీక.

కవితా ధనుస్సు, శాంతిభిక్ష, అక్షర తర్పణం, మధువని, మాతృభూమి, దివ్య గీతాంజలి... ప్రతీ పుస్తకమూ భావ సమన్వితం. రచనలతో పాటు భాషా సంబంధ అధ్యయన యాత్రలు సాగించిన ఉత్సాహి. అందులో భాగంగానే మైసూరు ప్రాంతానికి వెళ్లి వచ్చారు.

పద్యం, గద్యం... రెండింటా మిన్న. ఆ కారణంగానే వాచకాల ఎంపిక సంఘ సభ్యురాలిగా నియమితులయ్యారు. తేట తెలుగుపదాల ఎంపిక, కూర్పులో నేర్పు, ఏ ప్రక్రియ చేపట్టినా నిశిత వ్యక్తీకరణ ఆమె సహజ గుణాలు. పదుల సంఖ్యలో పుస్తకాలు వెలయించారు.

వచన కవితా రంగంలో సైతం అందెవేసిన చెయ్యి. ***'ఆమె కాదు కేవలం భామ/ ఈతరం సత్యభామ / ధరించిందొక కవితా ధనుస్సు / చీల్చి వేస్తోంది జీవన విషాద తమస్సు'*** అంటూ నారీభేరి మోగించారు. ఈ కారు చీకట్లను నీ చేతి చిరుదీపం జయిస్తుంది. అప్పుడు ఒకే జాతి ఒకే నీతి నిలుస్తుంది– అంటూనే మానవతా శీతశీకరాల జల్లులో మనోభూమి తడవడాన్ని దర్శించారామె. ఆత్మవిశ్వాస బీజం మొలకెత్తడాన్ని తిలకించారు.

శతక శంఖారామం గురించి ప్రస్తావించి తీరాలి. ఉదాత్త భావపూరితం. సముదాత్త ఆచరణ రీతికి కీలకం, సామాజిక చేతనకు ఆలవాలం.

***కువలయ ధళనేత్రా! కోమల స్నిగ్ధ గాత్రా***
***భవముఖ నుతిపాత్రా! భక్త వృక్షాళి చైత్రా!***
***రవిశశి సమధామా! రక్షితా క్షాంఘ్రిభామా!***
***కవిజననుతనామా! కావుమా మమ్ము రామా!***

ఈ పదప్రయోగ చాతురి ఎంత అసాధారణమో ప్రస్ఫుటమవుతూనే ఉంది .వచన ప్రక్రియ, అందునా కవితపరంగా భావ సరళతను చూస్తే –

***ఉన్నోళ విందుల్లో నీళ్లున్న సెలయేళ్లు***
***లేనోళ్లకు కన్నీళ్లే మంచినీళ్లు!***

ఈ మాటల తూటాలు సమాజ తీరును ప్రతిఫలిస్తూనే ఉన్నాయి. ప్రాచీన, ఆధునికతలు రెండింటిలోనూ ఆమె కలం బలాన్ని సూచిస్తున్నాయి.

బతుకమ్మను ఏ విధంగా మనకళ్ల ముందు నిలిపారంటే –

***పండుగ పందిళ్లు, సంబురాల సందళ్లు***
***కలిమిలేముల గడపల్లో సమత పండేలా...*** అని.

ఇదివరలో భద్రాచలం రామాలయంలో ఉత్సవాలు, అదేవిధంగా అహోబిల మఠంలో ప్రత్యేక పూజలు ఏర్పాటైనపుడు...


గోదాదేవి విరచిత తిరుప్పావై గురించిన ప్రవచనంతో ఆబాల గోపాలాన్నీ మంత్రముగ్ధం చేశారు. ఆ కోవలోనే తిరుమల–తిరుపతి దేవస్థానం నిర్వహణలోని ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు తరఫునా ఆధ్యాత్మిక బోధలు సాగించారు. తిరుప్పావై స్వామిని కీర్తిస్తూ గోదాదేవి గానం చేసిన పాశురాల గీతమాలిక వివరమెరేతటిని తేటతెల్లం చేయడంలో దిట్ట. మంగళప్రదం తిరు, వ్రతపూరితం పావై. ధనుర్మాస వ్రతంగా తిరుప్పావైకి విఖ్యాతి.

ఆళ్వారుల పవిత్ర స్తోత్రాల సంబంధితమే దివ్యప్రబంధం. ధార్మికతత్వమే ఆళ్వారుల ప్రత్యేకత. భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనానికి/జీవనానికి మూలాధారం దివ్యప్రబంధమే. అటువంటి మూల అంశాల విశదీకరణలో నిష్ణాతురాలు లక్ష్మీనరసమ్మ. దైవ సమ్మేళనాల ప్రచారకర్తగా అనుభవశీలి. భక్తి రస పరిపూర్ణ పాశురాలను అంతటా విస్తృతపరిచారు.

'తెలుగుతల్లికి వెలుగు పారాణి'ని మనం ఇక్కడ గుర్తుచేసుకుని తీరాలి. ఆదికవీంద్రుని అక్షర రమ్యతా నారికేళ రుచులు నవరసాలు అని ఆరంభించి నన్నెచోడుడు, పండితారాధ్యుడు, పాల్కురికి, గోనబుద్ధ వంటి సాహితీ విరాట్ స్వరూపులందరినీ శ్లాఘించడం ఇందులో కానవస్తుంది.

ఎంత ప్రాచీనతో అంత ఆధునికత. నీటి విలువను ప్రస్ఫుటపరచేలా 'జలసిరి'ని ఆ కాలంలోనే ఆవిష్కరించారు లక్ష్మీనరసమ్మ.

***వరవిలంబి వసంతమా! వసుధ యెల్ల / జలసిరులు నింపి సస్య సుశ్యాలమ్ము / శాంతిభద్రత లొనగుమ్ము స్వాగతమ్ము!*** అంటూ ఆనాడే ఆహ్వానగీతిక ఆలాపించినవారు ఆమె. నాడు ఆకాశవాణి వెలువరించిన 'భద్రాచల క్షేత్ర చరిత్ర' నాటకం నేటికీ శ్రోతల మదిలో ధ్వనిస్తూనే ఉంది, ఇంకా ఎంతకాలమైనా ధ్వనిస్తూనే ఉంటుంది. తనది నిత్యనూతన బాణి.



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

ఇంటి పేరు కస్తూరి వారు. ఇంట్లో గబ్బిలాల కంపు అని సామెత. ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఇంతకు మించి ఏమీ కాదు. ఉగ్రవాదులతో సంబంధం ఉన్నవాళ్లు సభ్య సమాజానికి చెప్పేదే ముంటుంది? సభ్య సమాజం వాళ్ల నుంచి వినడానికి ఏముంటుంది? ఆక్స్‌ఫర్డ్ యూనియన్ పేరుతో ఆ విశ్వవిద్యాలయం చేసే నిర్వాకాలన్నీ ఇలాగే ఉంటున్నాయి. ఇటీవల అక్కడ కశ్మీర్ మీద జరిపిన ఒక గోష్టికి ఉగ్రవాదులతో నేరుగా సంబంధాలు ఉన్న ఇద్దరిని పిలిచిందా వేదిక. ఇందుకు భారత హిందువులు తీవ్ర నిరసన తెలియచేశారు. ఉగ్రవాదుల తైనాతీలను తెచ్చి యూనివర్సిటీ వేదికలు ఎక్కించడం ఎలాంటి ప్రజాస్వామ్యమో ఆక్స్‌ఫర్డ్ యాజమాన్యం తెలియచేస్తే ప్రపంచం ధన్యమవుతుంది. దానిని ఎలాంటి భావ ప్రకటనా స్వేచ్ఛ అనాలో కూడా వెల్లడిస్తే మొత్తం మేధోవర్గం మోక్షం పొందుతుంది కూడా.

---

కశ్మీర్ సమస్యకు పూర్తి బాధ్యత వహించవలసిన ఉన్న ప్రథమ ప్రధాని నెహ్రూ జన్మదినం నవంబర్ 14న ఆ గోష్టికి ముహూర్తం పెట్టారు. నిజానికి కశ్మీర్ ఆక్రమణకీ, రక్తపాతానికీ, 370 అధికరణ రాజ్యాంగంలో చొరబడడానికి కారకుడైన నెహ్రూ వారసత్వాన్ని బోను ఎక్కిస్తూ సమావేశాలు, గోష్టులు నిర్వహించవలసిన రోజు అది. కానీ 'దిస్ హౌస్ బిలీవ్స్ ఇన్ ది ఇండిపెండెంట్ కశ్మీర్ స్టేట్' అన్న అంశం మీద ఆక్స్‌ఫర్డ్ యూనియన్ వేదిక (ఇది యూనివర్సిటి అంతర్భాగమే) అదే రోజున గోష్టి నిర్వహించింది. కశ్మీర్ స్వతంత్ర దేశం అనే అంశం మీద ఈ వేదిక నమ్మకం ప్రకటిస్తున్నది అని దానికి అర్థం చెప్పుకోవచ్చు. ఈ వేదిక మీద నుంచే ఒక భారతీయ విద్యార్థి జమ్ముకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ ఉగ్రవాద సంస్థ అంటూ ఆవేశంగా ప్రసంగించడం విశేషం. ఈ గోష్టిలో ప్రసంగించడానికి నిర్వాహకులు ఆహ్వానించిన ముజుమ్మిల్ ఆయూబ్ ఠాకూర్, జఫార్ ఖాన్ కశ్మీర్ వేర్పాటువాదులని కూడా ఆ విద్యార్థి ఆరోపించాడు. కాగా, ఇంగ్లండ్‌లో స్థిరపడిన హిందువులు గోష్టి జరిగిన వేదిక బయట నిలిచి నిరసన వ్యక్తం చేశారు. ఇన్‌సైట్ యూకే అనే సంస్థ పేరుతో వీరంతా గోష్టికి నిరసనగా నినాదాలు చేశారు. ఆదర్శ్ మిశ్రా అనే భారతీయ విద్యార్థి జేకేఎల్ఎఫ్ నెత్తుటి చరిత్రను వేదిక సాక్షిగా తెలియచేశాడు. బ్రిమ్మింగ్‌హామ్‌లో ప్రభుత్వ అధికారులుగా పని చేస్తున్న కశ్మీరీ పండితులను, మిగిలిన హిందువులను ఎంత ఘోరంగా ఊచకోత కోసినదీ కూడా తెలియచేశాడు. నేను ఈ వేదికను నమ్మను. ఈ వేదిక అధ్యక్షుడి మీద అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాను అని కూడా చెప్పాడు. తాను మాత్రమే కాకుండా, చాలా మంది సభ్యులకు కూడా అతడి మీద విశ్వాసం లేదని నేను చెప్పగలనని మిశ్రా తెలియచేశాడు. ఆక్స్‌ఫర్డ్ యూనియన్ అధ్యక్షుడు ఐఎస్ఐ చేతిలో




ఆయుధం తప్ప మరొకటి కాదనీ, పాకిస్తాన్‌లో చేతిలో కీలుబొమ్మ మాత్రమేననీ మిశ్రా తీవ్రంగా విమర్శించాడు.

ఆక్స్‌ఫర్డ్ యూనియన్ ఉగ్రవాదల పక్షాన నిలిచిందని, ఇది సత్యమని బయట భారతీయ హిందువులు నినాదాలు చేశారు. జమ్ముకశ్మీర్ భారతదేశానిదే, జమ్ముకశ్మీర్ అంటే భారతదేశమే, జమ్ముకశ్మీర్ ఎప్పటికీ భారతదేశానిదే, భారతమాతకు జై అంటూ ఇన్‌సైట్ యూకే సభ్యులు నినాదాలు చేశారు. ఈ గోష్టిని ఏర్పాటు చేసినవాడే ముజ్జమ్మిల్ ఆయూబ్ ఠాకూర్. ఇతడే ఆక్స్‌ఫర్డ్ యూనియన్ చేత ఆహ్వానింప చేసుకున్నాడు. అయితే ఇతడికి ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలతో స్కాట్‌ల్యాండ్ యార్డ్, చారిటీ కమిషన్, ఎఫ్‌బీఐ దర్యాప్తు చేశాయి. ఇక జఫార్ ఖాన్ జేకేఎల్ఎఫ్ దౌత్య విభాగం అధ్యక్షుడిగా పనిచేశాడు. భారత మాజీ ప్రధాని వీపీ సింగ్ కార్యదర్శిగా పనిచేసిన ప్రేమ్‌శంకర్ ఝా మరొక ఉపన్యాసకుడు. ఠాకూర్, ఖాన్ – ఈ ఇద్దరి మీద హింసను రెచ్చగొట్టే విధంగా ప్రసంగించిన నేరానికి గతంలోనే కేసులు నమోదైనాయి. ఠాకూర్ వరల్డ్ కశ్మీర్ ఫ్రీడమ్ మూవ్‌మెంట్ అనే సంస్థకు అధ్యక్షుడు కూడా.

ఆక్స్‌ఫర్డ్ యూనియన్ అధ్యక్షుడు ఇబ్రహీం ఉస్మాన్ మోవాఫీకి రాసిన లేఖలో కొన్ని ఇతర అంశాలను కూడా ఇన్‌సైట్ సభ్యులు ప్రస్తావించారు. నవంబర్ 14న ఈ లేఖ రాశారు. జమ్ముకశ్మీర్‌లో హిందువులను దారుణంగా హత్య చేసిన జమ్ముకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్‌తో మరొక ఆహ్వానితుడు జఫార్ ఖాన్‌కు ఉన్న సంబంధాల గురించి ఆ లేఖలో పేర్కొన్నారు. ఇంగ్లండ్‌లో భారత దౌత్యవేత్తగా పనిచేసిన రవీంద్ర మాత్రేను 1984లో ఈ ఫ్రంటే హత్య చేసిన సంగతిని కూడా గుర్తు చేశారు.

ఈ గోష్టికి అర్బన్ నక్సల్స్ పుస్తక రచయిత, కశ్మీర్ ఫైల్స్ చిత్ర దర్శకుడు వివేక్ అగ్నిహోత్రిని మొదట పిలిచారు. ఇలాంటి తనను పిలవడమే అవమానకరంగా అనిపించిందని నవంబర్ 14న ఎక్స్ వేదికగా చెప్పారు. ఆక్స్‌ఫర్డ్ యూనియన్ నుంచి అందిన ఆహ్వాన పత్రం చూడగానే తనకు ఇది నేరపూరితంగా కనిపించిందని అగ్నిహోత్రి అన్నారు. ఇది భారత్ వ్యతిరేకం, కశ్మీర్‌కు వ్యతిరేకం. అందుకే తిరస్కరించానని ఆయన చెప్పారు. ఇలాంటి గోష్టి, ఇలాంటి అంశంతో ఏర్పాటు చేయడమే రాక్షస చర్యగా తాను

భావించానని కూడా ఆయన వ్యాఖ్యానించారు. వలసవాద బానిసత్వం నుంచి వైలదొలగాలని గట్టిగా భావిస్తున్నవారు ఇలాంటి యూనివర్సిటీ గోష్ఠులను పరిహరించాలని ఆయన అభిప్రాయపడ్డారు. చాలా చిత్రంగా అగ్నిహోత్రి ఈ అవకాశాన్ని కాలదన్నడం కొందరికి నచ్చలేదట. శ్రేయోభిలాషులు పేరుతో వారంతా ఈ అవకాశం వదులు కోవద్దని హితవు పలికారట కూడా. కానీ తాను ఒక సిద్ధాంతానికి నమ్మి పని చేస్తున్నానని తాను తప్పక నిరాకరిస్తానని అగ్నిహోత్రి చెప్పవలసి వచ్చిందట. ఆక్స్‌ఫర్డ్ పిలిస్తే చాలు తోక ఊపుకుంటే వెళ్లిపోవడం సరికాదని ఇప్పటికైనా అర్థం చేసుకోవాలి. హిందుత్వను కూకటివేళ్లతో పెకలించాలంటూ జరిగే చర్చలకీ, కశ్మీర్ స్వతంత్ర దేశంగా ఉండాలంటూ చేసే ఉద్యమాలకీ దూరంగా ఉండడం ఎంత అవసరమో ఇవాళ్టి సాధారణ



భారతీయుడు గ్రహించాలి. అలాంటి గోష్ఠులు ఎక్కడ జరుగుతున్నా, అలాంటి ఉద్యమాలను ఎవరు ముందు ఉండి నడిపిస్తున్నా దూరంగా ఉండడం భారతీయుల ప్రథమ కర్తవ్యం. అందుకే ఆక్స్‌ఫర్డ్ యూనియన్ వేదిక దగ్గరే ప్రధాన ఆహ్వానితులను దుయ్యబట్టిన మిశ్రాను ఇప్పుడు అంతా ధీశాలి భారతీయునిగా శ్లాఘిస్తున్నారు.

అగ్నిహోత్రి వంటి వారు ఛీకొట్టినా, వేదిక దగ్గర నిరసనలు జరుగుతున్నా ఇలాంటి చర్చలు నిర్వహించడం ఆక్స్‌ఫర్డ్ యూనియన్‌కు ఫ్యాషన్‌గా మారింది. ప్రపంచమంతటా ఉన్న వివాదాస్పద అంశాల మీద చర్చలు నిర్వహించి తుపానులు సృష్టించాలనే దుగ్ధ దీనిలో కనిపిస్తుంది. తాజా చర్చకు సంబంధించి చాలామంది ముందే ఛీకొట్టారు. కశ్మీర్ అంశం మీద ఆక్స్‌ఫర్డ్ యూనియన్ చర్చకు పెట్టిన అంశాలు ఏమిటి? కశ్మీరీల స్వయం నిర్ణయాధికారం, ఐక్యరాజ్య సమితి తీర్మానాల మేరకు భవిష్యత్తులో కశ్మీర్‌కు ప్లెబిసైట్ ద్వారా నిర్ణయ అధికారం ఇస్తామన్న హామీ, ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతాలలో వలసలను ప్రోత్సహిస్తూ స్థానిక ప్రజల సమీకరణలను ప్రభుత్వం మార్చుతున్నది, సైనికీకరణ చేయడం, మానవ హక్కుల ఉల్లంఘన, ఆస్తుల ధ్వంసం, నిర్బంధాలు, లైంగిక అత్యాచారాలు ఇవే కనిపిస్తాయి. ఇందులో కశ్మీర్ పండిట్‌లపై హింసాకాండ ఎక్కడ ఉంది? ఎంతసేపు ఉగ్రవాదుల హక్కుల గురించి, పాకిస్తాన్ ఎజెండా మాత్రమే ఉంటాయి. ★

# ఫెమినిజంలో అపస్వరం

**కొ**త్త బిచ్చగాడు పొద్దెరగడు, కొత్తగా మతం పుచ్చుకున్నవాడికి ఒళ్లు తెలియదు అన్నట్టుగా ఉంది మన బాలీవుడ్ బి గ్రేడ్ నటి, ఫెమినిస్టు స్వరాభాస్కర్ పరిస్థితి. ఊ అంటే ఆ అంటే మహిళా హక్కులు, బ్రాహ్మణిక పితృస్వామ్యం మహిళలను ఎలా అణచివేస్తోందోనంటూ విమర్శల వర్షం కురిపించే 'స్వర', తన భర్త ఫహాద్ అహ్మద్‌తో కలిసి మహిళలకు విద్య సహా పలు సామాజిక సంస్కరణలను వ్యతిరేకించే అతివాద ముస్లిం ముల్లా సజ్జాద్ నొమానీని కలుసుకోవడం కలకలం సృష్టించింది. ముఖ్యంగా, ఈ సమావేశం మహారాష్ట్ర ఎన్నికలకు ముందే జరగడం పలువురిని ఆశ్చర్యంలో ముంచెత్తింది. అయితే భర్త ఫహాద్ అహ్మద్ ఎన్సీపీ టిక్కెట్టుపై అనుశక్తినగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న నేపథ్యంలో నొమానీ ఆశీస్సులు, మద్దతు కోరేందుకు అతడిని కలుసుకున్నట్టు తెలుస్తోంది.

తాను తలకెత్తుకున్నానన్న ఫెమినిస్టు విలువలను తుంగలోతొక్కి, ఇస్లాంలో అతివాద వాఖ్యలకు ప్రాచుర్యం పొందిన ముల్లాను కలుసుకోవడం ఆశ్చర్యమే మరి! అన్ని వేదికలపై మహిళల హక్కులను సమర్థిస్తూ ప్రోత్సహించిన స్వరా భాస్కర్, ఆలిండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు సభ్యుడు, మహిళా విద్యకు వ్యతిరేకంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నొమానీని కలుసుకోవడంతో అటు సామాజిక మాధ్యమాలు, మీడియాలో కూడా సంచలనం చెలరేగింది.

ఒకానొక వీడియోలో ఆడపిల్లలను పాఠశాలలకు, కళాశాలలకు పంపడం హరామ్ (నిషేధం) అంటూ వ్యాఖ్యానించాడు. అలా పంపిన వారి తల్లిదండ్రులు నరకానికి పోతారని కూడా ఖండించాడు. అతడి సిద్ధాంతం కేవలం విద్యకు పరిమితం కాదు, ముస్లిం మహిళల సచ్ఛీలతపై కూడా వ్యాఖ్యానించాడు. ముస్లిం ఆడపిల్లలు పర్దాను వదిలిపెట్టడం గురించి ఆందోళన వ్యక్తం చేశాడు. వీటన్నింటినీ మించి, నొమానీకి ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ పాలన అంటే పరమ ప్రేమ. వారు అధికారాన్ని చేపట్టినప్పుడు ట్విట్టర్‌పై అభినందనలు తెలపడం కూడా సంచలనమైంది. ఇంతటి ఘనత కలిగిన ఆ ముల్లాను, స్వరా భాస్కర్ వంటి ఫెమినిస్టు నెత్తిన ముసుగు వేసుకొని మరీ కలవడాన్ని ఏమనాలి? పైగా, స్వరకు 'భగవా లవ్ ట్రాప్' సిద్ధాంతాన్ని పరిచయం చేశాడుట! లవ్ జిహాద్‌లో ఏం చేస్తారో అదంతా హిందూ పురుషులకు ఆపాదించి, చేసిన బోధ స్వరకు భలే నచ్చినట్టుందని నెటిజన్లు ఎగతాళి చేస్తున్నారు. పైగా, ఒక అతివాద ముల్లాను ఆమె నెత్తిన ముసుగు వేసుకొని కలిసిందంటే, ఆమె ఫెమినిజం వైఖరిలో సరళత వచ్చినట్టే అంటున్నారు. నిజానికి, అనేక భావనలలాగే, ఫెమినిజాన్ని కూడా ఒక పరికరంగా, సమయానుకూలంగా వాడుకుంటోందని విమర్శలు వస్తున్నాయి.



# కమలవాసిని కార్తిక




**తిరుచానూరు నివాసిని అలమేలుమంగమ్మ భక్తులపాలిట వరదాయిని. వారి విన్నపాలను, ఇక్కట్లను విభునికి వినిపించి, ఒత్తిడి తెచ్చి వరాలు ఇప్పిస్తారని విశ్వాసం. అందుకే 'మముగన్న మాయయ్య అలమేలు మంగమ్మ / విభునికి మా మొరలు వినిపించవమ్మా' అంటూ భక్తులు వేడుకుంటారు.'కలౌ వేంకట నాయకః' అని ఆనందనిలయుడు శ్రీనివాసుడు, భక్తుల పాలిట కల్పవల్లిగా ఆయన పట్టపురాణి, 'శాంతినిలయ'వాసిని పద్మావతీదేవి పూజలు అందుకుంటున్నారు.**

పావన స్వర్ణముఖీతీరంలో వ్యాసభగవానుడి తనయుడు శ్రీశుకమహర్షి ఆశ్రమమే (శుకపురి) నేటి తిరుచానూరు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాస్ పెరుమాళ్ తపమాచరించిన పుణ్యప్రదేశం. దీనికి 'తిరుచ్చికనూర్', 'తిరుచ్చొకనూర్' అని నామాంతరాలు ఉన్నట్లు 8,9 శతాబ్దాల నాటి తిరుమల తిరుపతి దేవస్థానాల శాసనాలు పేర్కొంటున్నాయి. కార్తిక శుక్ల పంచమి శుక్రవారం ఉత్తరాషాఢ నక్షత్రంలో అమ్మ వారు ఆవిర్భవించారు. పద్మంలో అవతరించారు కనుక 'పద్మావతి' అని, పుష్పంపైన దేదీప్యమానంగా వెలుగులీనుతున్న దివ్యవనిత కనుక 'అలర్ మేల్ మంగ'అని వ్యవహరిస్తారు. పద్మసరోవర మహాత్మ్యాన్ని నారద వసిష్ఠ మరీచి అత్రి అంగీరస పులస్త్య పులహక్రతు తదితర మహర్షులు ప్రస్తుతించారు. శ్రీవారు ప్రతిష్ఠించిన సరోవరంలో ఆవిర్భవించిన అలమేలుమంగ బ్రహ్మాదిదేవతల విన్నపం మేరకు భక్తజనులను తరింపచేసేందుకు అక్కడే 'అర్చామూర్తి'గా స్థిరపడేందుకు అంగీకరించారు. అప్పటికే 'వ్యూహలక్ష్మి'గా వక్షంలో నిలుపుకున్న శ్రీనివాసుడూ అందుకు ఆమోదించారు. ఆయన హృదయపీఠంలో పద్మాసనయై ఉన్న లక్ష్మినే 'వ్యూహలక్ష్మి'గా అర్చిస్తారు.

**'ద్విభుజా వ్యూహలక్ష్మీః స్యాత్ బద్ధ పద్మాసన ప్రియా శ్రీనివాసంగ మధ్యస్థా సుతరాం కేశవ ప్రియాః'**

'వ్యూహం' అంటే ఊహించుకునేది, రహస్యం. అంటే ఆమె శ్రీనివాసుడి హృదయంలో విరాజిల్లుతూ భక్తులను

# ధన్వంతరి ముపాస్మహే...!!

వైద్యుడిని నారాయణ స్వరూపంగా ('వైద్యో నారాయణో హరిః') భావించడం మన సంప్ర దాయం. ఆ ఆది వైద్యుడే ధన్వంతరి. శ్రీమన్నారాయ ణుడి 21 అవతారాల పరంపరంలో ఆయనది పన్నెండవదిగా చెబుతారు. క్షీరసాగర మథన వేళ వెలువడిన హాలాహలం, కల్పవృక్షం, ఐరావతం, కామధేనువు, ఉచ్ఛైశ్రవం, శ్రీమహాలక్ష్మి తదితరాలలో ధన్వంతరి ఉన్నారు. సాక్షాత్తు శ్రీహరి అంశంతో శంఖుచక్రాలు,ఓషధులు, అమృతకలశం ధరించి చతుర్భుజాలతో 'ఆదివైద్యుడు'గా ఉద్భవించాడు. సముద్ర జలాలపై నిలిచి తనను అర్చిస్తుండగా, 'అబ్జుడు' అని నామకరణం చేశాడు హరి. అతను విష్ణుదేవుని అంశ వలన పుట్టిన వాడని, యజ్ఞభాగ భోజనుడు, ఆయుర్వేదజ్ఞుడు, మహనీయుడని గ్రహించిన బ్రహ్మాదులు 'ధన్వంతరి''అని వ్యవహరిం చారు. ధన్వంతరి అంటే ఆరోగ్య దేవత అని అర్థం. పతంజలి ఆయన అంశ అని పెద్దల మాట.ఆహారం, నిద్ర వ్యవహారాలలో మితం పాటిస్తూ, యోగాభ్యాసం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పతంజలి యోగశాస్త్రం చెబుతోంది.

ఆయుర్వేద వైద్యం తెలిసిన మహా మేధావి ధన్వంతరి, దేవతలకు వైద్యుడు. వారికి అజరామర మైన అమృతాన్ని అందించిన ఆయన మానవులకు జరావ్యాధి మరణాలు నివారించే ఔషధాలను ప్రసాదించాడు. చెట్ల వేర్లు, కాండం, ఆకులు, పూవులతో అనేక ఔషధాలు తయారుచేశాడు. జలుబు, జ్వరం లాంటి చిన్న చిన్న అనారోగ్యాలు మొదలు పక్షవాతం, కామెర్లు, రాచపుండు (కాన్సర్) లాంటి అనేక పెద్ద వ్యాధుల నివారణకు మందులు కనిపెట్టాడు. పసుపును క్రిమిసంహారిణిగా (యాంటీ బయాటిక్) ఉపయోగించాడు. ప్రపంచంలోనే తొలి శస్త్ర చికిత్స చేసిన ఘనత ఆయన సొంతం. ఆనాడే ధన్వంతరి ప్లాస్టిక్ సర్జరీ చేసినట్లు చెప్పే కథనాలు అనేకం ఉన్నాయి.

ధన్వంతరి వైద్య విధానాన్ని, అందులోని సూత్రాలను ఆయన శిష్యులు పాటించేవారు. యుద్ధ సమయంలో గాయపడినవారికి తక్షణ చికిత్స అందించేవారు. అవసరమైనవారికి శస్త్ర చికిత్స చేసేవారు. ఇప్పటిలా సాంకేతిక నైపుణ్యం అభివృద్ధి చెందక ముందే, అత్యాధునిక వైద్య పరికరాలు అమరకముందే ధన్వంతరి శస్త్రచికిత్స అబ్బురపరిచే అంశంగా నేటి వైద్య నిపుణులే చెబుతారు.

బ్రహ్మవైవర్త పురాణం ప్రకారం, సూర్యుని వద్ద ధన్వంతరి ఆయుర్వేదం నేర్చుకున్నట్లుగా తెలుస్తోంది. సూర్యుని 16 శిష్యుల్లో ఆయన ఒకరు.తాను ఆర్జించిన విద్యతో ఎందరికో ప్రాణం పోశాడు. ఒకసారి శిష్యబృందంతో కైలాసం వెళుతున్న ధన్వంతరిపై తక్షకుడు (సర్పం)విషం చిమ్మడంతో ఒక శిష్యుడు మూర్ఛపోయాడు. ధన్వంతరి తన వనస్పతి ఓషధితో శిష్యుడు తేరుకునేలా చేయగా, మరో శిష్యుడు తక్షకుడి తలపై గల మణిని లాగి కిందకు కొట్టాడు, ఆ సమాచారం తెలిసిన సర్పరాజు వాసుకి పెద్ద సంఖ్యలో సర్పాలను పంపగా, అవి విషం చిమ్మాయి. ఆ ప్రభావంతో అస్వస్థు లైన వారికి ధన్వంతరి వనస్పతి ద్వారా స్వస్థత చేకూర్చి సర్పాలు మూర్ఛిల్లేలా చేశారు. ప్రతిగా వాసుకి, శివుని శిష్యురాలు సర్పదేవత మానసాదేవిని పంపి ధన్వంతరి శిష్యులను పడగొట్టగా, ధన్వంతరి తన విష నివారణ విద్య ద్వారా వారిని

# బ్రహ్మోత్సవం

ఆయన అనుగ్రహానికి పాత్రులను చేస్తుంది.

దేవేరి కోరినట్లు వేంకటాచల క్షేత్రంలో తరహాలోనే తిరుచానూరులోను బ్రహ్మోత్సవాలు జరిగేలా అనుగ్రహించారట. విష్ణువు సేనాపతి విష్వక్సేనుల పర్యవేక్షణలో, సుదర్శన చక్రత్తాళ్వార్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. అందుకే ఆరంభంలో విష్వక్సేనారాధన, ముగింపులో చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. అసలు, శ్రీవారి బ్రహ్మోత్సవాలు తిరుచానూరులోనే ప్రారంభ మయ్యాయని తిరుమల ఆలయంలోని తొలిశాసనం బట్టి తెలుస్తోంది. అప్పట్లో దుర్గమ ప్రాంతమైన తిరుమలలో సరైన ఆలయ ప్రాకారాలు, ఉత్సవాదులకు వీధులు లేకపోవడంతో అక్కడ 'తిరుమల ఒళుగు' అనే ఉత్సవాన్ని ఆరంభించి మిగిలిన వాహనసేవలు తిరుచానూరులోని వేంకటనాథుడి 'తిరువిలన్ కోయిల్'లోని తిరువేంకట పెరుమాళ్‌కు నిర్వహించేవారట. తిరిగి ధ్వజావరోహణం తిరుమలలో ఉండేదట. అనంతర కాలంలో భగవద్రామానుజ యతీంద్రులు ఈ పద్ధతికి స్వస్తి పలికి శ్రీవారిబ్రహ్మోత్సవాలు తిరుమలలోనే జరిగేలా ఏర్పాట్లతో పాటు స్వామివారికి నిత్య కైంకర్యాదులను స్థిరపరచి, కట్టుదిట్టం చేశారు. కొండపై ఉత్సవాలకు వెళ్లలేని వారికి స్వామివారి ప్రతిరూపాన్ని తిరుచానూరు ఆలయంలో ఉంచి ఉత్సవాలు జరపడం ద్వారా శ్రీవారి దర్శన భాగ్యం కలిగించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది.

పంచమి తీర్థానికి (మార్గశిర శుద్ధ పంచమి) పదిరోజుల ముందు, అంటే చాంద్రమానం ప్రకారం కార్తిక బహుళ ఏకాదశి రాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. శేషవాహనంపై అనంత లక్ష్మిగా, హంస వాహనంపై సరస్వతిగా, కల్పవృక్షంపై కామితార్థప్రదాయినిగా, గజవాహనంపై గజలక్ష్మిగా, గరుడవాహనంపై శ్రీవేంకటాద్రి లక్ష్మిగా, హనుమద్వాహనంపై సీతాలక్ష్మిగా... ఇలా అనేక వాహనాలపై అమ్మవారు దర్శనమిస్తారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. సుప్రభాతం అనంతరం సహస్రనామ నిత్యార్చనతో నిత్యకైంకర్యం అనంతరం, అమ్మవారిని శ్రీకృష్ణ ముఖమండపంలో ఆశీనులను చేసి, శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన సేవ తనిర్వహిస్తారు.

**పంచమితీర్థం సారె**

బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా పంచమి తీర్థం నాడు దేవదేవుడు దేవేరికి ఘనంగా సారె పంపుతారు. రెండు బంగారు నగలు, రెండు పట్టు చీరలు, రెండు పట్టు రవికల వస్త్రాలు, పచ్చి పసుపు చెట్టు, పసుపు, చందనం ముద్దలు, తులసి, పూలమాలలతో పాటు పిడివంటలు ఒక్కొక్క రకం ఒక్కొక్క పడి (51) చొప్పున పెద్ద లడ్లు, వడలు, అప్పాలు, దోసెలు తదితరాలను ఏనుగు అంబారీపై తరలిస్తారు. దేవస్థానం సిబ్బంది, అమ్మవారి ఆలయ అర్చకులు, పరిచారకులు వాటిని వెదురుబుట్టలలో పెట్టుకొని తిరుమల నుంచి కాలినడకన అలిపిరి పద్మావతి పసుపు మండపానికి చేరతారు. అక్కడి నుంచి ఏనుగు అంబారీపైన వాటిని అధిష్ఠింపచేసి మేళతాళాలతో తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి, శ్రీ కోదండ రామస్వామి ఆలయాల మీదుగా తిరుచానూరు చేరుకుంటారు. అమ్మవారికి సారె సమర్పించి, పద్మసరోవరంలో పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో తిరుమంజనం, చక్రస్నానం నిర్వహిస్తారు. సుదర్శన చక్రంతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పద్మసరోవరంలో పుణ్య స్నానాలు చేస్తారు.

ఆ మరునాడు అమ్మవారికి పుష్పయాగం నిర్వహిస్తారు.అనేక సుగంధ పుష్పాలతో భగవంతుడిని, భగవతిని అర్చించడాన్ని పుష్పయాగం అంటారు.

*'ధ్వజారోహణ తీర్థాంత*
*ప్రాయశ్చిత్తంతు యద్భవేత్*
*తస్యదోష విఘాతార్థం*
***పుష్పయాగం చ కారయేత్'*** అని ఆర్యోక్తి. ఉత్సవాలలో ధ్వజారోహణం నుంచి అవభృత (చక్ర) స్నానం దాకా సాగిన కార్యకలాపాలలో చిన్నపాటి లోపాలు, దోషాలు చోటుచేసుకుంటే వాటి నివారణకు వేదసూక్తాలు, ఉపనిషత్తుల పఠనంతో ఈ విశేష క్రతువును నిర్వహిస్తారు.



---

డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి




సజీవులను చేశారు. ఆగ్రహించిన మానసాదేవి ఆయనపై త్రిశూలం విసరబోగా బ్రహ్మ రుద్రులు ప్రత్యక్షమై ఆమెను శాంతపరిచారు.

'మీ అంశంతో పుట్టిన వాడిని కనుక యజ్ఞ భాగాన్ని పంచండి' అన్న ధన్వంతరి విన్నపాన్ని విష్ణువు మృదువుగా తిరస్కరిస్తూ, 'నీవు దేవతల తరువాత జన్మించావు కనుక వారిలా పరిగణంచలేం. యజ్ఞభాగాన్ని దేవతలందరికి పంచేశాను. పునర్జన్మలో గర్భస్థ శిశువుగానే అనిమా, గనిమా జ్ఞానం పొంది, దేవతాంశంతో జన్మించి ఆయుర్వేద గ్రంథం రాస్తావు' అని వరమిస్తాడు.

కేరళలో, గురువాయూర్– త్రిస్సూర్ మధ్య 'నెల్లువాయ' అనే గ్రామంలోని ధన్వంతరి ఆలయాన్ని చాలా మంది ఆయుర్వేద వైద్యులు చికిత్స వృత్తి ప్రారంభానికి ముందు దర్శిస్తుంటారు. దూరప్రాంతాల ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఆయనను విష్ణుసహస్రనామ పారాయణంతో అర్చించి, 'ముక్కుడి' అనే ప్రసాదాన్ని నివేదిస్తారు. ఈ స్వామిని సేవించిన వారు ఉదర వ్యాధుల నుంచి విముక్తులవుతారని ప్రజల విశ్వాసం.ఆ రాష్ట్రంలోనే కాలికట్ పరిసరాలలో, తమిళనాడు శ్రీరంగంలోని రంగనాథ ఆలయ ప్రాంగణంలో, కర్ణాటకలో బెంగళూర్ యశ్వంత పురలో, ఆంధ్రప్రదేశ్‌లోని చింతలూరులో ధన్వంతరి ఆలయాలు ఉన్నాయి. శ్రీరంగంలో గరుడవాహన భట్టార్ అనే ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు ఈ మూర్తిని ప్రతిష్ఠించి నట్లు సాధారణ శకం 12 వ శతాబ్ది నాటి శాసనం బట్టి తెలుస్తోంది. ఆ ఆలయంలో కొన్ని మూలికల రసం (కషాయం) తీర్థంగా ఇస్తారు. ఢిల్లీలోని "ఆయుర్వేద, సిద్ధ పరిశోధన మండలి కేంద్రం" (Central council for Research in Aurveda and Siddha)లో, వారాణసిలోని సంస్కృత విశ్వవిద్యాలయం ప్రదర్శన శాలలో ధన్వంతరి విగ్రహాలు ఉన్నాయి.,

ధన్వంతరి తన వైద్య విధానాన్ని కాయచికిత్స, బాలచికిత్స, గ్రహ చికిత్స, శలాక్యతంత్ర, శల్యతంత్ర, విషతంత్ర, రసాయన తంత్ర,వాజీకరణ తంత్ర..అని ఆయుర్వేద వైద్యాన్ని ఎనిమిది భాగాలుగా విభజించాడు. ఇవి మనిషి సర్వావయవలకూ వచ్చే వ్యాధుల గురించి చర్చించాయి. అంటే మనిషిని పరిపూర్ణ ఆరోగ్యవంతునిగా ఉంచగలిగే సంపూర్ణ వైద్యవిధానాన్ని ఆయుర్వేదం ద్వారా అందించారు ధన్వంతరి. అందుకే ఆయనను ఆయుర్వేద ద్రష్ట– అపర నారాయణ స్వరూపుడుగా శ్లాఘిస్తారు.

**'అచ్యుతానంత గోవింద విష్ణో నారాయణామృతః**
**రోగాన్ మే నాశయాశేషాన ఆశు ధన్వంతరే హరే'**



మహారాష్ట్ర, జార్ఖండ్‌శాసన సభల ఎన్నికల ప్రచారంలో కొట్టొచ్చినట్టు కనిపించే అంశాలు చాలా ఉన్నాయి. నవంబర్ 20న పోలింగ్ జరిగిన ఆ రెండు రాష్ట్రాలలో ప్రచారం భారత వ్యతిరేకత, భారతీయత అన్న శిబిరాలు మధ్య జరిగిన ప్రచారమన్నట్టు కనిపించింది. హిందువుల ఐక్యత అంశం, హిందూ జనాభా తగ్గిపోవడం వల్ల వచ్చే ప్రమాదం ఈ ప్రచారంలో దూసుకు వచ్చినట్టు ఇంతకు ముందు ఏనాడూ నేరుగా రాలేదు. తాము అధికారంలోకి రావాలంటే బీజేపీని నిరోధించాలి కాబట్టి, అందుకు ముస్లింలను బుజ్జగించడం ఒక్కటే శరణ్యమన్న రీతిలో కాంగ్రెస్, దాని భాగస్వాములు వ్యవహరించాయి. ముస్లింలను ఇంకా బుజ్జగించడం అంటే మరొక దేశ విభజనకు బీజాలు వేయడమేనని బీజేపీ కూడా ఎలాంటి మొహమాటం లేకుండా సమాధానం ఇచ్చింది.

# హిందూ ఐక్యతా నినాదానికి మరి

సెక్యులరిజం, కుహనా సెక్యులరిజం వాదోప వాదాలు, ఆరోపణలను మించిన నిశిత అంశం ఇందులో ఇమిడి ఉంది. విపక్ష శిబిరం నుంచి బుజ్జగింపు ధోరణే ఇక్కడ కూడా కేంద్ర బిందువే అయినా, హిందువులు ఓటు బ్యాంక్‌గా ఆవిర్భవించ వలసిన అవసరం గురించి ఎక్కువ మంది బీజేపీ నేతలు బాహాటంగా మాట్లాడవలసిన పరిస్థితి ఇప్పుడు కనిపించింది కూడా. బీజేపీతో పొత్తు పెట్టుకున్నా, రాముడిని తిట్టే ముస్లింను అభ్యర్థిగా నిలిబెట్టిన పార్టీ హిందువులు ఐక్యంగా ఉండాలన్న నినాదాన్ని తప్పు పట్టింది. అదే ఎన్‌సీపీ (అజిత్). ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ హిందూ ఐక్యత గురించి శషభిషలు లేకుండా మాట్లాడారు. దీనికి ముక్తాయింపే ఎన్‌సీపీ చీలిక నేత అజిత్ పవార్‌కు మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఇచ్చిన గట్టి సమాధానం. తమకు పొత్తు భాగస్వామి కంటే, హిందూత్వమే మిన్న అనే సంకేతం ఫడణవీస్ మాటలలో విశ్లేషకులు గమనించారు. ఫలితాల గురించి ఊహాగానాలు లేదా సర్వేలు ఏం చెబుతున్నా, తాము హిందుత్వ వైపు ఉండి తీరుతామని బీజేపీ స్పష్టం చేసినట్టే ఉంది. బీజేపీని నిరోధించడానికీ, ముస్లింలను బుజ్జగించడానికీ తేడా లేదని కాంగ్రెస్ భాగస్వాములు నమ్ముతున్నారు.

పదిహేను రోజులలో పదవికి రాజీనామా చేయకపోతే చంపుతాం అంటూ యోగికి పుణే నుంచి మెసేజ్ వచ్చిన నేపథ్యంలో ఆయన రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యోగిని చంపుతామని ఫోన్ సందేశం పంపించిన వ్యక్తి 24 ఏళ్ల ముస్లిం యువతి. అన్నట్టు ఈ యువతికి కూడా షరా మామూలే అన్నట్టు "మతి స్థిమితం లేదు". అయినా యోగి తనదైన శైలిని విడిచిపెట్టలేదు. బుల్‌డోజర్ న్యాయం చెల్లదంటూ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు కూడా ఆయననేమీ వెనకడుగు వేయనీయలేదు. తనదైన వాగ్ధాటికి ఇంకాస్త పదును పెట్టారేమో కూడా. తమకు రాజకీయం ప్రధానం కాదని, ఎన్నికల పొత్తులు, అసలు ఎన్నికలు కూడా ప్రధానం కాదని, భారతీయత, హిందూత్వమే ప్రధానమని యోగి ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ కూడా చెప్పడమే ఇక్కడ గమనించదగ్గ విషయం. మనం విడిపోతే ఊచకోతే మిగులుతుంది అంటూ మొదట యోగి ఆగ్రాలో నినాదం ఇచ్చారు. బాంగ్లాదేశ్‌లో హిందువుల హత్యాకాండ నేపథ్యంలో ఆయన ఆ మాట అన్నారు. సంఘ పరివార్ ఈ నినాదాన్ని కాస్త ముందుకు తీసుకువెళ్లింది. ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్‌జీ భాగవత్, తరువాత నరేంద్ర మోదీ కూడా ఇదే తరహా నినాదాలు ఇచ్చారు. లేదా అభిప్రాయాలు ప్రజల ముందు ఉంచారు. హిందువుల ఐక్యత గురించి మొత్తం సంఘ పరివార్ ముక్తకంఠంతో ఘోషించింది.

హిందువుల ఐక్యత గురించి మాట్లాడితే కాంగ్రెస్, జేఎంఎం (జార్ఖండ్ ముక్తి మోర్చా), ఎన్‌సీపీ (అజిత్) గంగవెర్రులెత్తిపోయాయి. అయితే కాంగ్రెస్ జార్ఖండ్ వ్యవహారాల ఇన్‌చార్జ్ గులాం అహ్మద్ మిర్ ఇచ్చిన ఒక్క హామీ ఎంత ప్రమాదకరమైనదో వీళ్లెవరూ మాట్లాడడం లేదు. తమ ప్రభుత్వం ఏర్పడితే చొరబాటుదారులకు కూడా తగ్గింపు ధరలతో గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామని అన్నారు.

మనం (హిందువులు) చీలిపోతే కూలిపోతాం అని చెబితే సెక్యులరిజానికి వ్యతిరేకమా? శివాజీ వంటి చరిత్ర పురుషుడు సహా ఎందరో ఈ విషయాన్ని చెప్పిన చారిత్రక సత్యాన్ని ఇప్పుడు గుర్తు చేయవలసి వస్తే ఎందుకు ఉలికిపాటు? ఇందులో ముస్లిం వ్యతిరేకత ఏముంది? అయోధ్య రామాలయం మీద దాడి చేస్తామని కెనడాలో కూర్చుని వదరే సిక్కు ఉగ్రవాది మాటల కంటే ఇది ప్రమాదకరమైనదా? వక్ఫ్‌ను వ్యతిరేకించడానికి తమ యువకులు వీధులలోకి వస్తే కేంద్ర ప్రభుత్వం గడగడ లాడిపోతుంది జాగ్రత్త అన్న హెచ్చరిక కంటే



అమిత్ షా



తీవ్రమైనదా? జార్ఖండ్‌లోని సంథాల్ గిరిజన ప్రాంతాలలో 1970 వరకు 8 శాతం ఉన్న ముస్లింలు ఇప్పుడు 28 శాతం ఎలా అయ్యారని ప్రశ్నించిన హిందువులు ఉన్మాదులుగా ఎందుకు ముద్ర వేయించుకోవలసి వస్తున్నది? నిజానికి ఈ ప్రశ్నలు పదునెక్కుతున్న కాలమే హిందువుల రక్షణ గురించి మాట్లాడక తప్పని పరిస్థితి అనివార్యమైంది. సంఘ పరివార్ నేతల నోటి నుంచి వెలువడిన ఆ వాగ్బాణాలు నిజానికి హిందూ సమాజం ఆకాంక్షలే.

మనం విడిపోతే బలైపోతాం, కలసి ఉంటే బలంగా ఉంటాం అంటూ యోగి ఆదిత్యనాథ్ మహారాష్ట్రలో పిలుపునిచ్చారు. ఇదే తరహా నినాదం ఆయన స్వరాష్ట్ర ఉప ఎన్నికల నేపథ్యంలో కూడా ఇచ్చారు. మహారాష్ట్రలోని వాశిం, అమరావతి, అకోలా అసెంబ్లీ నియోజకవర్గాలలో నవంబర్ మొదటివారంలో యోగి ప్రచారం చేశారు. బజ్రంగ్

# ంత పదును!

బలిని ద్వేషించే వాళ్లంతా ఆయన ఉనికి లేనిచోటికి వెళ్లిపోతే బాగుంటుందని ఆయన నిర్మొహమాటంగానే చెప్పారు. ఇస్లాం ఉనికిలోకి రావడానికి చాలా ముందే ఈ దేశంలో బజ్రంగ్‌బలి ఆరాధన ఉంది. అలాంటిది రామనవమికి, హనుమత్ జయంతులకి అడ్డంకులు ఎందుకు పెడుతున్నారని యోగి సూటిగానే ప్రశ్నించారు. కులాల వారీగా హిందువులు విడిపోరాదనే యోగి నీళ్లు నమలకుండా చెప్పారు.

కానీ ఐక్యంగా ఉండమని చెబితేనే అది సమాజాన్ని విడదీయడమని చెప్పడమేనని బీజేపీతో పొత్తు పెట్టుకున్న ఎన్‌సీపీ (అజిత్) వర్గం తప్పు పట్టడం వికారంగా అనిపిస్తున్నది. మనం ఐక్యంగా ఉండి, ప్రపంచంలోనే శక్తిమంతమైన దేశంగా రూపొందాలని యోగి చెప్పారు. ఇందుకు అయోధ్యలో నిర్మించిన రామాలయం నాంది పలికిందని ఆయన కుండబద్దలు కొట్టి చెప్పారు. అది ఆరంభం, ఇంకా కాశీ, మధురల కోసం కూడా అదే విధంగా పని చేయాలని యోగి చెప్పారు. రాముడు, కృష్ణుడు ఉనికిని ప్రశ్నించే పార్టీ కాంగ్రెస్ అని, అయోధ్యలో రామమందిరం నిర్మించి నరేంద్ర మోదీ 140 కోట్ల మంది భారతీయుల స్వప్నం సాకారం చేశారని అన్నారు యోగి. అసలు కాంగ్రెస్ దేశం గురించి, భారత్ గురించి, భారతీయత గురించి ఏనాడైనా ఆలోచించిందా అని ఆయన సూటిగానే ప్రశ్నించారు.

ఇప్పుడు మాట్లాడే ఏ బీజేపీ నాయకుడు అయినా వక్ఫ్ నేపథ్యంతో తలెత్తిన సంక్షోభాన్ని గుర్తుకు వచ్చేటట్టు మాట్లాడకుండా ఉండదు. వక్ఫ్ బోర్డు కోరిందే తడవుగా కాంగ్రెస్ ప్రభుత్వాలు భూములకు సంబంధించిన నోటీసలు జారీ చేస్తున్నాయి. భూ జిహాద్‌పై పోరాటంలో సంఘ పరివార్‌కు అనూహ్యంగా క్రైస్తవ సమాజం నుంచి మద్దతు లభిస్తున్నది. అసలు మహారాష్ట్ర లవ్ జిహాద్‌కు, భూ జిహాద్‌కు కేంద్రంగా మారిపోతోందని యోగి ఈ ఎన్నికల ప్రచారంలోనే ఆరోపించారు. ఇలాంటి ప్రయోగాలకు రాష్ట్రం కేంద్రం కాకుండా ఓటర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. ప్రతి సభకు యోగి స్వరం పెంచారు. 1947 నాటి భారత విభజన పెద్ద గుణపాఠం నేర్పుతుంది. హిందువులు చీలికలు పేలికలుగా విడిపోయారు. దీని ఫలితమే దేశ విభజన. హిందువుల హత్యాకాండ కూడా దాని ఫలితమే. అందుకే చీలిపోవద్దు. ఐక్యంగా ఉంటే భద్రంగా ఉంటారు అని యోగి వ్యాఖ్యానించారు. ఐదు వందల ఏళ్ల పాటు మనం చీలికిపేలికలుగా ఉండిపోవడం వల్లనే రామాలయ నిర్మాణం సాధ్యం కాలేదని ఆయన గుర్తు చేశారు. మీరు అంటే హిందువులు ఇలా ముక్కలు చెక్కలుగా విడిపోతూ ఉంటే గణేశ్ ఉత్సవాల మీద దాడులు జరుగుతూనే ఉంటాయి. ప్రేమ, లవ్ జిహాద్ పేరుతో ఇక్కడి భూమి అంతా పరాధీనమయిపోతుంది అని చెప్పారాయన. అసలు మహిళ రక్షణే డోలాయమాన పరిస్థితులలో పడిపోతుందని తీవ్రంగానే హెచ్చరించారు.



హిమంత బిశ్వశర్మ



దేవేంద్ర ఫడణవీస్

కశ్మీర్‌లో ఉగ్రవాదులను చంపరాదని వాదించే వారితో చెట్టపట్టాలేసుకు తిరిగే శిబిరానికి ప్రధాని నరేంద్ర మోదీ కూడా గట్టి హెచ్చరికే చేశారు. యోగి తరువాత ప్రధాని కూడా మహారాష్ట్రలో ప్రచారం చేశారు. యోగి నినాదాన్నే మోదీ మరింత స్పష్టంగా ప్రజల వద్దకు తీసుకువెళ్లే ప్రయత్నంచేశారు. మనం విడిపోతే బలి అవుతాం అన్న యోగి నినాదాన్ని బలపరుస్తూ, మోదీ, మనం ఐక్యంగా ఉంటే క్షేమంగా ఉంటాం అని అన్నారు. కులాల మధ్య తంపులు పెట్టడమే కాంగ్రెస్ లక్ష్యమని పేర్కొంటూ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు వృద్ధిలోకి రావడం కాంగ్రెస్‌కు ఏమాత్రం ఇష్టం లేదని అన్నారు.

నిజం చెప్పాలంటే నెహ్రూ యుగం నుంచి కూడా ఆ కుటుంబానికి రిజర్వేషన్ ఇవ్వడం ఇష్టం లేదు. ఇప్పుడు ఆ కుటుంబంలో నాలుగో తరం యువరాజు (రాహుల్‌గాంధీ) కూడా కులం పేరుతో భారతదేశాన్ని విభజించాలని చూస్తున్నారని నరేంద్ర మోదీ మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలోనే విమర్శించారు. కశ్మీర్‌లో మళ్లీ 370 ఆర్టికల్‌ను తేవాలన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిని నిరోధించిన బీజేపీ ఎమ్మెల్యేలపై దాడి జరిగిందని, కానీ అక్కడ అంబేద్కర్ రాజ్యాంగం అమలులో ఉందని మోదీ అన్నారు.

జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో అక్రమ వలసల అంశం చర్చకు వచ్చింది. ఇక్కడి ప్రచారం ఉమ్మడి

పౌరస్మృతి కూడా ఒక అంశంగా నిలిచింది. నిజానికి రిపబ్లిక్ టీవీ ఇచ్చిన ప్రత్యేక కార్యక్రమం ప్రకారం జార్ఖండ్‌లోని సంథాల్ గిరిజనులు నివాసం ఉండే ప్రాంతం అటు భూ జిహాద్, ఇటు లవ్ జిహాద్‌కు అంటే జమిలి జిహాద్‌కు కేంద్రంగా ఉంది. 1970 వరకు 8 శాతం ఉన్న ముస్లిం జనాభా ప్రస్తుతం 28 శాతానికి ఎలా వచ్చిందన్నదే ఇప్పుడు బీజేపీ వేస్తున్న ప్రశ్న. తమ వర్గం ఆడపిల్లలను పెళ్లిళ్లు చేసుకుని భూములు లాక్కుంటున్నారని స్థానికులు గోడు వెళ్లబోసుకున్నారు. అంతకంటే ముందే అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఈ అంశాన్ని ప్రచారంలో లేవనెత్తారు. ఇలా వాస్తవం చెప్పడం సమాజంలో చీలికలు తేవడానికేనని కాంగ్రెస్, జార్ఖండ్ ముక్తి మోర్చా భాష్యం చెబుతున్నాయి. ఇప్పుడున్న ప్రభుత్వం చొరబాటుదారులకు ఎర్రతివాచీ



అహ్మద్ మిర్



అజిత్ పవార్

వేసి ఆహ్వానం పలికింది. ఆ వర్గం తమకు గంపగుత్తగా ఓట్లు వేస్తారన్న ఆశతోనే అలా చేసింది అని శర్మ వ్యాఖ్యానించారు. ఆ వర్గం ఎవరో ఒక వ్యక్తి, అది కూడా తమ వర్గీయుడికే ఓటు వేస్తారు. హిందువులు అక్కడే విఫలమవుతున్నారని శర్మ హిందూ సమాజంలోని అసలు లోపం గురించి చెప్పే ప్రయత్నం చేశారు. ఇలాంటి విషపూరిత ప్రచారం ద్వారా దేశంలో అంతర్యుద్ధ వాతావరణం సృష్టించే విధంగా అస్సాం ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని ఇండీ కూటమి ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. ఒక వర్గం, అంటే ముస్లింలు అంతా కూడా చొరబాటుదారులేనన్నట్టు హిమంత మాట్లాడు తున్నారని కూడా ఇండీ ఫిర్యాదు చేసింది. హేమంత్ సోరెన్ ప్రభుత్వం బాంగ్లాదేశ్ చొరబాటుదారులకు మద్దతు ఇస్తున్నదంటూ హిమంత బిశ్వశర్మ చేసిన వ్యాఖ్యపై కూడా ఇండీ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు అందించారు. అయితే అక్రమ చొరబాటుదారులకు వ్యతిరేకంగా మాట్లాడడం తప్పని ఏ రాజ్యాంగంలో ఉందో చెప్పాలని హిమంత కాంగ్రెస్, జేఎంఎంలకు సవాలు విసిరారు. భారత దేశంలోని హిందూ నాగరికతను రక్షించాలని మాత్రమే తాను అన్నానని, ముస్లిం అన్న పదం కూడా పలకలేదని హిమంత చెప్పారు.

హిమంత బిశ్వశర్మ చొరబాటుదారుల పేరు ఎత్తితేనే మండిపడిన కాంగ్రెస్, వారికి తగ్గింపు ధరలతో వంట గ్యాస్ సరఫరా చేస్తామని ఎన్నికల వాగ్దానం చేసింది. బెర్మో అసెంబ్లీ స్థానం పరిధిలోని చంద్రపూర్ ఎన్నికల సభలో మిర్ ఇలాంటి హామీ ఇచ్చేశారు. డిసెంబర్ 1 నుంచి సిలిండర్ ధర రూ. 450కి తగ్గించి ఎస్‌సీ, ఎస్‌టీ, హిందువులు, ముస్లింలు, చొరబాటుదారులకి అందిస్తామని చెప్పాడు మిర్. అన్నట్టు ఇందులో ఎలాంటి వివక్షా ఉండదట. చొరబాటుదారులకు ఇక్కడి పౌరులతో సమస్థానం కల్పించడం కాంగ్రెస్, జేఎంఎం కూటమి లక్ష్యమని స్పష్టమయింది. దీని మీద ప్రధాని మోదీ కూడా తీవ్ర విమర్శలు చేశారు. ఇది దేశ వ్యతిరేక ధోరణి కాక మరేమిటని ఆయన ప్రశ్నించారు. బాంగ్లాదేశ్ నుంచి చొరబడిన వారికి వంట గ్యాస్ ఇస్తానని మిర్ చెప్పారంటే, కాంగ్రెస్ అసలు రూపం ఇదేనని తెలుసుకోవాలని జార్ఖండ్ బీజేపీ వ్యవహారాల ఇన్‌చార్జ్ శివరాజ్ సింగ్ చౌహాన్ విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలకు జార్ఖండ్ ప్రజలకు దక్కాలి తప్ప, బాంగ్లాదేశ్ నుంచి వచ్చిన చొరబాటుదారులకు కాదని యోగి ఆదిత్యనాథ్ కూడా తన ప్రచార సభలలో విమర్శించారు. ఇంత విమర్శించినా, దుయ్యబట్టినా తాము సంక్షేమ పథకాల విషయంలో వివక్షను పాటించబోమనే కాంగ్రెస్ వికృతవాదనలు వినిపించింది. ముస్లింలను దారుణంగా అవమా నించారంటూ నవంబర్ 8న సిటిజన్స్ ఫర్ జస్టిస్ అనే ఊరూపేరూ లేని సంస్థ మధ్యప్రదేశ్ ముఖ్య మంత్రి మోహన్ యాదవ్ మీద కేసు పెట్టింది. ఆయన జార్ఖండ్ ముస్లింలను బాంగ్లా చొరబాటుదారులు అని సంబోధించినందుకు ఈ కేసు పెట్టారు. ముస్లింలను గౌరవించవలసిన అవసరం లేదని వ్యాఖ్యా నించారంటూ బీజేపీ అభ్యర్థి సత్యేంద్ర తివారీపై కూడా ఇదే సంస్థ కేసు నమోదు చేసింది. ఇలాంటి సంస్థలనీ కాంగ్రెస్ ప్రయోగించే దొంగ సంస్థలేనని మరచిపోరాదు. మోహన్ యాదవ్ జైశ్రీరాం అంటూ ప్రచార సభలలో నినదించడం కూడా ఈ సంస్థకు నచ్చలేదట.

ఇక్కడితో ఆగలేదు. జార్ఖండ్ ఆరోగ్యమంత్రి బన్నా గుప్తా ఇంకాస్త ముందుకు వెళ్లి, ముస్లింలను రక్షించుకుంటానని ఒక విడియో విడుదల చేశాడు.

విడిపోతే ఊచకోతే సుమా అంటూ యోగి ఇచ్చిన పిలుపు తరువాత బన్నా గుప్తా ఈ విడియో విడుదల చేశాడు. తాను హిందూ ఫండమెంటలిస్టులను ఎదుర్కొని తీరతానని, వీరు ముస్లింల మీద దాడి చేస్తే తాను అడ్డుకుంటానని కూడా ప్రతిజ్ఞ చేశాడు. ఇతడు జంషెడ్‌పూర్ (వెస్ట్) అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నాడు.

కలసి ఉంటే బతుకుతాం లేకుంటే ఊచకోతే అన్న తీరులో యోగి ఆరంభించిన ప్రచారాన్ని ప్రధాని మోదీ ముందుకే తీసుకువెళ్లారు. ఐక్యత లేకపోతే విభజిస్తారు అంటూ ఆయన ఇచ్చిన నినాదం ఇప్పుడు దేశ వ్యాప్తమైంది. మహారాష్ట్ర లవ్ జిహాద్‌కు కేంద్రంగా మహారాష్ట్ర మారిపోయిందని చెప్పడం, మత మార్పిడు లకు వ్యతిరేకంగా చట్టం తెస్తామని చెప్పడమంటే బీజేపీ తన వైఖరిని శషభిషలు లేకుండా ప్రకటించ డమే. దీనిని తప్పు పట్టిన తన మహాయుతి కూటమి భాగస్వామి ఎన్‌సీపీ (అజిత్)ని సైతం బీజేపీ నుంచి విమర్శలు ఎదుర్కొన్నది. యోగి అన్నదాంట్లో తప్పేమీ లేదని మాజీ ముఖ్యమంత్రి ఫడణవీస్ తేల్చి చెప్పేశారు. యోగి వ్యాఖ్యలను తప్పు పట్టడమే కాదు, అవి మతోన్మాదంతో చేసినవని ఈ దశలో అజిత్ పవార్ చెప్పడం బుజ్జగింపు ధోరణికి మోకరిల్లడమే అవుతుంది. ఈయన మహాయుతి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి. అజిత్‌పవార్‌లో హిందూ వ్యతిరేక భావజాలం ఉందని, ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవాలంటే అలాంటి వాళ్లకి సమయం పడుతుందని కూడా పడణవీస్ వ్యాఖ్యానించారు. అజిత్ సుదీర్ఘకాలం హిందూ వ్యతిరేక శక్తులతో కలసి ప్రయాణించారని, హిందూత్వను వ్యతిరేకించినవారితో దశాబ్దాల పాటు అజిత్ కలసి నడిచారని కూడా కాస్త ఘాటుగానే పడణవీస్ స్పందించారు.

కాంగ్రెస్‌ను వద్దని చెప్పండి అని మహారాష్ట్ర వాసులను కోరుతూ కొత్త నినాదం కూడా బీజేపీ ప్రచారం చివరి దశలో అందుకుంది. కాంగ్రెస్ నాయకత్వంలోని మహా వికాస్ అగాడీకి ఎందుకు ఓటు వేయరాదో కారణాలు చూపింది. అందులో 26/11 ముంబై ఉగ్రదాడులు, 2003 వరస పేలుళ్లు,7/11 రైలు పేలుళ్లు, పాల్ఘర్‌లో సాధువుల ఊచకోత వంటి దుర్ఘటనలను బీజేపీ ఓటర్లకు గుర్తు చేసే ప్రయత్నం చేసింది. ఈ ఘటనల సమయంలోనే ఒకసారి యూపీఏ కేంద్ర హోంమంత్రి హిందూ టెర్రరిస్టులు అన్న పదం ప్రయోగించారు.

– జాగృతి డెస్క్



# మణిపూర్ మంటలు అసలు వాస్తవాలు



**ఈశాన్య రాష్ట్రం మణిపూర్ మరోసారి భగ్గుమన్నది. గత ఏడాది జరిగిన ఘర్షణల నుంచి క్రమంగా కోలుకుంటున్న రాష్ట్రంలో మళ్లీ చిచ్చు రగిల్చాయి విద్రోహ శక్తులు. జాతుల మధ్య పోరాటం వెనుక విదేశీ హస్తాలు కనిపిస్తున్నాయి. వేర్పాటువాద శక్తులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్‌లు, క్షిపణులు ఉపయోగించి అమాయక పౌరులను బలి తీసుకోవడం ఆందోళన కలిగించే విషయం. ఈ పరిణామాలు మరింత తీవ్రం కాకముందే దేశ భద్రత, సమైక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు రాజకీయాలకు అతీతంగా చర్యలు చేపట్టాలి**

మణిపూర్– అసోం రాష్ట్రాల సరిహద్దుల్లోని జిరీ, బరాక్ నదుల సంగమ ప్రదేశంలో నవంబర్ 15 రోజున మూడు మృతదేహాలు తేలియాడుతూ కనిపించాయి. అసోం రైఫిల్స్ సైనికులు వాటిని బయటకు తీశారు. మరునాడు మరో ముగ్గురి శవాలు తేలాయి.. వీటిని జిరిబామ్ జిల్లాలో నవంబర్ 11న కిడ్నాప్ అయిన వారి మృతదేహాలుగా గుర్తించారు అధికారులు. ఇందులో ముగ్గురు మహిళలు కాగా ఓ బాలిక, ఇద్దరు బాలురు ఉన్నారు. ఈ ఘటనతో మరోసారి మణిపూర్ హింసాత్మకంగా మారిపోయింది

అపహరణపాలై, చనిపోయినవారు మెయితీ (మైతేయి) తెగకు చెందిన వారు. దీంతో గత ఏడాది అల్లర్ల తర్వాత కుదుటపడుతున్న రాష్ట్రంలో మరోసారి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అప్పటికే అపహరణలకు వ్యతిరేకంగా ఆందోళన చేయిస్తున్నవారి కోపం కట్టలు తెగింది. భారీ ఎత్తున విధ్వంసానికి దిగారు. ఆగ్రహంతో ఊగిపోతూ ముగ్గురు మంత్రులు, ఆరుగురు ఎమ్మెల్యేల నివాసాలపై దాడులు చేశారు. వారి ఇళ్లల్లోకి చొరబడి ఫర్నిచర్, వాహనాలను, ఇతర సామగ్రిని తగలబెట్టారు. 16వ తేదీ రాత్రి ఒక మంత్రి, ముగ్గురు ఎమ్మెల్యేల ఇళ్లకు అల్లరి మూక నిప్పు పెట్టింది. ముగ్గురు బీజేపీ, ఒక కాంగ్రెస్ నేత ఇళ్లపై ఈ దాడి జరిగింది.

మరోవైపు ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ పూర్వీకుల ఇంటిపై దాడి చేసేందుకు అల్లరి మూక ప్రయత్నించగా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. 17వ తేదీ సాయంత్రం ఇంఫాల్‌లోని మరో బీజేపీ ఎమ్మెల్యే ఇంటిని ధ్వంసం చేశారు. ఆందోళనకారులను అదుపు చేసేందుకు భద్రతా సిబ్బంది పలుచోట్ల బాష్పవాయు గోళాలు ప్రయోగించాల్సి వచ్చింది. రాజధాని ఇంఫాల్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. ఇంటర్‌నెట్ సేవలనూ నిలిపివేశారు.

### తెగించిన కుకీ మిలిటెంట్లు

మణిపూర్‌లోని జిరిబామ్ జిల్లాలో నవంబర్11వ తేదీన జరిగిన ఘటన తర్వాత వరుసగా హింసాత్మక ఘటనలు కొనసాగుతూ వచ్చాయి. ఆరోజు మధ్యాహ్నం కుకీ–జో వర్గానికి చెందిన మిలిటెంట్లు సైనిక దుస్తులు ధరించి, అధునాతన ఆయుధాలతో బోరోబెక్రా పోలీస్ స్టేషన్‌పై విచక్షణరహితంగా కాల్పులు జరిపారు. సమీపంలో ఉన్న సీఆర్‌పీఎఫ్ క్యాంపుపైనా దాడులు చేశారు. అనంతరం పక్కనే ఉన్న జకురాడోర్ కరోంగ్ గ్రామం వైపు దూసుకెళ్లి, అనేక దుకాణాలకు నిప్పుపెట్టారు. ఈ క్రమంలో భద్రతా దళాలు రంగంలోకి దిగాయి. ఇరువురి మధ్య భారీ స్థాయిలో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 11 మంది మిలిటెంట్లు హతమయ్యారు. అటు కొంతమంది సీఆర్‌పీఎఫ్ జవాన్లకు కూడా గాయాలయ్యాయి. ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే చనిపోయిన

మిలిటెంట్లు భారతీయులు కాదు. పొరుగున ఉన్న మయన్మార్‌కు చెందిన కుకీలు. అక్కడ సాయుధ శిక్షణ పొంది, భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయుధాలు పట్టుకొని పోరాడుతున్నారు. తమకు తాము గ్రామ వాలంటీర్లుగా చెప్పుకుంటారు.

అయితే సంఘర్షణలో మరణించిన 11 మందీ పౌరులేనని కుకీ సంస్థలు చెబుతున్నాయి. కానీ మణిపూర్ ఐజీపీ ముయివా వారి వాదనను ఖండించారు. మరణించిన వారి దుస్తులు, స్వాధీనం చేసుకున్న ఆయుధాలు వారు ఉగ్రవాదులని నిరూపిస్తున్నాయని స్పష్టం చేశారు

**మెయితీల కిడ్నాప్, హత్యలు**

బోరోబెక్రా ఎన్‌కౌంటర్ ఘటన తర్వాత మెయితీ తెగకు చెందిన ఆరుగురు అపహరణకు గురయ్యారు. శరణార్థి శిబిరంలో ఉన్న వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. కుకీల హింసాత్మక దాడి తర్వాత నుంచీ ఆ ప్రాంతంలో ముగ్గురు మహిళలు, ముగ్గురు చిన్నారులు కనిపించడం లేదని అధికారులకు ఫిర్యాదు అందింది. వీరిని యురేంబమ్ రాణి (60), టెలిమ్ థోయిబి దేవి (31), ఆమె కుమార్తె టెలిమ్ థాజమన్బి దేవి (8), లైశ్రామ్ హేతోంబి దేవి (35), ఆమె ఇద్దరు కుమారులు, లైశ్రామ్ చింగ్‌ఖీంగన్‌బా సింగ్ (2), లైశ్రామ్ లమ్‌గాంబా సింగ్ (10 నెలలు)గా గుర్తించారు. కుకీ ఉగ్రవాదులే ఎత్తుకుపోయారని అందరికీ అర్థమైపోయింది. ఈ అపహరణను నిరసిస్తూ మెయితీ సంస్థలు 13వ తేదీన ఇంఫాల్ లోయలో బంద్ ప్రకటించి, నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశాయి.

ఇంతలోనే కుకీ మిలిటెంట్లు తాము అపహరించిన ఈ ఆరుగురిని చిత్ర హింసలు పెట్టి హత్య చేశారు. రెండేళ్ల బాలుడి తల, చేతులు అత్యంత దారుణంగా నరికేశారు. ఆ బాలుడి అమ్మమ్మ మృతదేహం కూడా అర్ధనగ్న స్థితిలో బయట పడింది. వీరి మృతదేహాలు జిరీ, బరాక్ నదుల సంగమ ప్రదేశంలో వరుసగా రెండు రోజుల పాటు దొరికాయి.

హింసాకాండతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో కొంత కాలంగా కుకీ మిలిటెంట్లు మెయితీలను లక్ష్యంగా చేసుకొని అధునాతన ఆయుధాలతో దాడులు చేస్తూనే ఉన్నారు. బిష్ణుపూర్ జిల్లాలో పొలం పనులు చేసుకుంటున్న ఒక మహిళపై కాల్పులు జరిపి చంపారు. చురాచాంద్‌పూర్ జిల్లాలో కొండపై నుంచి కాల్పులు జరపడంపై మరో మహిళ మరణించింది.

ఇంఫాల్ ఈస్ట్ జిల్లాలో పొలాల్లో పనిచేస్తున్న రైతుపై సమీపంలోని కొండలపై నుంచి మిలిటెంట్లు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో రైతు గాయపడ్డాడు. వెంటనే అక్కడకు చేరుకున్న భద్రతా బలగాలు ఎదురుకాల్పులకు దిగారు. కొద్దిసేపు ఇరువైపులా కాల్పులు కొనసాగాయి. గాయపడిన రైతును సమీపంలోని ఆస్పత్రికి తరలించగా ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. థమ్నాపోక్పి, యైంగాంగ్‌పోక్పి, సబుంగ్‌ఖోక్, సనాసాబి ప్రాంతాలలో అదే తరహా దాడులు జరిగాయి.

అంతకు ముందు 7వ తేదీనాడు ఓ గిరిజన స్త్రీని సజీవ దహనం చేశారు. కుకీ మిలిటెంట్లు నవంబర్ 13న జిరిబామ్–ఇంఫాల్ సెక్షన్‌లో జాతీయ రహదారిపై ఉల్లిపాయలతో వెళ్తున్న ట్రక్కును తగులబెట్టారు. ఈ అరాచకాలను రోంగ్‌మీ నాగా సంఘం ఖండించింది. తమెంగ్‌లాంగ్, నోనీ జిల్లాల్లోని కుకీలకు అన్ని సరఫరాలను శాశ్వతంగా బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది.

**మణిపూర్‌కు అదనపు బలగాలు**

మణిపూర్‌లో హింసాత్మక పరిస్థితులను అదుపు చేసే దిశగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వరుసగా ఉన్నత స్థాయి సమావేశాలను నిర్వహించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి, శాంతి స్థాపనకు తీవ్రంగా యత్నిస్తున్నారు. అల్లర్లను అదుపు చేసేందుకు 50 కంపెనీల బలగాలను ఈ రాష్ట్రానికి పంపాలని నిర్ణయించారు. మంత్రిత్వశాఖ బృందం త్వరలో రాష్ట్రంలోని కీలక ప్రాంతాలను సందర్శించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

అంతకు ముందే 2000 మంది సిబ్బందితో కూడిన సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్–సీఏపీఎఫ్ బలగాలను రాష్ట్రానికి తరలించింది. 20 సీఏపీఎఫ్ కంపెనీలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ 15, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కు చెందిన 5 బలగాలు ఉన్నాయి. కాగా, గతేడాది మేలో రాష్ట్రంలో చెలరేగిన హింస తర్వాత రాష్ట్రంలో 198 కంపెనీల సీఏపీఎఫ్ బలగాలు మోహరించింది.

**బాధ్యత మరిచి విమర్శలు**

మణిపూర్‌లో జరుగుతున్న పోరాటం రాజకీయ పార్టీల మధ్య కాదు. జాతుల మధ్య జరుగుతున్న పోరాటం ఇది. దేశ భద్రత, సమగ్రతలను దృష్టిలో పెట్టుకొని అక్కడ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షం కూడా తన వంతు కృషి చేయాలి. కానీ ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ విద్వేష రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తోంది. గత ఏడాది మణిపూర్‌లో అల్లర్ల తర్వాత పర్యటించిన రాహుల్ గాంధీ అక్కడి విద్వేషాగ్ని నుంచి చలి కాచుకుందుకే ప్రయత్నించారు. బీజేపీ ప్రభుత్వాన్ని దోషిగా నిలిపి రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నించారు.

మరోవైపు బీజేపీ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్టు నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) ప్రకటించింది. ఈ మేరకు బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాకు ఎన్‌పీపీ అధ్యక్షుడు, మేఘాలయ ముఖ్యమంత్రి కన్రాడ్ సంగ్మా లేఖ రాశారు.

**చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలి: ఆర్‌ఎస్‌ఎస్**

మణిపూర్ హింసాత్మక ఘటనలపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యను పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని మణిపూర్ శాఖ సూచించింది. ఈ సంక్షోభాన్ని వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఓ ప్రకటనను విడుదల చేసింది. ఈ ఘర్షణలో అమాయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇదో మానవతా సంక్షోభంగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. మహిళలు, పిల్లలను అపహరించడం, నిర్బంధించడం, హత్య చేయడాన్ని నిరసించింది.

**అట్టుడుకుతున్న మణిపూర్**

జాతుల వైరంతో ఏడాదికిపైగా అట్టుడికి పోయిన మణిపూర్‌లో ప్రశాంత ఏర్పడినట్లే కనిపించినా కొద్ది వారాలుగా మళ్లీ ఘర్షణలు చోటు చేసుకుంటు న్నాయి. మే 2023లో మణిపూర్‌లో ప్రారంభమైన హింసాకాండ ప్రారంభమైనా మొదటి 12 నెలల కాలంలో జిరిబామ్ జిల్లా శాంతియుతంగా ఉందనే చెప్పాలి. లోక్‌సభ ఎన్నికల తర్వాత కుకీ ఉగ్రవాదులు జిల్లాలోని మెయితీ గ్రామాలను లక్ష్యంగా చేసుకున్నారు. శాంతి మూణ్నాళ్ల ముచ్చటే అయి కథ మళ్లీ మొదటికి వచ్చింది. ఈశాన్య భారతంలో ఒకవైపు మయన్మార్ జుంటాకూ, తిరుగు బాటుదారులకు మధ్య



నలిగిపోతోంది. మరోవైపు బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వం కుప్పకూలి ఇస్లామిక్ శక్తులు పైచేసి సాధించడం ఆందోళన కలిగిస్తోంది. ఈ రెండు దేశాలలో బాధ్యత లేని ప్రభుత్వాల కారణంగా భారత వ్యతిరేక తీవ్రవాదశక్తుల అడ్డాలుగా మారిపోయాయి. ఆగ్నేయాసియాతో భారతావనిని అనుసంధానించే ఈశాన్య రాష్ట్రాల్లో అశాంతి జ్వాలలను ఎగదోసేం దుకు చైనా ఇప్పటికే కుట్రలెన్నో పన్నుతోంది.




మణిపూర్‌లో హింసలో 240 మంది చనిపోయారు. 70 వేల మంది నిరాశ్రయులయ్యారు. ఎప్పుడు ఎక్కడ దాడి జరుగుతుంతో, ఎవరు చేస్తారో తెలియని స్థితి. ఈ ఘర్షణలతో అక్కడి ప్రజల ఉపాధి దెబ్బతింటోంది. వ్యవసాయం, పరిశ్రమలు ఇప్పటికే చతికిపడ్డాయి. విద్యార్థుల చదువులు దెబ్బతిన్నాయి. పర్యాటక ఆదాయం పడిపోయింది.

**పొరుగు దేశం నుంచి మిలిటెంట్లు**

మయన్మార్ నుంచి గెరిల్లా యుద్ధంలో శిక్షణ పొందిన సుమారు 900 మంది కుకీ మిలిటెంట్లు మణిపూర్‌లోకి ప్రవేశించారు. వీరంతా ఆయుధాలతో పాటు డ్రోన్ ఆధారిత బాంబులు, క్షిపణులు అమర్చటం, గెరిల్లా యుద్ధంలో శిక్షణ పొందారు. ఈ కుకీ మిలిటెంట్లు 30 మంది చొప్పున గ్రూపులుగా మణిపూర్‌లోని వివిధ ప్రాంతాలకు విస్తరించారు. కుకీ మిలిటెంట్లు మైతేయి వర్గానికి చెందిన గ్రామాలపై దాడులకు పాల్పడవచ్చని నిఘా వర్గాలు మణిపూర్ పోలీసులను ముందే హెచ్చరించాయి. దక్షిణ మణిపూర్‌లోని భారత్-మయన్మార్ సరిహద్దు జిల్లాల్లోని అన్ని సీనియర్ పోలీసు సూపరిం టెండెంట్‌లకు ఇంటెలిజెన్స్ రిపోర్టు అందినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

అక్కడ జరుగుతున్నది వర్గాలు, జాతులు, మతాల మధ్య ఘర్షణ మాత్రమే అనుకోవడానికి వీల్లేదు. ఒక పథకం ప్రకారం జరుగుతున్న వ్యవస్థీకృత నేరం అని చెప్పవచ్చు. మన దేశ భూభాగంలో, పౌరులపై ఇలా డ్రోన్ దాడులను చేస్తుంటే మొత్తం ఈ ప్రాంతాన్నే భయంలోకి నెట్టి, అస్థిరపరచే కుట్రగా కనిపిస్తోంది. యుద్ధాల్లో వాడే వ్యూహాలను పౌరులపై అమలు చేయడం, డ్రోన్లతో బాంబులు జారవిడవడం ఇదే తొలిసారి. మణిపూర్‌లోని కొన్ని జిల్లాల్లో ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిపిన మర్నాడే ఈ ఘటనలు జరగడం గమనించవచ్చు.

**దెబ్బతిన్న రాష్ట్ర ఆదాయం**

గత ఆర్థిక సంవత్సరంలో హింస కారణంగా రాష్ట్రం రూ.500 కోట్ల ఆదాయం కోల్పోయిందని ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ తెలిపారు. 'హింస చెలరేగినప్పటి నుంచి రాష్ట్రంలో 226 మంది మరణించారు. 4,569 ఇళ్లు ధ్వంసం కాగా..5,554 మంది రైతుల వ్యవసాయ భూములు దెబ్బతిన్నాయి. 39 మంది గల్లంతయ్యారు. 59,414 మంది నిర్వాసితులయ్యారు. అల్లర్లకు సంబంధించి మొత్తం 11,892 పోలీసు కేసులు నమోదయ్యాయి. మణిపూర్ అంతటా 302 సహాయ శిబిరాలు ఏర్పాటు చేశాం. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర పోలీసులను బలోపేతం చేయడానికి బడ్జెట్‌లో రూ. 2,900 కోట్లు కేటాయించాం' అని ఆ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వెల్లడించారు.

**మణిపూర్- కొన్ని వాస్తవాలు**

మణిపూర్‌లో జాతుల మధ్య వైరం కొత్తదేం కాదు. రాష్ట్రంలోని ప్రధాన తెగలైన మెయితీ, కుకి-జోల మధ్య పోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంది. ఈ ఘర్షణతో ఇరువర్గాలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. వేలాది మంది ప్రజలు నిర్వాసితులయ్యారు. వారి నివాసాలు ధ్వంసమయ్యాయి, వందలాది మంది మరణించారు. విదేశీ జోక్యం ఈ పోరాటాన్ని ప్రమాదకర మలుపు తిప్పింది. ఈ కారణంగానే మణిపూర్ నిరంతరం మీడియాలో నిలుస్తోంది.

మణిపూర్‌లో మెయితీలు జనాభా పరంగా కుకీ-జోల కన్నా ఎక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ అతి తక్కువ భూభాగం ఉన్న రాజధాని ఇంఫాల్ లోయకు పరిమితం అయ్యారు. కుకీ-జో తెగలకు పొరుగున ఉన్న ఇతర రాష్ట్రాలు, మయన్మార్‌లతో కూడా జాతి పరంగా సంబంధాలు ఉన్నాయి. ఈ కారణంగా రాష్ట్రంలోకి చొరబాట్లు పెరిగిపోయాయి. సాయుధ పోరాటాలకు దిగిన కుకీలకు మయన్మార్ లోని శక్తుల నుంచి ఆర్థిక, ఆయుధ సాయం అందుతోంది.

మెయితీలు ప్రధానంగా హిందువులు కాగా కొందరు క్రైస్తవాన్ని పాటిస్తున్నారు. మిషనరీల ప్రభావంతో కుకీ, నాగా తెగలవారు పూర్తిగా క్రైస్తవం స్వీకరించారు. దీంతో తెగల పోరాటాన్ని మత యుద్ధంగా చూపిస్తున్నారు. క్రైస్తవులైన కుకీలపై హిందువులైన మెయితీలు దాడులు చేస్తున్నారనే దుష్ప్రచారం మొదలైంది. వాస్తవానికి ఇరు మతాల ప్రార్థనాలయాలపై దాడులు జరిగాయి. కానీ కేవలం చర్చిల మీదే దాడులు జరుగుతున్నాయి అంటూ దేశ, విదేశాల్లో ఆందోళనలు, నిరసనలు చేపట్టారు.

ప్రపంచంలో ఎక్కడ పోరాటాలు జరిగినా ప్రత్యర్థులు మహిళల మానప్రాణాలపై దాడులు చేయడం సహజం. మణిపూర్ ఇందుకు అతీతం కాదు. కుకీలు అయితే, మెయితీలు అయినా ఈ విషయంలో తప్పు చేశారు. మహిళలపై అత్యాచారాలు, వారిని నగ్నంగా నడిపించి అవమానించడంలాంటి ఘటనలు కళంకం తెచ్చిపెట్టాయి. కానీ ఈ పనులు మెయితీలు మాత్రమే చేశారు అనే ప్రచారం ఎక్కువగా జరిగిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా ఆధిపత్యమతంగా ఉన్నందున క్రైస్తవ మిషనరీలు, విదేశీశక్తులు మణిపూర్ ప్రతిష్టను దెబ్బ తీయడంలో విజయం సాధించారు.

**సమగ్రతను కాపాడుకోవాలి**

మణిపూర్ సమస్య కేవలం ఈశాన్యరాష్ట్రానికే పరిమితమైన చిన్న ఘటనలుగా వదిలేస్తే.. దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఇది విస్తరించే ప్రమాదం ఉంది. పంజాబ్‌లో ఖలిస్తానీలు, తమిళనాడులో ద్రవిడ వేర్పాటువాదులు, జమ్మూ కశ్మీర్‌లో సీమాంతర ఉగ్రవాదం, కొన్ని రాష్ట్రాల్లో వామపక్ష తీవ్రవాదం కారణంగా మన దేశం ఇప్పటికే సమస్యలను ఎదుర్కొంటోంది. పాకిస్తాన్, చైనా దేశాలు మన దేశంలో నిరంతరం అశాంతిని ఎగదోసే కుట్రలు కొనసాగిస్తున్నాయి. ఆగ్నేయాసియాతో మన దేశాన్ని అనుసంధానించే ఈశాన్య రాష్ట్రాల్లో అశాంతి జ్వాలలను ఎగదోసేందుకు చైనా కుట్రలెన్నో పన్నుతోంది. మణిపూర్ సంక్షోభ నివారణకు రాజకీయాలకు అతీతంగా ఆలోచించాల్సిన సమయం వచ్చింది.

**– క్రాంతి**, సీనియర్ జర్నలిస్ట్




# ఇలాంటి సర్వేలతో దేశ

**భారతదేశం ఓ ధర్మసత్రమన్న భావన ఇంకా పాశ్చాత్య దేశాలకు పోలేదనే అనిపిస్తుంది. ప్రజాస్వామ్యాలను భగ్నం చేయడం ఎలా అన్న సూత్రాన్ని అమలు చేసే విధంబెట్టిదనిన అనుకుంటూ భారతీయ వ్యవస్థ మీద ప్రయోగాలు చేయడం వాటికి అలవాటుగా మారింది. తాము కనుగొన్న కొత్త ఔషధాలను ప్రయోగించడానికి ఇక్కడి మనుషులను యథేచ్ఛగా వాడుకోవచ్చునని కొన్ని పాశ్చాత్య దేశాల నమ్మకం. మైనారిటీలను మెజారిటీ వర్గం మీదకు ఎలా రెచ్చగొట్టాలో మార్గాలు కనుగొనడానికి కూడా అవి నిరంతరం ప్రయత్నం చేస్తున్నాయి. కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ అధికారంలో ఉండగా, సార్వభౌమాధికారం కలిగిన ఈ దేశంలో 2010లో జరిగిన ఒక సర్వే ఇందుకు ఒక రహస్య ఉదాహరణ.**

ముస్లింలే కేంద్రంగా జరిగిన ఈ సర్వే ఉద్దేశం భారతదేశం గురించి వారి అంతరంగంలో నిగూఢంగా ఉన్న ప్రతికూలతను వెలికి తీయడమే. వేరొక మత విశ్వాసం ఉన్న వ్యక్తికి ఓటు వేయవలసి వస్తే మీ మనోభావాలు ఏమిటి? గతంతో పోలిస్తే ఇవాళ్టి ముస్లింలలో ఇస్లాం ఏ మేరకు ప్రభావాన్ని ప్రసరింప చేస్తున్నది? మీరు మొదట భారత పౌరుడిగా భావిస్తారా? ముస్లింగా చెప్పుకుంటారా? ఈ ప్రశ్నలతో సర్వే జరిపితే దానిని ఏమనాలి? అందుకే కేరళ హైకోర్టు గడ్డి పెట్టింది. ఇలాంటి సర్వేలు జరిగితే ఈ దేశ భద్రత మాటేమిటి? ఇలాంటి సర్వేలతో ఈ దేశంలో మత సామరస్యం భవితవ్యం ఏమవుతుంది? అని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి సర్వేలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరి చేస్తూ తీర్పును వెలువరించింది. ఎంపిక చేసుకున్న 54 ప్రదేశాలలో ఈ సర్వే జరిగింది. అందులో కేరళలోని తిరువనంత పురం ఒకటి. ఈ సర్వే సమయంలో అక్కడ ఘర్షణలు జరిగాయి. పోలీసులు రంగ ప్రవేశం చేయవలసి వచ్చింది.

అమెరికాకి చెందిన ప్రిన్సటన్ సర్వే రిసెర్చ్ అసోసియేట్స్ (పీఎస్ఆర్ఏ) తరఫున టేలర్ నెల్సన్ సోఫ్రెస్ (టీఎన్ఎస్, హైదరాబాద్) అనే సంస్థ ఆ సర్వే జరిపింది. అంటే పీఎస్ఆర్ఏ ఇచ్చిన కిరాయి పుచ్చుకుని టీఎన్ఎస్ ఆ సర్వే చేసింది. పద్నాలుగు ఏళ్ల నాటి ఈ రగడకు సంబంధించి టీఎన్ఎస్ మీద చట్టప్రకారం చర్యలు మొదలయ్యాయి. దీనితో తన మీద క్రిమినల్ చర్యలు తీసుకోకుండా ఆదేశించాలని కోరుతూ ఈ సంస్థ కోర్టును ఆశ్రయించింది. టీఎన్ఎస్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేయడమే కాకుండా, ఇలాంటి సర్వేలు ఇకపై జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని నవంబర్ 4న కేరళ హైకోర్టు ఏక సభ్య ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించింది. ఇక్కడ రెండు అంశాలు ఉన్నాయి. ఒకటి టీఎన్ఎస్ తాను చేసిన సర్వేకు కేంద్రం అనుమతి తీసుకోలేదు. ఇది నేరం. ఒక విదేశీ సంస్థ సర్వే జరిపితే అందుకు కేంద్ర అనుమతి అనివార్యం.

రెండు తిరువనంతపురంలో ముస్లింలను అడిగిన ప్రశ్నలు మత సామరస్యాన్ని చెడగొట్టేవిగా ఉన్నాయి. ఇంత ఘాతుకానికి ఒడిగట్టినా తమ మీద క్రిమినల్ చర్యలు తీసుకోకుండా ఆదేశించాలంటూ టీఎన్ఎస్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పీవీ కున్హికృష్ణన్ ధర్మాసనం కొట్టివేయడమే కాకుండా, ఈ కేంద్రానికి ప్రత్యేకమైన ఆదేశాలు జారీ చేస్తూ విశిష్టమైన తీర్పును ప్రకటించింది. సీఎస్ఆర్ఏ వాషింగ్టన్ డిసి కేంద్రంగా పనిచేస్తున్నది. అది మాత్రం తన సర్వేను సమర్థించు కున్నది. సర్వే ఎవరి కోసం చేశామో, వారి వాస్తవ పరిస్థితిని వారికే అర్థమయ్యేటట్టు చెప్పడమే తమ ఉద్దేశమని తింగరి వాదన ముందుకు తెచ్చింది.

ఈ సర్వేలో అడిగిన ప్రశ్నల గురించి సాక్షాత్తు న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేయడం విశేషం. ఈ ప్రశ్నలు సందేహాలు రేకెత్తించేవిగా ఉండడమే కాదు, దేశ సమగ్రతను ధ్వంసం చేయడానికి ఉద్దేశించినట్టుగా ఉన్నాయి అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అసలు ప్రభుత్వ అనుమతి లేకుండా ఇలాంటి సర్వే ఎలా జరిగిందని కూడా న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసి, నిలదీసింది. ఈ సర్వేలో ప్రశ్నలు సందేహాస్పదంగా ఉండడమే కాదు, అసలు ఆ ప్రశ్నల ఉద్దేశమేమిటో కూడా అంతుపట్టకుండా ఉంది అని అన్నారు. ఈ వివాదంలో తాము తయారు చేసిన నివేదికను కేంద్ర హోం, విదేశ వ్యవహారాల శాఖలకు అందించాలని కూడా కోర్టు రాష్ట్ర పోలీసు దర్యాప్తు అధికారికి ఆదేశాలు ఇచ్చింది. ఈ సర్వే జరపడానికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని కోర్టు వెల్లడించింది. సర్వే పూర్వాపరాల మీద దర్యాప్తు చేయడానికి రాష్ట్ర పోలీసు విభాగం సామర్థ్యం సరిపోదని కూడా తేల్చి చెప్పింది. ఇలాంటి సర్వేలు జరగడానికి అవకాశం ఇస్తే దేశ భద్రతకే కాకుండా, ఇంకా ప్రధానంగా మత సామరస్యానికి ముప్పు వాటిల్లుతుందని కోర్టు హెచ్చరించింది. అందుకే కేంద్రం ఈ అంశం మీద దృష్టి కేంద్రీకరించాలని ఆదేశిస్తున్నట్టు తెలియచేసింది.

ఈ సర్వే చేయడానికి ఎన్నుకున్న ప్రదేశాలు కూడా హిందూ ముస్లిం ఉద్రిక్తతలకు ఎక్కువ అవకాశం ఉన్నవే. అల్లర్లకు అవకాశం ఉన్నవే. ఆ ప్రశ్నలన్నీ



జస్టిస్ పీవీ కున్హికృష్ణన్

# విచ్ఛిన్నమే!

ముస్లింల ఉద్వేగపూరిత మనోభావాలను గాయపరిచే విధంగా ఉన్నాయని కోర్టు అభిప్రాయపడింది. తిరువనంతపురంలో ఈ సర్వే జరిపారు. అయితే అమెరికా సంస్థ తన సర్వేను సమర్థించుకుంది. అంతర్జాతీయ స్థాయిలో చేపట్టిన 'గ్రీన్ వేవ్ 12' పేరుతో 20 దేశాలలో ఈ సర్వే చేపట్టారు. సంప్రదాయాలు, విలువలు, వైఖరుల గురించి (ఒక వర్గానివి) తెలుసుకోవడమే దీని ధ్యేయమని అమెరికా సంస్థ వివరించింది. కేరళ పోలీసులు మాత్రం ఒక వర్గం (ముస్లింలు) మనోభావాలు దెబ్బతీయడానికే ఈ సర్వే జరిగిందని ఇప్పుడు కూడా అంటున్నారు. తిరువనంతపురంలోని అట్టక్కులంగర్ అనే ప్రాంతంలో ఫ్రెండ్స్ నగర్‌లో నలుగురు ఉద్యోగులు ఈ సర్వే జరిపారు. తిరువనంతపురంతో పాటు దేశంలోని 54 ప్రదేశాలలో ఈ సర్వే చేశారు. టీఎన్ఎస్ ఇండియా సర్వే సంస్థను మన దేశం కోసం, ఇంకా ఇండోనేషియా, మలేసియా, థాయ్‌లాండ్‌లలో ఇలాంటి సర్వేల కోసం అమెరికా సంస్థే విభాగాలను ఏర్పాటు చేసింది. భారత్‌లోని ముస్లింలను అడిగినట్టే ఆ దేశాలలో కూడా అవే ప్రశ్నలు అడిగామని ఆ సంస్థ చెబుతున్నది. కానీ మా భారత్ సర్వసత్తాక ప్రజాస్వామిక దేశం. ఇక్కడ రాజ్యాంగం మేరకు అన్ని మతాలకు– హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు ఇతర మతాల వారికి సమాన స్థానం ఉంటుంది. స్త్రీపురుషులకు ఒకే చట్టం అమలు జరుగుతుంది. ఇలాంటి చోట సర్వేలో ఆ ప్రశ్నలు ఎందుకు వేశారన్నదే కేరళ హైకోర్టు ప్రశ్న.

**సర్వేలో అడిగిన ప్రశ్నలు ఎలాంటివి? ఇది చాలా ముఖ్యం.**


- నేటి ప్రపంచానికి ఇస్లాం చేస్తున్న ముఖ్య సేవ ఏమిటని మీరు చెబుతారు?
- భారతదేశంలోని ముస్లింలకు ఎదురవుతున్న రెండో పెద్ద బెడద ఏమిటి?
- ఈ ప్రశ్నకు సమాధానం ఇచ్చినవారు మహిళ అయితే ఆమె హిజాబ్ (తలకు కట్టుకునే గుడ్డ), నికాబ్ (మొత్తం శరీరాన్ని కప్పే వస్త్రం) ధరించి ఉన్నారా?
- భారత రాజకీయ వ్యవస్థలో ఇస్లాం నిర్వహిస్తున్న పాత్ర ఎంత మేరకు ఉందని మీ అభిప్రాయం? చాలా పెద్ద పాత్ర, నిజంగానే పెద్ద పాత్ర, చిన్న పాత్ర, చాలా చిన్న పాత్ర?
- షియా ఇస్లాంకీ, సున్నీ ఇస్లాంకీ మధ్య విభేదాలను మీరు ఎలా అర్థం చేసుకుంటున్నారు?
- షరియా అంటే మీ దృష్టిలో ఏమిటి?
- నేను మొదట భారత పౌరుడిని అనుకుంటారా? లేదంటే నేను మొదట ఒక జాతికి చెందిన లేదా ఇస్లాంకు చెందిన వాడినని అనుకుంటారా?
- కొంతమంది ఒసామా బిన్ లాడెన్ వంటి వ్యక్తిని సమర్థిస్తారు. బిన్ లాడెన్ వంటి వ్యక్తిని గురించి మీరు ఏమనుకుంటున్నారు?
- మీరు బయటకు వెళ్లేటప్పుడు బుర్ఖా లేదా హిజాబ్ ధరిస్తారా?
- మొత్తంగా చూస్తే భారత్ వ్యవహారాలు సరైన దిశగా నడుస్తున్నాయని అనుకుంటున్నారా? లేదా తప్పుడు మార్గంలో నడుస్తున్నవని భావిస్తున్నారా?
- మీరు ఎవరు? అన్న ప్రశ్న వేసి, ఈ అంశాలలో మీ ప్రాధాన్యం దేనికని ఎవరైనా అడిగితే ఏం చెబుతారు? కులం, ప్రాంతం, జాతీయత, మతం.
- భారత్‌లో అనేక రాజకీయ పార్టీలు ఉన్నాయి. అందులో ఏది ముస్లింలకు సరైన పక్షమని మీరు అనుకుంటున్నారు?
- పాశ్చాత్య ఆర్థిక, వాణిజ్య పద్ధతులు ఇస్లాంకు అనుకూలమని కొందరు, ప్రతికూలమని కొందరు అంటారు. ఇందులో మీరు దేనితో ఏకీభవిస్తారు?
- కొన్నేళ్ల క్రితం నాటి పరిస్థితులతో పోల్చి చూసినప్పుడు ఇవాళ్టి భారతీయ ముస్లింలలో ఇస్లాం ఘనమైన పాత్ర నిర్వహిస్తున్నదా? లేక పరిమితమైన పాత్రను పోషిస్తున్నదా?
- భారతీయ ముస్లింలలో ఇస్లాం ఘనమైన పాత్రను నిర్వహించగలగడానికి అతి ముఖ్యమైన ఒక కారణం ఏది? ప్రస్తుత ప్రభుత్వ విధానాలతో వారికి ఉన్న అసంతృప్తి కారణమా? మన సమాజంలోని అనైతికత కారణమా? ఇతర ముస్లిం దేశాల ప్రేరణ కారణమా?
- పాలన విషయంలో ఈ ముస్లిం దేశం నమూనాగా నిలుస్తుందని ఏ దేశం గురించి మీరు చెప్పగలరు?
- మరొక విషయానికి వద్దాం. ఇవాళ ఇస్లాంకు ఎన్ని రకాల ముప్పులు పొంచి ఉన్నాయి?
- ఈ కింద ఇచ్చిన ప్రకటన ప్రకారం ఇవాళ్టి సమాజంలో ముస్లిం మత నాయకులు రాజకీయాలలో ఎలాంటి పాత్ర నిర్వహించాలని మీరు అభిప్రాయపడుతున్నారు?
- భారత అధికారిక చట్టాలలో షరియాను ఏ మేరకు పునాదిగా ఉంచాలని మీరు విశ్వసిస్తున్నారు?
- ఒక ముఖ్య రాజ్యాంగ పదవిలోకి వెళుతున్న ఒక వ్యక్తి ఇతర మత విశ్వాసం కలిగిన వాడైతే అతడిని ఎన్నుకోవడం మీకు ఎలా అనిపిస్తుంది. కొంత సౌకర్యం. కొంత అసౌకర్యం. చాలా అసౌకర్యం.

దాదాపు 21 ప్రశ్నలు ఆ ప్రశ్నపత్రంలో ఉన్నాయి. ఇందులో ఏ ఒక్క ప్రశ్నను గమనించినా ఒక మనిషి అంతరంగాన్ని వెలికి తీయడానికి, అతడిలోని అసమ్మతిని వ్యక్తం చేయడానికి ఉద్దేశించినవిగా కనిపిస్తాయి. అందుకే వీటిని అటు పోలీసు యంత్రాంగం, ఇటు న్యాయ వ్యవస్థ కూడా సందేహాస్పద ప్రశ్నలుగా భావించాయి.

అక్టోబర్ 2, 2010లో తిరువనంతపురం ప్రాంతంలో ఈ సర్వే నిర్వహించినప్పుడే ఉద్రిక్తతలు తలెత్తాయి. అప్పుడే టీఎన్ఎస్‌కు వ్యతిరేకంగా ఫోర్ట్ పరిధి పోలీసులు కేసు నమోదు చేశారు. 6000 మందితో సర్వే నిర్వహించారు. ప్రశ్నలను ఒక చిరుపొత్తం రూపంలో ఇచ్చి పూర్తి చేయించారు.ఆ అక్టోబర్ 2న గొడవలు జరుగుతున్న సంగతి తెలిసి ఫోర్ట్ ప్రాంత పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆ ప్రశ్నలు ఉన్న పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు.

ఒసామా బిన్ లాడెన్ గురించి ఇప్పుడు భారతీయ ముస్లింల అంతరంగం ఏమిటో తెలుసుకోవలసిన అవసరం అమెరికాకు ఏమొచ్చింది? ఈ దేశంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ముస్లింలకు సౌకర్యంగా ఉంటుంది? ఒక సార్వభౌమాధికారం కలిగిన ప్రజాస్వామిక దేశంలో అమలయ్యే చట్టాలలో ముస్లింల పర్సనల్ ఏ మేరకు జోక్యం కల్పించుకోవాలి? వంటి ప్రశ్నలు అనుమానాన్ని రేకెత్తించకుండా ఎలా ఉంటాయి? ఇంత వివాదాస్పద సర్వే ప్రభుత్వాలకు తెలియకుండా ఎందుకు చేసినట్టు? అమెరికా తన బుద్ధిని ఇప్పటికీ మార్చుకోవడం లేదు. ఇక్కడి ముస్లింలను ఏ తీరుకు తీసుకువెళ్లాలని ఆ దేశం అనుకుంటున్నది అన్నది ఎప్పటికీ ప్రశ్నే.

– జాగృతి డెస్క్



# ఖర్గే తల్లిని, సోదరిని రజాకా

చరిత్ర ఘటనల నుంచి మనుషులు తప్పించుకో లేరు. చరిత్రను మరచిపోయినట్టు నటించగలరు, అంతే. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రస్తుతం చేస్తున్నది అదేనని అంటున్నారు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్. హిందువులు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చినా అందులో మతోన్మాదం చూస్తోంది కాంగ్రెస్. రామ అంటే ముందే బూతు పదం అయిపోయింది ఆ పార్టీకి. హిందువుల సంక్షేమం గురించి రక్షణ గురించి ఒక్క మాట మాట్లాడినా వీరంగం వేసే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాపం, ఒక ఘోర విషాదం మిగిల్చిన బాధని గొంతులో అణచిపెట్టుకున్నారని యోగి విమర్శించారు. రజాకారుల దాడిలో సాక్షాత్తు ఖర్గే కన్నతల్లి, సోదరి కూడా మరణించారని, ఆ విషయాన్ని ముస్లిం ఓట్ల కోసం ఆయన సౌకర్యంగా విస్మరిస్తున్నారని యోగి అన్నారు. మహారాష్ట్రలోని అమరావతిలో ఎన్నికల ప్రచార సభలో ఆయన ఈ విషయాలు వెల్లడించారు.

ముస్లింల బుజ్జగింపుకోసం నిజాం పాలనలో తాము ఎలాంటి నరకం అనుభవించారో ఖర్గే దాచి పెడుతున్నారని యోగి చెప్పారు. ఖర్గే స్వగ్రామం వారావట్టిని కూడా రజాకారులు దహనం చేశారని కూడా గుర్తు చేశారు. ఇటీవల మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కూడా రజాకార్ దౌష్ట్యాల గురించి గుర్తు చేశారు. రజాకారుల చరిత్ర మొత్తం హింసోన్మాదం, మతోన్మాద పూరితమే. 1946 ప్రాంతంలో నిజాం రాజ్యంలో హిందువులను ఊచకోత కోశారు. ఈ అంశం మీద ఇటీవల రజాకార్ అన్న చిత్రం కూడా వచ్చింది. బతుకమ్మలను నగ్నంగా ఆడించిన ఘనత ఆ క్రూరులది. వందలాది మంది హిందువులను చంపారు. అలాగే 1971లో బాంగ్లా విమోచనోద్యమంలో పాకిస్తాన్ తరఫున తూర్పు బెంగాల్‌లో రక్తపాతం సృష్టించిన ముష్కరుల పేరు కూడా రజాకారులే. నిజాం కాలంలో ఇది మజ్లిస్ ఇతెహాదుల్ ముస్లిమీన్ ప్రైవేటు సైన్యమే





# రామాయణ గాథ గగనయానం

రాముడి గాథను దక్షిణ ఆసియా వాసుల హృదయాలలో ఎప్పటికీ ఉంటుంది. శ్రీలంక ఎయిర్‌లైన్స్ ఇటీవల ఒక వ్యాపార ప్రకటన విడుదల చేసింది. దాని పేరు 'రామాయణ ట్రైల్'. శ్రీలంకలో రామాయణ ఘట్టాలకు వేదికలైన ప్రదేశాలన్నింటిని అందులో ప్రస్తావించారు. ప్రభుత్వం ఇచ్చే సెలవు దినాలను రామాయణ పుణ్య స్థలాలను దర్శించేందుకు వినియోగించుకోండి, సంప్రదాయ అనుభూతికి చేరువకండి అంటూ ఆ వ్యాపార ప్రకటన కోరింది. ఐదు నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియో వ్యాపార ప్రకటన రూపొందించిన తీరు కూడా రమణీయంగా ఉంది. తన మనుమడికి అమ్మమ్మగారు బొమ్మల ద్వారా కథను వివరిస్తూ కనిపిస్తారు. సీతను రావణాసురుడు ఎక్కడ దాచి పెట్టాడు అని బాలుడు అడుగుతాడు. ఆ ప్రశ్నతో మొత్తం లంకలోని రామాయణ స్థలాల గురించి వివరిస్తారు అమ్మమ్మ. ఆ లంకే ఇవాళ్టి శ్రీలంక అని చెబుతారామె. సీతమ్మ ఆలయం, రామసేతు కూడా ఇందులో చేర్చారు. రామసేతు ఇంకా ఉందా అమ్మమ్మ! అని ఆ పిల్లవాడు ప్రశ్నిస్తాడు. అందుకు అమ్మమ్మ, ఉంది, భారత్, శ్రీలంక తీరాల మధ్య రామేశ్వరం దగ్గర ఉంది కదా! అని జవాబిస్తారు అమ్మమ్మ. ఇది వ్యాపార ప్రకటనే అయినా దీనిని రూపొందించిన తీరును అందరూ అభినందిస్తున్నారు. మనుమడికి అమ్మమ్మ వివరిస్తున్నట్టు స్థానీయతను ఉట్టిపడే విధంగా రూపొందించడమే ఇందుకు కారణం.

# రాహుల్ బ్రిటిష్ ఆరోపణ మీద ద

రాహుల్ గాంధీ బ్రిటిష్ పౌరసత్వం మీద వచ్చిన ఆరోపణల మీద దర్యాప్తు మొదలయిందని ఢిల్లీ హైకోర్టుకు నవంబర్ 5న తెలియచేశారు. కర్ణాటకకు చెందిన బీజేపీ సభ్యుడు విఘ్నేశ్ శిశిర్ ఈ విషయం కోర్టుకు తెలియచేశారు. అలహాబాద్ హైకోర్టులో ఈ వివాదం మీద దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం




## రులు బలిగొనలేదా?

రజాకారులు. రజాకార్ అంటే స్వచ్ఛంద సేవకుడు అని అర్థం. కానీ వాస్తవంలో వీళ్లు స్వచ్ఛంద సేవకులు కాదు. రక్తపిపాసులు. ఖాశిం రజ్వీ నాయకత్వంలో రజాకారులు పనిచేశారు.

మల్లికార్జున ఖర్గే స్వస్థలం పాత నిజాం రాజ్యంలో ఉంది. కొంత కర్ణాటక, కొంత మహా రాష్ట్రలో కూడా నిజాం రాజ్యం విస్తరించింది. బీదర్ జిల్లా, భాల్కీ తాలూకా, వారావట్టి గ్రామంలో 1942లో ఖర్గే పుట్టారు. ఆయన ఆరేళ్ల ప్రాయంలో గ్రామం మీద రజాకారులు దాడి చేశారు. ఖర్గే పూర్వికుల ఇంటిని రజాకారులే దహనం చేసిన సంగతిని ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే ఒక సందర్భంలో వెల్లడించారు కూడా. తన తాతగారు, అంటే ఖర్గే తండ్రి పొలంలో పనిచేస్తుండగా పొరుగు వ్యక్తి ఒకరు వచ్చి ఇంటిని రజాకారులు దహనం చేసిన సంగతి తెలియచేశాడు. ఖర్గే తండ్రి హుటా హుటిన ఇంటికి వెళ్లారు. కానీ ఖర్గేని మాత్రమే రక్షించేం దుకు వీలైంది. తన కూతురు, భార్య చనిపోయారు. ఈ విషయాలు ఖర్గే కుమారుడు చెప్పినవే.

## పౌరసత్వం ర్యాప్తు జరుగుతోంది


శిశిర్


మేరకు ఈ దర్యాప్తు చేపట్టారు. ఈ కోర్టులో విఘ్నేశ్ శిశిర్ ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేశారు. ఇదే వివాదం మీద మరొక ప్రముఖుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం స్వామి కూడా ఢిల్లీ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. తన ఫిర్యాదు పరిస్థితి ఏమిటో వివరించవలసిందిగా కేంద్రాన్ని ఆదేశించాలని డాక్టర్ స్వామి ఇటీవల కోరారు. భారత పౌరునిగా చెలామణి అవుతున్న రాహుల్ బ్రిటిష్ పౌరసత్వం కలిగి ఉంటే కనుక రాజ్యాంగంలోని 9వ ఆర్టికల్‌ను ధిక్కరించినట్టేనని స్వామి ఆరోపణ. రాహుల్ బ్రిటిష్ పౌరసత్వం వివాదంలో తాను సీబీఐకి నిగూఢమైన సమాచారం అందించానని, తన వ్యాజ్యం



అలహాబాద్ కోర్టులో త్వరితగతిన విచారణ జరుగుతున్నదని విఘ్నేశ్ తెలియచేశారు. ఇంకొన్ని పత్రాలు కూడా అందించడానికి అనుమతి ఇవ్వాలని కూడా ఆయన ఢిల్లీ హైకోర్టును కోరారు.

తమిళనాడులో తమాషా జరుగుతోంది. ఈ ఏడాది అక్టోబర్ 31న అక్కడ ఒక సినిమా విడుదలయింది. పేరు అమరన్. 2014లో కశ్మీర్‌లోని సోఫియాన్‌లో ఉగ్రవాదులతో పోరాడుతూ మరణించిన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితం ఆధారంగా నిర్మించిన చిత్రం. రాజకుమార్ పెరియసామి దీని దర్శకుడు. శివకార్తికేయన్, సాయిపల్లవి ప్రధాన పాత్రలలో కనిపించారు.

అయితే ఇందులో కశ్మీరీలను, అంటే కశ్మీరీ ముస్లింలను క్రూరులన్నట్టు చిత్రించారంటూ, దీనిని నిషేధించాలంటూ ప్రదర్శనలు మొదలయ్యాయి. ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తున్నది ఎవరో కాదు, ఎస్‌డీపీఐ. పీఎఫ్ఐ రాజకీయ విభాగం. కేరళలో అనేక హత్యలలో ప్రమేయం ఉన్న సంస్థలు. కేవలం ముస్లిం మతోన్మాదాన్ని ప్రోత్సహించే శిబిరాలు. ఒకచోట కాదు, చాలాచోట్ల నిరసన కార్యక్రమం చేపట్టింది. అందులో ఈ సినిమాను నిర్మించిన రాజ్‌కమల్ సంస్థ కార్యాలయం ముందు కూడా ఒకటి నిర్వహించింది. ఇస్లామోఫోబియాను ప్రచారం చేస్తున్నదని ఎస్‌డీపీఐ ఆరోపణ. ముస్లిం మనోభావాలను దెబ్బతీసిందని దాని విశ్లేషణ. దీనితో చెన్నై నగరంలో ఈ సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్ల దగ్గర పోలీసు బందోబస్తు పెంచవలసి వచ్చింది. మే 17మూవ్‌మెంట్స్ అనే సంస్థ ఉందట. దాని నాయకుడు తిరుమురుగన్ గాంధీ అట. ఆయన కూడా ఈ సినిమా ముస్లింలను తప్పుగా చిత్రించిందని బాధపడిపోయారు. కశ్మీరీలని అనగా




# ఇది కదా అసలు వినోదం!

కశ్మీరీ ముస్లింలనీ, హక్కుల కోసం వారు చేస్తున్న పోరాటాన్ని ప్రతికూల ధోరణితో చిత్రించారని ఈ గాంధీ బాధపడిపోతున్నాడు. ఈయన శాసనసభ్యుడు కూడా.

సీన్ కట్ చేస్తే– ఈ సినిమా బాగుంది, ఇది ఇవాళ్టి యువత చూడాలి అంటూ చాలా మంది మాట్లాడుతున్నారు. అందులో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఒకరు. స్టాలిన్ ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ మొదటే ఈ సినిమా చూశారు. అంటే స్క్రీనింగ్ కార్యక్రమానికి వెళ్లారు. ఇలాంటి వాస్తవ కథనాలతో చిత్రాలు తీస్తే అవి యువతకు ఎంతో ఉపయోగపడతాయని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రశంసించారు. అంతేకాకుండా, ఇలాంటి గాథలు పుస్తక రూపంలో కూడా రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తమిళు లు సైన్యంలో చేస్తున్న త్యాగాలను దర్శకుడు రాజ్‌కుమార్ ఉద్వేగభరితంగా తెరకెక్కించారని కూడా వ్యాఖ్యానించారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ కూడా ఇది మంచి సినిమా అని కితాబిచ్చారు. మరొక ప్రముఖ నటుడు సూర్యా కూడా మెచ్చుకున్నారు. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ప్రశంసలు కురిపించారు. తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరుంథాయి కూడా మెచ్చుకున్నవారే. ఇంతకీ ఈ సినిమా తీసినది ఎవరో కాదు, బీజేపీ అన్నా, భారతీయత అన్నా మండిపడే కమల్ హాసన్, ఆయన నిర్మాణ సంస్థ రాజ్‌కమల్.

ఇది కదా వైచిత్రి. సనాతన ధర్మాన్ని తూర్పార పట్టేవాళ్లంతా ఈ సినిమా అద్భుతమని చెప్పడం పెద్ద వింత. కమల్‌హాసన్ ఇలాంటి ఒక చిత్రం నిర్మించడం, స్టాలిన్ ద్వయం మెచ్చుకోవడం; దానిని ముస్లిం మతోన్మాదులు వ్యతిరేకించడం మంచి సస్పెన్స్ థ్రిల్లర్. కాబట్టి ఇప్పటికైనా ఈ ఉదారవాద బిరుదాంకితులు ముస్లిం మతోన్మాదం గురించి అర్థం చేసుకుంటే మంచిది. వీరిద్దరూ కలసి హిందూదేశాన్ని మార్చడం కాదు, ముస్లింలే ఉదారవాదులని మార్చేయాలని చూస్తున్నారు.

ముస్లిం మతోన్మాదుల గోల ఎలా ఉన్నా అమరన్ ఘన విజయం సాధించింది. సినిమాకు రూ. 250 కోట్లు వసూలు చేసిన చిత్రాల కథానాయకుల జాబితాలో ఆ చిత్ర కథానాయకుడు కార్తికేయన్ చేరిపోయారు. ఇంతవరకు ఈ గౌరవం ముగ్గురు– రజనీకాంత్, కమల్ హాసన్, విజయ్‌లకు మాత్రమే దక్కింది. కార్తికేయన్ నాలుగోవారు. ★

## కథ

అపార్ట్‌మెంట్ బయట ఆగి ఉన్న రెండు కార్లలోని అల్లుళ్లు ఇద్దరూ అసహనంగా కదులుతున్నారు. ఖరీదైన శార్వణీలు, గాగ్రా ఛోళీలు, గౌనులు వేసుకున్న వారి పిల్లలు కారుల్లోంచి దిగుతూ, ఎక్కుతూ అల్లరి చేస్తున్నారు. అప్పటికి అరగంటపైన అయ్యింది. ఇక లాభం లేదని చిన్న కూతురు మొబైల్ హ్యాండ్ బ్యాగ్‌లో వేసుకుని కారులోంచి దిగింది.

అపార్ట్‌మెంట్ లిఫ్ట్ దగ్గరే అక్క ఎదురుపడింది.

"ఏమైందే, అమ్మను తీసుకురావడానికి ఇంతసేపా?" అంది విసుగ్గా.

ఆమె అంతకన్నా విసుగ్గా "అవును మరి, ఇద్దరం ఆడుకుంటున్నామే" అని గట్టిగా అరిచి, "ఓ పని చేయండి. మీరంతా వెళ్లండి కార్లలో. నేను అమ్మ ఆటోలో వచ్చేస్తాం కాసేపట్లో" అంది.

"అసలు ఏమైందే?" అన్న చెల్లెలికి "తర్వాత చెబుతాలేవే, వెళ్లమన్నాగా.." అంటూ గబగబా బయటకు వెళ్లిపోయింది.

అక్క హడావిడి ఏమిటో అర్థంగాక, కంగారుగా తల్లి సంగతి స్వయంగా చూద్దామని ఆమె పైకి వెళ్లింది.

నెమలి పింఛం రంగు ధర్మవరం పట్టుచీర కట్టుకున్న తల్లి, భుజాల చుట్టూ కొంగు తిప్పుకుని, ముందువైపు కుడి చేత్తో గట్టిగా కొంగును పట్టుకుని కంగారుగా అటూఇటూ తిరుగుతోంది.

"ఏమైందమ్మా? ఏంటి హడావిడి?" అని అడిగింది.

"హడావిడీ లేదు...పాడూ లేదు. మీరు వెళ్లండి. నేను మీ అక్క వెనకాలే వచ్చేస్తాం" అందావిడ.

"వెనకాల వస్తాం అంటారేగాని, ఏంటో చెప్పరేం?" అని విసుక్కుని, "ఏంటి జాకెట్టు దొరకలేదా?" అంది మెల్లగా.

"ఉంది, దొరికింది. అది కాదులే. మిమ్మల్ని వెళ్లమన్నాగా.." అని ఆవిడ కూడా చిన్నగా విసుక్కుంది.

"ఏమిటో చెప్పకుండా, ఊరికే వెళ్లు.. వెళ్లు.. అంటావేం" అని అరుస్తూ కోపంగా కిందకు దిగింది చిన్న కూతురు.

గేటు దగ్గరే అక్క ఎదురుపడింది. 'ఏమిటే?'

**భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీలో విశిష్ట బహుమతి పొందిన రచన**



# లోగుట్టు

దేశరాజు

అన్నట్టు చూసిన చెల్లెలికి కవరులోంచి డబ్బా కొద్దిగా బయటకుతీసి చూపించింది.

చెల్లెలు షాకయ్యింది. "దీని కోసమా, ఈ గొడవంతా? ఇప్పుడు ఇది వేసుకుంటేగానీ జాకెట్టు వేసుకోదటనా?" అని "అయినా, అంత గబుక్కున ఎక్కడ దొరికిందే నీకు" అని అడిగింది విసుగును మర్చిపోయి నవ్వుతూ.

"అదే.. రోడ్డు మీద నైటీలు, మ్యాచింగ్ బ్లౌజ్ పీసులు అమ్ముతాడు కదా, వాడి దగ్గర" అంటూ అక్క పైకి వెళ్లిపోయింది.

చెల్లెలు ముసిముసిగా నవ్వుకుంటూ కారు దగ్గరకు వెళ్లి "మీరూ, పిల్లలు బావగారితో పాటు ఆ కారులో వెళ్లండి. మేమీ కారులో వచ్చేస్తాం. అందరం లేటుగా వెళ్తే బాగోదు" అని భర్తతో చెప్పింది.

అతను దీర్ఘంగా ఓ శ్వాస వదిలి, కారు దిగి, కీస్ ఆమె చేతిలో పెట్టి ముందున్న కారులో ఎక్కాడు. పిల్లలందరూ అప్పటికే ఆ కారులో కూర్చుని గోల చేస్తున్నారు.

చెల్లెలు పైకి వెళ్లేప్పటికి, అక్క అద్దంలో చూసుకుంటోంది. ''ఏంటే ఇప్పుడు నువ్వు సింగారించుకుంటున్నావా?" అని నవ్వుతూ, "ఆవిడ గారికి ఇంకా ఏం కావాల్ట?" అంది, తలుపులు వేసి వున్న బెడ్‌రూమ్ వైపు చూస్తూ.

"ఏం లేదులే, వచ్చేస్తున్నాం." అని "ఏంటి, వాళ్లందరినీ మా కారులో పంపేసావా?" అని అడిగింది.

"అవును మరి, అందరం కట్టకట్టుకుని ఒకేసారి అంటే, ఈ ట్రాఫిక్‌లో ఎప్పటికి చేరతామో. మరీ లేటైతే ఏం బావుంటుంది? అందుకే పైలెట్లని ముందు పంపిచా" అంది గట్టిగా నవ్వుతూ.

ఇంతలో బెడ్‌రూమ్ డోర్ తెరుచుకుని, పైటకు పిన్నీసు పెట్టుకుంటూ తల్లి బయటకు వచ్చింది.

తల్లిని చూసిన వెంటనే "ఆగు.. నేను పెడతాలే" అంటూ పెద్దకూతురు దగ్గరకు వెళ్లింది.

పిన్నీసు పెట్టడానికి వీలుగా తిరుగుతూ "ఏమే.. ఎందుకంత గట్టిగా నవ్వుతున్నావ్?" అని చిన్న కూతురును ప్రశ్నించింది తల్లి.

''ఏం లేదమ్మా, నీ ఘన కార్యాలను కీర్తించుకుంటూ.. నవ్వుకుంటున్నాం" అంది చిన్న కూతురు మళ్లీ నవ్వుతూ.

"నీకు ఎకసెక్కాలు ఎక్కువయ్యాయే. నా వయసొస్తే తెలుస్తుంది. కాకపోతే అప్పటి వరకూ నేను ఉండను" అందావిడ నిష్ఠూరంగా.

"శుభమాని చక్కగా రెడీ అయ్యి పెళ్లికి వెళ్తూ, ఆ మాటలెందుకిప్పుడు? పదండి.. ఇప్పటికే బోలెడంత లేటయ్యాం" అంటూ హడావిడిగా పెద్ద కూతురు ఇద్దరినీ బయల్దేరదీసింది.

తల్లి చీర నలగకుండా జాగ్రత్తగా ముందు సీట్లో కూర్చుంటూ, చెంగును ముందుకు తీసుకుని ఒళ్లో పెట్టుకుంది. ఆ కూర్చున్న తీరు చూసి చిన్న కూతురు ఆ మళ్లీ ముసిముసిగా నవ్వుకుంటూ..

''ఏమైనా నీకు పట్టుదల ఎక్కువమ్మా. గట్టిదానివి" అంది చిన్న కూతురు.

"నోర్మూసుకో.. ఇలా అయితే నేను మీతో రాను. సుబ్బరంగా ఏ క్యాబో బుక్ చేసుకుని వెళ్తా" అంది తల్లి.

''ఇప్పుడేమీ అనేయలేదులే. ఎందుకలా ఉడుక్కుంటావ్?" అంది చిన్నకూతురు నవ్వుతూనే.

కాసేపు కారులోని ఏసీ చల్లదనాన్ని ఆస్వాదిస్తూ, మెల్లగా వినిపిస్తున్న పాటల వైపు చెవులు మరల్చారు.

"ఎంత చిత్రమో చూడు. అంత సున్నితమైన గొంతుతో మధురంగా పాటలు పాడే రావు బాలసరస్వతీ దేవిగారికి హార్రర్ సినిమాలు చూడటమంటే ఇష్టమంట. తెలుసా?" అని అడిగింది పెద్దావిడ, కూతుళ్లను ఉద్దేశించి.

వెంటనే "ఓహో.. నీకొచ్చి చెప్పిందా ఆవిడ?" అని ఎప్పటిలాగానే వెటకరించింది చిన్న కూతురు.

"ఆవిడ చెప్పడం కాదే. ఫేస్ బుక్లో ఎవరో రాశారు" అని అందామె కూతురు వెటకారం పట్టించుకోకుండానే.

"అమ్మో.. నువ్వు ఫేస్ బుక్ కూడా చూస్తున్నావా? ఇదెప్పటి నుంచి?" అని ప్రశ్నలు సంధించింది చిన్న కూతురు.

"నీకు తెలీదులే.. పగలు సీరియళ్లు, సాయంత్రం ఫేస్‌బుక్,రాత్రి వాట్సప్. ఏమనుకున్నావ్, అమ్మంటే?" అంది పెద్దది.

"నీకేమైందే, నా మీద పడుతున్నావ్?" అంటూ మొట్టికాయ వేస్తున్నట్టు చెయ్యెత్తి, "మొన్న నన్ను చూద్దామని వచ్చాడు కదా, మా పెద్ద చెల్లెలు కొడుకు.. వాడు ఆ ఫేస్ బుక్‌లో చేర్చాడు. వెంటనే వాళ్లమ్మకీ, పిన్నికీ ఫోన్లు చేసేసి 'పెద్దమ్మ ఫేస్ బుక్‌లో ఉంది. తెలుసా' అంటూ బాకా ఊదేశాడు కూడా" అంది నవ్వుతూ.

''ఓహో.. వాడి నిర్వాకమా, ఇది'' అని సాగదీసింది పెద్ద కూతురు. చిన్న కూతురు విననట్టే ఊరుకుంది.

వాళ్లు ఆర్థికంగా తమకుంటే తక్కువ వాళ్లనీ, అందుకే లేనిపోని ప్రేమలు ఒలకబోస్తాడని పెద్ద కూతురు ఉద్దేశం.

* * *

కారు సాఫీగా సాగిపోతోంది. వాళ్ల జీవితాలు కూడా అంతే, పెద్ద ఒడుదొడుకులేమీ లేవు. పెద్ద కూతురు కొన్నాళ్లు ప్రైవేట్‌లో ఉద్యోగం చేసేది. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలకు వెళ్లిపోతే పిల్లలను చూసేందుకు ఎవరూ ఉండరని తల్లి ఇంటికి దగ్గర్లోనే రెండు గదుల ఇల్లు అద్దెకు తీసుకుంది. భార్యాభర్తలు ఉద్యోగాల్లో కుదురుకునేసరికి నాలుగిళ్ల అవతల అపార్ట్‌మెంట్ లేచింది. బ్యాంక్ లోన్‌తో అందులో ఓ ఫ్లాట్ తీసుకుంది. కొన్నాళ్లకు చెల్లెలికి పెళ్లి సంబంధం కుదిరినప్పుడు కూడా రెండు వీధుల అవతల వస్తున్న అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ బుక్ చేయించేసింది.

"ఇప్పుడంటే మీరిద్దరూ చిలకాగోరింకల్లా హాయిగా ఉంటారు. రేపు పిల్ల పీచూ అయితే.. ఎవరు చూస్తారు. అయినా, పెద్దమ్మ ఉండగా వాళ్లని ఎవరో చూడాల్సిన ఖర్మేంటి? ఇద్దరివీ పెద్ద ఉద్యోగాలే కాబట్టి ఇప్పుడే బుక్ చేసేసుకోండి. ప్రీ బుకింగ్ చేస్తే ఓ రెండు మూడు లక్షలపైనే మిగుల్తాయి. నేను మాట్లాడి కారు పార్కింగ్లు రెండు ఇప్పిస్తా. మీకు అవసరమైతే వాడుకోవచ్చు లేదంటే ఎవరికైనా అది కూడా అద్దెకు ఇవ్వొచ్చు. అమ్మా, నేనూ దగ్గర్లలోనే తగలడ్డాం కదా, ఇక నీకు దిగులేంటే?" అని ఊదరగొట్టి చెల్లెల్నీ, కాబోయే ఆమె భర్తనీ ఒప్పించేసింది. అలా ఆ మూడు కుటుంబాలు అక్కడే సెటిల్ అయిపోయాయి.

కూతుళ్లిద్దరూ పక్కపక్కనే ఉంటామంటే కాదని గట్టిగా అనలేకపోయింది గానీ, పెద్దావిడకు సుతరామూ ఇష్టం లేదు. తమకు వయసు మీరుతున్న కొద్దీ వాళ్లు నెత్తికెక్కి పెత్తనం చేస్తారని ఆమెకు బాగానే తెలుసు. అందుకే "చేసినంత కాలం చేశా. ఇంకా ఎంతకని? దూరంగా ఉంటే వాళ్ల బతుకు వాళ్లు బతుకుతారు. లేకపోతే, అస్తమాటూ నన్ను పట్టుకు వేధించుకుతింటారు" అని భర్తతో అంది.

"మనమూ పెద్దవాళ్లం అవుతున్నాం. డెబ్బయ్యిలు దాటేశాం. కలిసి మెలిసి ఉండటం వాళ్ల కంటే మనకే ఎక్కువ అవసరం" అన్నాడు ఆయన, కూతుర్లపైన సహజంగా ఉండే అభిమానంతో.

మరో నాలుగేళ్లకి ఆయన వెళ్లిపోయాడు.

"నాకంటే ముందే పోయాడు మహానుభావుడు, అదృష్టవంతుడే" అని అనుకుందామె.

తిథి, వారం, వర్జ్యం చూసుకుని మరీ వచ్చిన బంధువులు ''అయ్యో.. ఒక్కత్తివీ ఎలా బతుకుతావోనే?" అంటూ కల్లబొల్లి కన్నీళ్లు విడిచి వెళ్లారు.

"ఈ పదిహేను రోజులూ మేమే చేశాంగా, ఇక మీదట కూడా మేమే చూసుకుంటాం. నువ్వేం వంటలూ వార్పులూ పెట్టుకోవద్దు. మేమే ఏదో ఒకటి తెచ్చిస్తాం" అన్నారు కూతుళ్లిద్దరూ.

ఈ పెత్తనాల గురించి తెలిసినా, గబుక్కున కాదని అనలేకపోయింది.

వాళ్లు తెచ్చిన కూరల్లో, పులుసుల్లో, పచ్చళ్లలో ఏవైనా లోపాలు ఎత్తి చూపితే మొదట్లో వినేవారు. కానీ, రానురానూ "నీకీ వయసులో రుచులు ఎక్కువ య్యాయ్?" అని విసుక్కోవడం మొదలు పెట్టారు.

అంతేకాదు, తర్వాత్తర్వాత 'ఏవైనా నీకు పెద్దదంటేనే ఇష్టం' అని చిన్నదీ, 'నీకు చిన్నదానిమీదే మనసు, నేనెంత చేసినా లక్ష్యపెట్టవ్' అని పెద్దదీ ఆమెను ఆడిపోసుకోవడం మొదలుపెట్టారు.

పిల్లల గొడవలు ఆమెలో ఉక్రోషాన్ని రగిలించాయి. 'ఏం, ఈ వయసులో మాత్రం రుచిగా తినకూడదా? ఆయన వెళ్లిపోగానే నేనేదో అనవసరంగా ఇక్కడ ఉండిపోయినట్టు మాట్లాడతారేంటి? ఎలాగోలా బతికితే సరిపోదా అన్నట్టు చూస్తారేంటి? ఏం, నేను మనిషిని కాదా? నా కోసం నేను సుబ్బరంగా బతక్కూడదా? వీళ్ల బోడి పెత్తనమేంటి?' అనే ఆవేదన ఆమెలో పురులు విప్పుకుంది. నాలుగు రోజుల అంతర్మథనం అనంతరం, అది పడగ విప్పింది.

'ఇక మీదట మీ పనులేవో మీరు చూసుకోండి, నా కోసం హైరానా పడొద్దని కూతుర్లకు నచ్చజెప్పింది.

'ఊరికే చేస్తుంటే, లెక్క లేకుండా ఉంది. చూద్దాం,ఎన్నాళ్లు సాగుతుంతో..' అని కూతుళ్లు కూడా 'సరే' అన్నారు.

స్త్రీలలో మార్పును ముక్కు మీద గుద్దినట్టు చెప్పేది అలంకరణే. ఏదో నైటీ వేసుకుని, నేత చీర కట్టుకుని, తలవంచుకుని, తలపుచాటున నిలబడి, ఎటో దిక్కులు చూస్తూ మాట్లాడాల్సిన పరిస్థితిలో ఆమె– వెన్ను నిటారుగా చేసుకుని నిలబడింది. బీరువాల్లో మగ్గుతున్న చీరలన్నీ బయటకు తీసింది. పూటకో చీర మార్చకపోయినా, రోజుకో చీర నిండుగా కట్టుకోవడం మొదలు పెట్టింది. నసగాల్సిన చోటా, గుసగుసగా మాట్లాడాల్సిన చోటా– కావాలనే గొంతు పెద్దది చేసి గట్టిగా మాట్లాడటం ప్రారంభించింది.

ఆమె అభిజాత్యం కూతుర్లకే కాదు, కాలనీ వాళ్లందరికీ కొట్టొచ్చినట్టు కనబడింది. కాలనీ కమ్యూనిటీ హాల్లో జరిగే ప్రతి కార్యక్రమానికీ హాజరవ్వ సాగింది. పొద్దన్నే యోగా క్లాసులకు వెళ్లేది. అలా వేళ్లేప్పుడు చుడీదార్ వేసుకునేది. వాళ్లాయన ట్రాక్ ప్యాంట్, టీ షర్టు కూడా వేసుకుని ఇంట్లోని అద్దంలో చూసుకుంది. కానీ, బయటకు వెళ్లడానికి కాస్త తటపటాయించింది. పండగలప్పుడు సాంస్కృతిక కార్యక్రమాలకు మంచిమంచి పట్టు చీరలు కట్టుకుని హాజరయ్యేది. ఆమె గాంభీర్యం చూసి, తెచ్చిపెట్టుకున్న సానుభూతి ఒలకబోయాలనుకున్న వాళ్లు కూడా వెనుకంజ వేసేవాళ్లు.

నెమ్మదిగా ఆమెలో ఆత్మవిశ్వాసం బలపడింది. ఇంటిని చక్కదిద్దే ప్రయత్నం చేసింది. మళ్లీ ఏడవకుండా, కూతుళ్లను పిలిచి కావాల్సిన వస్తువులు, సామాన్లు తీసుకుపొమ్మని చెప్పింది. భర్త బట్టలు చుట్టుపక్కల అపార్ట్ మెంట్లలోని వాచ్‌మన్లకు ఇచ్చేసింది. వాచీ, వాడని పర్సు, టై లాంటివి బంధువుల్లో కాస్త లేనివారికి అందజేసింది.



నెమ్మదిగా ఆమెలో ఆత్మవిశ్వాసం బలపడింది. ఇంటిని చక్కదిద్దే ప్రయత్నం చేసింది. మళ్లీ ఏడవకుండా, కూతుళ్లను పిలిచి కావాల్సిన వస్తువులు, సామాన్లు తీసుకుపొమ్మని చెప్పింది. భర్త బట్టలు చుట్టుపక్కల అపార్ట్ మెంట్లలోని వాచ్‌మన్లకు ఇచ్చేసింది. వాచీ, వాడని పర్సు, టై లాంటివి బంధువుల్లో కాస్త లేనివారికి అందజేసింది.

తన వంటింట్లోని సామాన్లన్నీ తీసుకుని పనిమనిషి సాయంతో ఆటోలో బజార్లోని స్టీలు సామాన్ల షాపుకి వెళ్లింది. తాను తీసుకెళ్లిన సామాన్లు ఇచ్చి, పైన కాసిని డబ్బులు వేసుకుని తన ఒక్క దానికీ సరిపడేలా చిన్న చిన్న స్టీల్ కుక్కర్, మూకుళ్లు, గరిటెలు, కాఫీ ఫిల్టర్ తీసుకుంది.


దాంతో ఇల్లు–సగం ఏంటి, అంతకంటే ఎక్కువే ఖాళీ అయిపోయింది.

ఆమెలో ఉత్సాహం మరింత ఉరకలు వేసింది.

పొద్దున్న లేవగానే 'టైమెంతైందీ?' అనుకుంటూ గడియారం వైపు చూడటం మానేసింది. టీవీ ఆన్ చేసి భక్తి పాటలు పెడుతుంది. స్టౌమీద పాలు పడేసి బ్రష్ చేసుకుని వచ్చి, ఫిల్టర్ కాఫీ తాగుతూ ఛానల్స్ మారుస్తూ వార్తలు చూస్తుంది. స్నానం చేసొచ్చి ఏ దోశలో పోసుకుంటుంది. లేదంటే ఇడ్లీలు పెట్టుకుంటుంది. పచ్చళ్లు పొడులు ఎలాగూ ఉండనే ఉంటాయి. సాయంత్రాలు హాల్లోంచి గదుల్లోకి తిరుగుతూ వాకింగ్ అయిందనిపిస్తుంది. ఇలా నాలుగు నెలలు గడిచాయో లేదో ఆమెలో చాలా మార్పు వచ్చింది. వయసుకు మించిన హుషారు వచ్చింది. అది ఇతరుల్లోనూ గమనింపునకు వచ్చింది. టీవీలో పాత సినిమాలు చూస్తూ అందులోని పాటలు గొంతు విప్పి హాయిగా పాడుకునేది. ఫేస్బుక్, యూట్యూబ్ వీడియోల్లో డాన్సులు చూస్తే–శరీరం సహకరించకపోయినా, మనసు ఊగిపోయేది.

సంతోషం సగం బలం అని ఎందుకంటారో అప్పుడు ఆమెకు అర్థమయ్యింది.

"బా.. పాడతన్నవమ్మా" అని పని మనిషి



నవ్వుతూ పొగిడేది.

“ఏడిసావులే. టిఫిన్ కావాలంటే అడుగు పెడతా. నా పాట ఏ పాటో నాకు తెలీదనుకున్నావా?” అని నవ్వేసేది.

హెన్నా నానబెట్టుకుని, పనిమనిషితో తలకు పెట్టించుకునేది. అది ‘ఈ వయసులో ఎందుకమ్మా?’ అనకుండా, పనిమనిషి చేతిలో ఓ వంద పడేసేది.

పైకి చెప్పకపోయినా, తల్లిలో వచ్చిన మార్పు కూతుర్లిద్దరిలో తెలియని గర్వాన్ని నింపింది. ధైర్యాన్నిచ్చింది.

* * *

సాఫీగా వెళ్తున్న కారు సడన్ బ్రేక్‌తో ఆగింది. ఎవరి ఆలోచనల్లోంచి వాళ్లు ఇహ లోకంలోకి వచ్చారు. పక్క సీట్లోని తల్లీ, వెనుక సీట్లోని అక్కా ‘ఏమైందీ?’ అన్నట్టు చూశారు.

“ఏమీ లేదు, సిగ్నల్ పడింది” అంటూ గేర్‌ని న్యూట్రల్‌లో పెట్టి, తల్లి వైపు దీర్ఘంగా చూసింది చిన్న కూతురు.

“అమ్మా.. నువ్వు మరీ ఓవర్ చేస్తున్నావ్. మేమే ఏదో అలాఅలా తయారవుతుంటే, నీకేవో షోకులెక్కువయ్యాయి” అంది.

“అవును, నాకు షోకులు ఎక్కువయ్యాయి. నేనే బ్యూటీ పార్లర్‌కి పోయి ఐబ్రోస్ చేయించుకుంటున్నా. నేనే ఫేస్ ప్యాక్ వేయించుకుంటున్నా. నేనే హెయిర్ స్ట్రెయిటెనింగ్ చేయించుకుంటున్నా..” అని ఆవిడ ఇంకా అంటుండగానే..

“అవునమ్మా, మేమంటే వయసులో ఉన్నాం. చేయించుకుంటాం..” అని పెద్ద కూతురు ఇంకా ఏదో అనబోతుండగానే..

“అవునే, మీరేమో కన్నె పిల్లలూ, కుర్రపీనుగులూ. నేనేమో ముసలిదాన్ని. అంతేగా? అందులో దాపరికం ఏముంది?” అంది పెద్దావిడ, వ్యంగ్యంగా.

అమ్మ కోపాన్ని చూసి చిన్న కూతుళ్లు చిన్నగా నవ్వుకున్నారు. అది పెద్దావిడకు మరింత కోపం తెప్పించింది.

“అంటే.. అన్నానని ఏడుస్తారు మళ్లీ. నువ్వా ఉద్యోగం వెలగబెడుతున్నావ్ కదా. ఆ మధ్య నీతో చాలా క్లోజ్‌గా ఉండే మీ కొలీగ్ ఒకాయన ఫోన్ చేసి ‘మీరుండే ఏరియాకు పనిమీద వచ్చాను. ఓసారి కలుస్తా. ఇంటికి రానా?’ అని అడిగితే రానిచ్చావా?” అని నిలదీసిందావిడ.

వెంటనే చెల్లెలు ఓ వైపు డ్రైవింగ్ చేస్తూనే, కాస్త వెనక్కు తిరిగి అక్కవైపు చూస్తూ..

“అది కాదే, ఎప్పుడంటే అప్పుడు ఎలా రానిస్తామే మగవాళ్లని ఇంటికి. జుట్టు ముడులేసుకుని, నైటీలు దిగేసుకుని పోతామా, జిడ్డు ముఖాలతో వాళ్ల ముందుకు? డిగ్నిటీ పాడూ ఏమీ ఉండవా?” అని ఆవేశంగా ప్రశ్నించింది.

“అమ్మ ఏదో అంటుంది లేవే. నీకేమైనా కొత్తా? సరిగ్గా చూసి డ్రైవింగ్ చెయ్యి. లేదంటే..” అందామె చెల్లెలితో.

“ఆ.. ఆ డిగ్నిటీయే నాకూ ఉండాలి కదా అనేది. ఓపిక లేకపోతే పోనీ అనుకోవచ్చు. ఉన్నప్పుడు కూడా ఏం ఖర్మ? ఈసురోమంటూ బతుకాలా? అదీగాక, చుట్టుపక్కల ఫంక్షన్లు, మనవాళ్ల ఇళ్లలో కార్యక్రమాలు అంటే పోనీలో అనుకోవచ్చు. ఎప్పుడూ చూసే ముఖాలే కాబట్టి. స్టార్ హోటల్లో, అంత పెద్ద పెళ్లి రిసెప్షన్ అంటే ఎక్కడెక్కడి వాళ్లో రారూ? కాస్త ఠీవిగా, దర్జాగా ఉండద్దుటే వాళ్ల ముందు? లోపట వేసుకోపోతే ఎలా? ఉన్నాయనే అనుకున్నా. ఉండాలి కూడా. రెగ్యులర్‌గా వాడకపోయేసరికి, గబుక్కున ఎక్కడ తగలడ్డాయో కనబడలేదు. లేపోతే, మీతో ఇన్ని మాటలు పడేదాన్నా?'' అని ఆవిడ అంటూ ఉండగానే, గొంతు బొంగురుపోయింది. కూతుళ్లు ఏదో సర్ది చెప్పబోయారు, ఇంతలో హోటల్ వచ్చేసింది.



లోపలకు వెళ్తూనే బంధువులతో తమ నగలు, బట్టలు పోల్చుకుని ‘ఫరవాలేదు బాగానే తయారయ్యాం’ అనే నిర్ణయానికొచ్చారు కూతుళ్లిద్దరూ. ఎంత ఎక్కువ స్కిన్ షో చేస్తే అంత గొప్పని వాళ్లకు తెలుసు.

లోపలకు వెళ్తూనే బంధువులతో తమ నగలు, బట్టలు పోల్చుకుని ‘ఫరవాలేదు బాగానే తయారయ్యాం’ అనే నిర్ణయానికొచ్చారు కూతుళ్లిద్దరూ. ఎంత ఎక్కువ స్కిన్ షో చేస్తే అంత గొప్పని వాళ్లకు తెలుసు. కానీ, తమ పిల్లల కంటే చాలామంది సింగిల్ పీస్ డ్రస్సుతో– అసలు అది కూడా వేసుకోడం ఎందుకు అన్నట్టు స్కిన్ షో చేస్తూ కనబడేసరికి కాస్త ఖంగుతిన్నారు.

పెద్దావిడలోని హుందాతనాన్నీ, ఠీవిని.. చాలామంది బంధువులు గుర్తించారు.

“ఎనభైల్లోకి వస్తూ కూడా యాభైల్లోలాగా ఫెళఫెళలాడుతున్నావ్” నెమ్మదిగా అంది పెద్దావిడ చిన్న చెల్లెలు దగ్గరకు వచ్చి కౌగిలించుకుంటూ.

“మరీ మోసయ్యకే. ఏదో పెద్ద ఫంక్షన్ అనీ, నలుగురూ వస్తారని.. అంతే. మరీ అతిగా ఉందా?” అంటూ చెల్లెలిని అడిగిందావిడ మొహమాటంగా.

“ఏం లేదు. బావున్నావ్. ఠీమాగా, దర్జాగా కనిపిస్తున్నావ్” అంటూ చెల్లెలు కబుర్లలోకి దింపింది.

తల్లి వయసుకంటే చాలా చిన్న వాళ్లు, ఆమెకంటే వృద్ధుల్లా కనబడటాన్ని కూతుళ్లు గుర్తించకపోలేదు. బహుశా, వాళ్లు ముసలితనానికి లొంగిపోయారేమో అనిపించింది వాళ్లకి.

ఫంక్షన్ ముగించుకుని, బయటకు వస్తుంటే “అమ్మా నువ్వొక్కసారి ఉండు” అని తల్లిని చేయి పట్టుకుని తీసుకువెళ్లిన చిన్న కూతురు, పైనున్న షాండ్లియర్ లైటింగ్ పడేలా, వెనకాల అలంకరించిన వాల్స్ కూడా వచ్చేలా మొబైల్‌తో టకటకా నాలుగైదు ఫొటోలు తీసింది.

అంతా బయటకు వచ్చాకా, ‘మేమంతా ఒకే కారులో వెళ్తాం’ అని పిల్లలు గొడవ చేశారు. ఆడవాళ్లతో ఎందుకులే అనుకున్నాడేమో, చిన్నల్లుడు కూడా అదే కారులో ఎక్కేసాడు.

కారు రోడ్డెక్కాక “ఏమే ఫోన్ ఇటియ్యి. అమ్మ ఫొటోలు తీసినట్టున్నావ్” అని చెల్లెలి ఫోన్ తీసుకుంది అక్క.

ఫొటోలు చూస్తూ “అమ్మా నీది వేరే లెవెలమ్మా. జయాబచ్చన్, రేఖ.. అలాంటి వాళ్లలా దర్జాగా వున్నావ్” అంది.

“ఏడిసార్లెండి మీరూ మీ మాటలూనూ. ఇలా ఇవ్వండి. నేనెలా ఉన్నానో నేను చూసుకోవద్దా?” అందావిడ.


పెద్ద కూతురు ఫోన్ అందించింది. తన ఫొటోలను చూసుకుంది. అలా చూసుకుంటుంటే ఒకరకమైన గర్వం ఆమె ముఖంలో తొణికిసలాడింది. ఫోన్ పక్కన పెట్టేసి ఓ క్షణం మౌనం వహించింది. తరువాత నెమ్మదిగా ఆచితూచి మాట్లాడుతున్నట్టు “ఓమాట చెబుతా వినండి. వయసులో ఉన్నప్పుడు అలంకరణలు ముచ్చట కోసం, ఆకర్షణ, ఫ్యాషన్ కోసమైతే వయసైపోయాక అలంకరణలు ఆత్మగౌరవం కోసం. ఇంటి గుట్టే కాదే, లోగుట్టు కూడా జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఇంటి గుట్టు లంకకు చేటైతే.. లోగుట్టు ఒంటికి చేటు. నువ్వు ఆత్మవిశ్వాసంతో నిటారుగా నిలబడినంతకాలమే ఈ ప్రపంచం నిన్ను గౌరవిస్తుంది. వంగావనుకో అణగదొక్కేస్తుంది” అందావిడ ఉద్వేగంగా.

కూతుర్లిద్దరూ తల్లివైపు చూసారు, కూతుర్లలా కాదు–భక్తుల్లా.

వచ్చేవారం కథ..

**భరతమాత**

– గోగినేని రత్నాకరరావు






సృజనాత్మకతకు హద్దులు లేవు. గ్రహాల మధ్య ప్రయాణం కూడా ఆ మహాశక్తికి అసాధ్యం కాదు. ఐదు దేశాల వ్యోమగాములు అంతరిక్షంలో నిర్మించిన స్పేస్ స్టేషన్‌లో 24 గంటలు గడిపితే, వారి అనుభవాలూ, అనుభూతులూ ఎలా ఉండవచ్చు? వాటి నుంచి ఏమి గ్రహించవచ్చు? 24 గంటలలో 16 సూర్యోదయాలూ, అదే సంఖ్యలో అస్తమయాలూ చూడడం ఎలాంటి అనుభూతి? మన గ్రహం అనుసరించే కాలమానానికీ, అంతరిక్షంలో కాలమానానికీ తేడా ఉందని చెబుతారు. ఆ సమయం ప్రకారం భూమి తన చుట్టూ తాను 16 పర్యాయాలు తిరుగుతుంది. ఇలాంటి ఇతివృత్తంతో రాసిన సైన్స్ ఫిక్షన్ 'ఆర్బిటల్'. 2024 సంవత్సరానికి బుకర్ పురస్కారానికి ఎంపికైన నవల ఇదే. రచయిత్రి ఇంగ్లండ్‌కు చెందిన సమంత హార్వే. నవంబర్ 12న ఈ మేరకు ప్రకటన వెలువడింది.

# అంతరిక్ష అద్దంలో జీవితం

ఇది గాయపడిన ప్రపంచం గురించి చెప్పిన రచన అని న్యాయ నిర్ణేతలు వ్యాఖ్యానించారు. ఈ ఏటి పురస్కారం ఈ నవలకు ఇవ్వాలని న్యాయ మూర్తులంతా ఏకగ్రీవంగా తీర్మానించారంటే ఇందు లోని సౌందర్యం, ఆశయం ఎంత విశిష్టమైనవో అర్థం చేసుకోవచ్చు. అంతరిక్షంలో ఉన్నంత సేపు వ్యోమ గాముల ఆలోచనలు, అనుమానాలు ఎలా ఉన్నప్పటికీ అలాంటి కేంద్రంలో ఉండే నిర్మానుష్య వాతావరణం, మనిషి సాటి మనిషితో కోరుకునే బంధం, ఆశ నిరాశల మధ్య ఊగిసలాటల గురించి ఆమె కల్పన చేశారు. భూగోళం మీద జీవితం ఎంత అందమైనదో, ప్రతిక్షణం మనిషిని భయాల మధ్య నిలిపిఉంచే అంతరిక్ష కోణం నుంచి తెలియచేసే ప్రయత్నమే ఇదంతా. నిజానికి భూగోళం ఎంత సుందరమైనదో ఆవిష్కరించడం ఆమె అసలు ఉద్దేశంగా కనిపిస్తుంది.

అంతరిక్ష జీవితం గురించి రాసిన తొలి నవలగా సాహిత్య చరిత్రలో 'ఆర్బిటల్' ప్రత్యేకతను సంతరించు కుంది. 16 ఉషోదయాల దృశ్యాలను, అలాగే 16 సూర్యాస్తమయాలను ఆమె తన నవలలో అద్భుతంగా ఆవిష్కరించారని న్యాయనిర్ణేతలు చెప్పారు. ఈ సంవత్సరం బుకర్ పురస్కారం పరిశీలనకు వెళ్లిన ఆంగ్ల రచయిత ఆమె ఒక్కరే.

1975లో కెంట్‌లో పుట్టిన సమంత తత్వశాస్త్ర విద్యార్థిని. ఆమె మొదటి నవల 'ది వైల్డర్‌నెస్' కూడా బుకర్ పరిశీలనకు వెళ్లింది. ఆ సంవత్సరం ఆ అత్యున్నత పురస్కారం దక్కకపోయినా బెట్టీ ట్రాస్క్ పేరుతో ఇచ్చే సాహిత్య పురస్కారం దక్కింది. పుడమికి అనుకూలంగా ఎవరు మాట్లాడతారో, మానవీయ విలువలకు ఎవరు వ్యతిరేకంగా మాట్లాడరో వారికి ఈ బహుమానం అంకితం చేస్తున్నానని హార్వే అన్నారు. మొత్తంగా చెప్పాలంటే ఎవరు శాంతి కోసం మాట్లాడతారో వారికి అంకితం అన్నారామె. ఈ ఒక్క సంవత్సరంలోనే ఆర్బిటల్ 29,000 ప్రతులు అమ్ముడయ్యాయి. ఆర్బిటల్‌కు ముందు ఆమె వెలువరించిన నవలలు ది వెస్టర్న్ విండ్, ది షేప్‌లెస్ అన్ ఈజ్: ఏ ఇయర్ ఆఫ్ నో స్లీపింగ్, ఇంకొన్ని రచనలు ఉన్నాయి. హార్వే రాసిన ఆరవ నవల ఆర్బిటల్. హార్వే ఈ తరం వారికి వర్జీనియా ఊల్ఫ్ వంటివారని కూడా ఖ్యాతి గాంచారామె.

మానవ జీవితం మీద దుర్బలత్వం, ఐక్యత, వియోగాల పాత్ర ఎంత బలీయంగా ఉంటుందో చెప్పడానికి రచయిత్రి అంతరిక్షాన్ని ప్రతీకగా తీసుకున్నారు. మానవ జీవితంలోని ఆ స్థితులను ఆ పాత్రలతో వర్ణించారు. ఒక జీవితం ఎంచుకున్నారు. ఉద్వేగం, మానసిక, భౌతిక కోణాల నుంచి చూసినా మనిషి ఉనికి ఎంత దుర్బలమైనదో చెప్పడం ఇందులోని మరొక కోణం. అంతరిక్షం అంటే ప్రతిక్షణం ప్రాణాన్ని ముప్పు అంచుకు తీసుకువెళ్లి వెనక్కి తీసుకువచ్చే వాతావరణంలో ఉంటుంది. మానవ జీవితం అసలు తత్త్వం ఇదేనని ఆమె చెబుతారు. భూమి మీద కూడా మానవ జీవితం ఎప్పటికీ ఒక ముప్పు అంచునే ఉన్నా, ఆ విషయం మనిషి నిశితంగా గమనించడు కాబట్టి రచయిత్రి తన ఇతివృత్తానికి అంతరిక్ష కేంద్రాన్ని నేపథ్యంగా తీసుకున్నారని అనిపిస్తుంది. ఒక క్షణం ఆశ, మరుక్షణం నిరాశ ఎలా పెనవేసుకుని ఉంటాయో వ్యోమగామి జీవితం బాగా ప్రదర్శించగలదు. ఇంత పెద్ద కాన్వాస్‌ను వర్ణించడానికి తీసుకున్న ఇతివృత్తం కాలపరిమితి కేవలం 24 గంటలు. 16 సూర్యోదయాలు, 16 అస్తమయాల నడుమ ఆ పాత్రలన్నీ భూమి మీది తమ అనుభవాలే గీటురాళ్లుగా అంతరిక్షంలో ఏర్పడిన భయాలను ఆలోచనలను వివరిస్తాయి. సమూహంలో ఉన్నా మనిషిలో తనవైన ఆలోచనలు తప్పవంటారు రచయిత్రి. అమెరికా, రష్యా, జపాన్, బ్రిటన్, ఇటలీ దేశాల వ్యోమ గాములను అంతరిక్షంలో కలపడమే ఈ నవలలోని వైవిధ్యం. ఈ కూర్పే నవల రూపసారాలను సంప ద్వంతం చేసింది. ప్రతి వ్యోమగామి తనదైన సంస్కృతి, దృక్పథం నుంచి అనుభవాలను పంచుకుంటూ ఉంటాడు. ఏ దేశమైనా, ఏ సంస్కృతి అయినా, ఎలాంటి దృక్పథంతో ఉన్నా మానవాళిలో ఒక సామ్యత ఉంటుందని ఆమె చెబుతారు.

మానవాళి మొత్తానికి వర్తించే కొన్ని అనుభవాలు, భయాలు, ఆకాంక్షలు ఉన్నాయని మనకి ఇటీవలనే గుర్తు చేసిన సందర్భం కొవిడ్ 19. మనిషి జీవితం లోని ఈ స్థితులను అంతరిక్షం కేంద్రంగా చెబితే ఎలా ఉంటుందన్న ఆలోచన హార్వేకు కొవిడ్ కాలంలోనే రావడం విశేషం. ప్రకృతి ముందు మనిషి ఎంత అల్పుడో ఆ కాలం గొప్పగా చెప్పింది. ఎడబాటు ఎంత భయానకమో, మనిషికి మనిషి ఎంత సాంత్వనో తెలియచేసిన ఇటీవలి అనుభవం కూడా అదే. దీనినే రచయిత్రి మరింత బలంగా ఆవిష్కరించ డానికి, కాన్వాస్ పరిధిని పెంచుతూ అంతరిక్షంలో చెప్పారు. ఈ నవల పూర్తి చేసిన పాఠకులు సొంత జీవితం గురించి, మానవ సంబంధాల గురించి మనిషి ఆలోచించవలసిన అవసరం ఎంతో ఉందన్న అభిప్రాయానికి వస్తారని నిశ్చయంగా చెప్పవచ్చు నంటారు విమర్శకులు. ఇంత తాత్త్వికతను కేవలం 136 పేజీలలోనే అందించారు. నిజానికి హార్వే రచనా శైలి ఉద్వేగభరితంగా, ప్రభావాత్మకంగా, అయినా క్లుప్తంగా ఉంటుందని విమర్శకులు చెబుతారు. ఎంతటి క్లిష్ట ఇతివృత్తానయినా ఆమె తక్కువ నిడివిలో చెప్పడానికే ప్రయత్నిస్తారు. ప్రయోగించే ప్రతి పదం పాఠకుడిని కదిలించే తీరులో ఉపయోగిస్తారన్న ఖ్యాతి ఆమెది. ఆర్బిటల్ నవలలోని క్లుప్తత కూడా పాఠకులను విశేషంగా ఆకర్షించిన కారణాలలో ఒకటి. చిరకాలం పాఠకుల మనసుల మీద ప్రభావం చూపించాలి అంటే సుదీర్ఘమైన నవలలే కానక్కరలేదని ఆమె నిరూపించా రని కూడా విమర్శకులు అంటారు. ★



భారత క్రికెట్‌కు ఎనలేని ఖ్యాతి సాధించి పెట్టడంతో పాటు రూ. వందల కోట్లు వెనుకేసుకున్న క్రికెటర్లలో సునీల్ గవాస్కర్, సచిన్ టెండుల్కర్ లాంటి దిగ్గజాల సేవాభావం కొత్తపుంతలు తొక్కుతోంది. తమ విశ్రాంత జీవితాన్ని 'మానవసేవే మాధవసేవ' అన్న భావనతో గడుపుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

# దొరకునా ఇటువంటి సేవ!

భారత దిగ్గజ క్రికెటర్లు రెండురకాలు. తమ క్రికెట్ జీవితంలో సంపాదించిన దానిలో కొంతభాగాన్ని సమాజసేవకు వినియోగించేవారు మొదటి రకమైతే, సంపాదనను పలురకాల వ్యాపారాలలో పెట్టుబడులు పెడుతూ రిటైర్మెంట్ తరువాతా దండిగా ఆర్జించాలని ఆరాటపడే వారు రెండోరకం.

అయితే...క్రికెట్ ఫీల్డ్‌లో మాత్రమే కాదు... క్రికెట్ మైదానం వెలుపలా తమ దాతృత్వం, సేవా కార్యక్రమాలతో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న మాజీ కెప్టెన్లు,ముంబై దిగ్గజాల జోడీ సునీల్ మనోహర్ గవాస్కర్, సచిన్ రమేశ్ టెండుల్కర్‌ల గురించి ప్రముఖంగా చెప్పుకోవాలి.

### 75 ఏళ్ల వయసులో సునీల్ 'మనోహరం'!

భారత క్రికెట్ 1970 తరం ఆటగాడు, విశ్వవిఖ్యాత ఓపెనర్, రికార్డుల మొనగాడు సునీల్ గవాస్కర్ తన విశ్రాంత జీవితాన్ని క్రికెట్ వ్యాఖ్యానంతో పాటు సేవా కార్యక్రమాలతో సార్థకం చేసుకోగలుగుతున్నారు. 75 ఏళ్ల తన జీవితంలో 55 ఏళ్లుగా క్రికెట్‌తో మమేకమవుతూ వచ్చిన ఆయన భారత తొలితరం సూపర్ స్టార్ క్రికెటర్‌గా, రిటైర్మెంట్ తరువాత ప్రపంచ మేటి క్రికెట్ వ్యాఖ్యాతగా రూ.వందల కోట్లు ఆర్జిస్తూ, అందులో కొంత భాగాన్ని సేవాకార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. సత్యసాయిబాబా స్ఫూర్తి, ప్రేరణతో చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్లు చేయించడంలో తనవంతు పాత్ర నిర్వర్తిస్తున్నారు. సత్యసాయి ట్రస్టుతో కలసి పనిచేస్తూ 35వేల మంది చిన్నారులకు కొత్త జీవితాన్ని ఇవ్వగలిగారు.

### పిల్లల్ని సెల్ ఫోన్లకు దూరంగా ఉంచండి...

సత్యసాయి సేవాట్రస్టు సభ్యుడిగా ఉన్న గవాస్కర్ తెలంగాణలోని కొండపాకలో ఆ ట్రస్టు నిర్మించిన 100 పడకల ఆస్పత్రి 'సత్యసాయి సంజీవని రీసెర్చి ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసన్‌తో కలసి ప్రారంభించారు. అక్కడ ఇప్పటి వరకూ 28 వేల గుండె ఆపరేషన్లు నిర్వహించగా, చిన్నారుల శస్త్రచికిత్సల ఖర్చును సునీల్ గవాస్కర్ భరిస్తున్నారు. గుండె సంబంధిత లోపాలు, వ్యాధులతో బాధపడుతున్న బాలలకు సేవచేయటంలో ఎంతో ఆనందం ఉందని, తన వంతుగా సాయం చేయటం అదృష్టమని గవాస్కర్ మురిసిపోతున్నారు. బెంగళూరులోని శ్రీ సాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ద్వారా సేవలు కూడా సేవలు అందిస్తున్నారు.

పిల్లలు సెల్ ఫోన్లు, టీవీల ముందు ఉండేకంటే క్రీడామైదానాలలో ఉండేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని గవాస్కర్ సూచించారు. ఈ విషయంపైనా తమ ట్రస్టు అవగాహన కల్పించడానికి పాటుపడుతున్నట్లు గుర్తు చేశారు.

తాను క్రికెట్ ఫీల్డ్‌లో సాధించిన రికార్డులు, ఆదాయం, పేరు ప్రఖ్యాతుల కంటే.. సేవా కార్యక్రమాల ద్వారా లభిస్తున్న సంతృప్తిని మించింది మరేదీలేదంటూ ఈ క్రికెట్ కురువృద్ధుడు మురిసిపోతున్నారు. తాను 75 సంవత్సరాల వయసులోనూ క్రికెట్ వ్యాఖ్యాతగా సేవలు అందించడానికీ, ఆరోగ్యంగా, ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండటానికీ సేవా కార్యక్రమాలే ప్రధానకారణమని ప్రకటించారు.

1971– 1987 మధ్యకాలంలో 125 టెస్టులు ఆడి 34 సెంచరీలు, 45 హాఫ్ సెంచరీలతో 10వేలకు పైగా పరుగులు సాధించిన గొప్ప రికార్డు ఉంది. భారత్ తరపున ఆడిన 108 వన్డేల్లో ఒక సెంచరీ, 27 హాఫ్ సెంచరీలతో 3092 పరుగులు చేసిన ఘనత సైతం గవాస్కర్‌కు మాత్రమే సొంతం.

ముంబైలోని వాంఖడే స్టేడియంలో గవాస్కర్ పేరుతో ఓ స్టాండ్‌ను ముంబై క్రికెట్ సంఘం ఏర్పాటు చేస్తే..ఇంగ్లండ్ లోని లీస్టర్ షైర్‌లో గవాస్కర్ పేరుతో ఓ క్రికెట్ గ్రౌండ్ ను ఏర్పాటు చేయటం విశేషం.

### ముంబై మురికివాడల బాలల సేవలో మాస్టర్ సచిన్...

భారత క్రికెట్ ఖ్యాతిని ఎవరెస్టు ఎత్తుకు చేర్చిన క్రికెట్ దేవుడు సచిన్ టెండుల్కర్ సైతం తన సంపాదనలో కొంత మొత్తాన్ని సేవాకార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ప్రధానంగా ముంబై మురికి వాడల్లోని లక్షలాది మంది బాలలకు వైద్య, విద్య, ఆహారసదుపాయాలను తన ట్రస్టు' అప్నాలయ' ద్వారా అందిస్తున్నారు. కరోనా బాధితుల సహాయ నిధికి... ప్రధానమంత్రి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి



సహాయనిధికి 25 లక్షల రూపాయల చొప్పున అందించాడు. ముంబై మహానగరంలో కరోనా సమయంలో లాక్ డౌన్ దెబ్బతో ఆహారం అందక అల్లాడుతున్న వేలాదిమంది బాలలకు కడుపునిండా తిండికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాడు. నెలకు 5వేల మందికి భోజనం అందిస్తూ వచ్చాడు.

ఇప్పటికీ ముంబై మురికివాడలలోని బాలల ఉన్నతికోసం సచిన్ తన కుటుంబసభ్యుల సహకారంతో సేవాకార్యక్రమాలను కొనసాగించ గలుగుతున్నాడు. క్రికెటర్లుగా వందల కోట్లు సంపాదించిన ధోనీ, విరాట్ కోహ్లీ లాంటి ఆటగాళ్లు ఎందరో ఉన్నా... లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్, క్రికట్ దేవుడు సచిన్ టెండుల్కర్‌ల సేవా కార్యక్రమాలను కొనియాడక, అభినందించక తప్పదు కాక తప్పదు. ★



కృష్ణారావు చొప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# ఆమె పట్ల గౌరవం ఉంటే, ఆ అవార్డు

తన గాత్రంతో నాస్తికుడిని కూడా ఆధ్యాత్మిక, అలౌకిక భావనలో ముంచెత్తిన మహా సంగీతకారిణి ఎమ్మెస్ సుబ్బులక్ష్మి. ఆమె పాట వినని వారు మన దేశంలో అరుదుగానే ఉంటారు. ఆమె పేరు తెలిసినా, తెలియకపోయినా ఆమె గాత్రం మాత్రం పిల్లలు సహా అందరికీ పరిచితమే. అంతటి మహాకళాకారిణి, సంగీత కళానిధి అయిన ఎమ్మెస్ సుబ్బులక్ష్మి 20వ శతాబ్దపు అతిపెద్ద బూటకమని, సెయింట్లీ బార్బీ బొమ్మ అని అవమానిస్తే, సంగీతాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరికీ ఆగ్రహావేశాలు కలగడం సహజమే. వామపక్ష సంగీతకారుడు టి.ఎం. కృష్ణ ఆమెను తక్కువ చేసి మాట్లాడి, తన గొప్పదనాన్ని ప్రదర్శించుకోవాలనుకొని, అంతిమంగా చతికిలపడ్డాడు.

చెన్నైలోని మ్యూజిక్ అకాడెమీ టిఎం కృష్ణకు ప్రతిష్ఠాత్మక సంగీత కళానిధి అవార్డు ఇవ్వాలని ప్రకటించినప్పటి నుంచీ సంగీతకళాకారుల్లో అసంతృప్తి ప్రారంభమైంది. అకాడెమీ ఏర్పాటుకు ఎంతో కృషి చేసిన గానకోకిలను అవమానించిన వ్యక్తికి అవార్డు ఎలా ఇస్తారంటూ అనేకమంది కళాకారులు ప్రశ్నించి, కృష్ణతో కలసి కచేరీలు ఇవ్వడానికి కూడా నిరాకరించారు. ఈ క్రమంలోనే అతడికి ఆ అవార్డు ఇవ్వడానికి వీలు లేదంటూ ఎమ్మెస్ మనుమడు వి. శ్రీనివాసన్ న్యాయస్థానంలో దాఖలు చేసిన పిటిషన్‌పై మద్రాసు హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేస్తూ, ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పేరిట ప్రతిష్ఠాత్మక మ్యూజిక్ అవార్డు కృష్ణకు ఇవ్వడానికి వీలులేదంటూ పేర్కొంది.

అకాడెమీ అవార్డు ఇవ్వాలనుకుంటే ఇవ్వవచ్చు కానీ, దానిని ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పేరిట ఇవ్వడానికి వీలులేదని జస్టిస్ జి. జయచంద్రన్ తన తీర్పులో స్పష్టం చేశారు. అటువంటి చర్య ఆమె కోరికను, ఆదేశాలను ఉల్లంఘిస్తుందని ఆయన పేర్కొన్నారు. కృష్ణకు ఆ అవార్డు ఇవ్వడం అంటే, ఆమె బహిరంగంగా కోరుకున్న దానికి వ్యతిరేకంగా వెళ్లడమేనంటూ ఆమె మనుమడు వాదనతో కోర్టు ఏకీభవించింది. తన పేరు మీద ఎలాంటి స్మారక



టీఎం కృష్ణ

---

# సరైన దిశలో

ప్రభుత్వం మీదైతేనేం, వ్యవస్థ మాదే కదా? అన్న కశ్మీర్ ఫైల్స్ సినిమాలోని డైలాగు పదే పదే వాస్తవరూపం దాలుస్తున్న నేపథ్యంలో మేధావులు, నెటిజన్లు తెలివి నేర్చుకుని, తమకు నచ్చని విషయాలను బహిరంగంగా, సామూహికంగా వ్యక్తం చేయడంతో ఇప్పుడు వ్యవస్థ కూడా కాస్త తమ చర్యలను సరిదిద్దు కుంటోంది. తాజాగా, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలో స్వయంప్రతిపత్తితో పనిచేసే సాహిత్య అకాడెమీ ఇటీవలే 'సంస్కృతి' అన్న అంశంపై నిర్వహించ తల పెట్టిన సెమినార్ వామపక్ష ప్రచార పరిమళాలు వెదజల్లుతుండడంతో సాధారణ ప్రజల నుంచి మేధావుల వరకూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నవంబర్ నెల 25, 26వ తేదీలలో నిర్వహించాలను కున్న సదస్సుకు 'ఇండియన్ మైథాలజీ' (భారతీయ పురాణాలు) అన్న విషయాంశాన్ని ఎంచుకోవడమే దేశ ప్రేమికులకు చుర్రుమనిపించింది. తమ జానపద కథలు, ఇతిహాసాలకు వామపక్ష వాదులు పెట్టిన 'మైథాలజీ' (పుక్కిటి పురాణం) అన్న తోకను వది లించుకునేందుకు దేశం కష్టపడుతోంది. ముందుగా, ఆ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించడమన్నది అందులో వక్రీకరణలు ప్రవేశించేందుకు అనుమతి స్తుంది. రెండవది, వివాదాలకు కొత్తవాడు కాని వామపక్షవాది అయిన దేవదత్ పట్నాయక్‌ను ఆహ్వానించారు.

దేవ్‌దత్ పట్నాయక్ జీవితం అంతా హిందూ సంస్కృతిని లక్ష్యంగా చేసుకొని రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, దానిని వక్రీకరించడానికి పాల్పడుతూ వస్తున్నాడు. సమాజంలో చీలికలు తీసుకువచ్చే ప్రచారాన్ని సమర్ధించేందుకు తప్పుడు వ్యాఖ్యలతో శాస్త్ర గ్రంథాలను వక్రీకరించడాన్ని నిస్సిగ్గుగా, నిర్భయంగా చేయడం పట్నాయక్ ప్రత్యేకత. కనుకనే, అతడి రచనలు అన్నీ కూడా సనాతన ధర్మ విధ్వంసానికి రెచ్చగొట్టే విధంగా ప్రచారం చేస్తున్నట్టే ఉంటాయి.

ఇక, ఈ సదస్సులో కీలకోపన్యాసం చేయడానికి ఆహ్వానం అందుకున్నది వామపక్షవాదులకు అత్యంత ప్రియమైన నమితా గోఖలే. సీతా మాత, రాధ వంటి పవిత్రమూర్తులను కూడా సరుకుగా మార్చి పేరు ప్రఖ్యాతులను గడించిన మహిళ. ఆమె జానపద కథనాలు, భారతీయ ఇతిహాసాల వివరణ అన్నవి అంతర్జాతీయ ఖ్యాతిని గడించాయి. అందుకు కారణం ఏమిటో తెలుసుకోవడానికి పెద్దగా తెలివి ఏం అవసరం లేదు. ఎందుకంటే, హిందూ గ్రంథాలు, సంప్రదాయాల కపట ప్రాతినిధ్యంపై బతికే వామపక్ష పర్యావరణ వ్యవస్థకు ఆమె కథనాలు ఆసక్తిని కలిగిస్తాయి.

త్వరితగతిని అంతర్జాతీయ వామపక్ష గుర్తింపు పొందేందుకు భారతీయ వారసత్వాన్ని ఒక కారికేచర్‌గా మార్చే ప్రయత్నంగా ఈ మూడు కారణాల వల్లనే, సాహిత్య అకాడెమీ తలపెట్టిన సెమినార్‌ను దేశభక్తులు చూశారు. అంతే, దేవదత్ పట్నాయక్ మన ఇతిహాసాలపై రాసిన పుస్తకాలు, ట్విట్టర్లో చేసే ట్వీట్లు అతడి వాస్తవ నమ్మకాలు అద్దం పడుతున్నాయంటూ, నెటిజన్లు ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాలలో లడాయి వేసుకున్నారు. పవిత్ర గ్రంథాలను లైంగిక దృష్టితో వాఖ్యానం చేయడాన్ని తీవ్రంగా ఖండించడం, దాన్ని భరించలేక అతడు చేసిన వ్యాఖ్యలు అతడి దిగజారుడుతనానికి అద్దం పట్టడం కూడా ఆ వేదికలపై చర్చనీయాంశంగా మారింది. భారత్‌ను కోతుల భూమి అంటూ వెక్కిరించిన దేవదత్ పట్నాయక్ వైఖరి కేవలం హిందూ వ్యతిరేకమే కాదు

# ఎలా తీసుకుంటావ్?

## టి.ఎం. కృష్ణకు మద్రాస్ హైకోర్టు ప్రశ్న



ఎంఎస్ సుబ్బులక్ష్మి

చిహ్నాలు, ట్రస్టులు లేదా ఫౌండేషన్లను ఏర్పాటు చేయవద్దంటూ ఆమె రాసిన విల్లులో కోరిన కోరికను గౌరవించాలని పేర్కొంది.

కాగా, కృష్ణకు అవార్డు ప్రదానాన్ని సవాలు చేస్తూ శ్రీనివాసన్ వేసిన పిటిషన్‌ను తిరస్కరించాలని మ్యూజిక్ అకాడెమీ దాఖలు చేసిన దరఖాస్తును కోర్టు తోసి పుచ్చింది. సుబ్బులక్ష్మి వారసత్వాన్ని నిజంగా గౌరవించినవారెవరూ కూడా ఆమె కోరికలకు వ్యతిరేకమైన చర్యలు చేపట్టరంటూ జస్టిస్ జయచంద్రన్ తన తీర్పులో పేర్కొనడం విశేషం. "ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పట్ల నిజమైన గౌరవం ఉండి, ఆమె కోరిక ఏమిటో తెలిసివారు ఎవ్వరూ ఆమె పేరుతో అవార్డు ఇవ్వడాన్ని కొనసాగించరు/రాదు" అని ఆయన అన్నారు.

సుబ్బులక్ష్మి విల్లులో లబ్ధిదారుడైన శ్రీనివాసన్‌ను గుర్తిస్తూ, అతడు అవార్డు ప్రదానాన్ని సవాలు చేసేందుకు హక్కు కలిగి ఉందని కోర్టు భావించింది. అంతేకాకుండా, మరణించిన ఆమె కోరికలను, సెంటిమెంట్లను 'నిజంగా, నిజాయితీగా గౌరవించే వారు, ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన అవార్డులను అందుకోకూడదు,' అని కూడా న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పేరు ఉపయోగించకుండా అవార్డును ప్రదానం చేయడాన్ని పరిగణించ వలసిందిగా మ్యూజిక్ అకాడెమీని కోర్టు ఆదేశించింది. తద్వారా కీర్తిశేషురాలైన గాయనీమణి వారసత్వం నుంచి టిఎం కృష్ణ సాధించిన విజయాలను విడిగా గుర్తించవలసిందిగా పేర్కొంది.

టిఎం కృష్ణ ఎమ్మెస్ గురించిన వ్యాఖ్యలు అత్యంత అవమానకరంగా ఉండటమే కాదు, ఆమె కుటుంబానికి అత్యంత వేదనను కలిగించాయని, ఈ క్రమంలో కృష్ణకు ఆమె పేరిట ఏర్పాటు చేసిన అవార్డు ప్రదానం చేయడం అసమంజసం అని శ్రీనివాసన్ కోర్టులో వాదించాడు. కాగా, అవార్డుకు ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని, అవార్డు అందుకునేవారి ఎంపికలను గవర్నింగ్ బాడీ ప్రభావితం చేయదని మద్రాస్ మ్యూజిక్ అకాడెమీ నిస్సిగ్గుగా వాదించింది. అవార్డును స్థాపించిన నాటి నుంచి ఇప్పటివరకూ సుబ్బులక్ష్మి కుటుంబం అభ్యంతరాలను తెలపలేదని కూడా అకాడెమీ స్పష్టం చేసింది.

2005లో ఏర్పాటు చేసిన ఈ అవార్డును ప్రతి ఏడాదీ మద్రాసు సంగీత అకాడెమీ ప్రదానం చేసే అత్యున్నత అవార్డు సంగీత కళానిధితో పాటు కలిపి ఇస్తారు.

★

# సాహిత్య అకాడెమీ అడుగు

భారత్ వ్యతిరేకం కూడా అంటూ నెటిజెన్లు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అతడు పాశ్చాత్య ప్రముఖులతో కలిసి భారతీయ సంస్కృతిని వక్రీకరించి, వలసవాద వాసనలతో తన కథనాలను ప్రచారం చేసుకుంటారు.

ఇక నమిత గోఖలే, భారత్‌లో అత్యంత గౌరవం పొందే సీతామాత, రాధ, లక్ష్మీదేవి వంటి దేవతలను వస్తువుగా చేసుకొని తన కెరీర్‌ను మలచుకుంది. వామపక్ష సిద్ధాంతాలను సుసంపన్నం చేసేందుకు ఈ దేవతలను, వారి ఆధ్యాత్మిక, సాంస్కృతిక లోతులను ఆమె రచనలు ఉపయోగించుకుంటాయని విమర్శకుల భావన. తద్వారా, సంచలనాత్మక కథా ప్రవచనానికి అనువైన పరికరాలుగా వారిని తగ్గించింది.

భారతీయ వారసత్వాన్ని పరిరక్షించే బాధ్యత సాంస్కృతిక మంత్రిత్వ శాఖది. అందుకే, సెమినార్ అంశం, ఉపన్యాసకుల ఎంపిక అన్నవి భారతీయ సంస్కృతి, దాని పునాదులకు అవమానంగా అనేకులు భావించారు. నెటిజన్లు, విమర్శకులు, దేశభక్తులు గొంతెత్తడంతో సెమినార్‌ను రద్దు చేసినప్పటికీ, అటువంటి చరిత్ర కలిగిన వ్యక్తులను సాధికారం



దేవదత్ పట్నాయక్



నమితా గోఖలే

చేయడం వెనుక ఉన్న తమ పాత్రపై సమాధానాలు చెప్పాలని కోరుతున్నారు.

అయినప్పటికీ, ఇది సరైన దిశలో వేసిన ఒక అడుగ్గా పరిగణించాలి. అయితే, ఈ ఘటన లోతైన సమస్యను నొక్కి చెప్పడమే కాదు, మార్గాన్ని సరిదిద్దుకోవలసిన తక్షణావసరాన్ని కూడా విప్పి చెప్తోంది. లోపలి ఉంటూనే చెదలా భారతీయ సంప్రదాయాలను ధ్వంసం చేయాలనుకునేవారనేక మంది ఈ సాంస్కృతిక సంస్థల్లోకి చొరబడ్డారు. ఒకవేళ మంత్రిత్వ శాఖ వారిని సాధికారం చేయడాన్ని కొనసాగిస్తే, కాంగ్రెస్ పాలనకన్నా వారేం భిన్నంగా చేస్తున్నారని భావించవలసి వస్తుంది. భారతీయ వారసత్వం పట్ల గౌరవంతో వచ్చే నిజమైన పండితులను పక్కకు తోసి, రెచ్చగొట్టే ఇటువంటి వారికి ప్రాధాన్యతను ఇవ్వడం విచారకరం.

ఇది గత కొన్ని దశాబ్దాలుగా భారతీయ మెదడులను పట్టి పీడిస్తున్న అదే వలసవాద కథనాల కొనసాగింపు అవుతోందే తప్ప, వలసవాసనల నుంచి బయటపడేందుకు మార్గం కావడం లేదు. ఈ క్రమంలోనే భారతీయ సంస్కృతికి చెందిన పరిరక్షకులు ఎటువైపు ఉన్నారో తేల్చుకోవలసి ఉంది. పైన పేర్కొన్న వ్యక్తులకు వేదికలను ఇచ్చి, హిందూ ఇతిహాసాలను, సంప్రదాయాలను మరింత వక్రీకరించేందుకు అవకాశం కల్పిస్తారా? లేదా భారతీయ వారసత్వ పవిత్రతను పరిరక్షించే బాధ్యతను గౌరవిద్దామనుకుంటారా అన్నది తేల్చుకోవలసి ఉంది.

మేధోపరమైన చర్చ ముసుగులో జరుగుతున్న వామపక్ష ప్రచారాన్ని అడ్డుకోవలసిన సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలోనే సాహిత్య అకాడెమీ, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ రెండూ కూడా వామపక్షాల సంచలనాలను కాకుండా భారతీయ సంప్రదాయాలను గౌరవించడానికి ప్రాధాన్యతను ఇవ్వాల్సి ఉంది.

– జాగృతి డెస్క్

# బాల జాగృతి

## తెలుసుకుందాం

# వీరభద్రస్వామి దేవాలయం బొంతపల్లి



తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం, బొంతపల్లి గ్రామంలో కొలువుదీరిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయమిది. హైదరాబాద్–మెదక్ ప్రధాన మార్గంలోని బొంతపల్లి కమాన్ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఈ దేవాలయానికి కాకతీయుల నాటి చరిత్ర ఉంది. వీరభద్రస్వామికి ఎదురుగా భారీగా నంది విగ్రహం, దాని పక్కనే భారీ ఎత్తున ఆలయ ధ్వజస్తంభం నిర్మితమై ఉంది. 1972 నుండి ఇది దేవాలయ శాఖ అధీనంలోకి వచ్చింది. ఈ ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు.

## కథ | ఉడుత - పిచ్చుక!

లక్ష్మీపురం అనే ఊరి మధ్యలో ఉన్న మామిడి చెట్టుపై ఒక పిచ్చుక, ఉడుత నివాసం ఉండేవి.

వాటి మధ్య మంచి స్నేహం ఉండేది.

ఒకరోజు ఉడుత మామిడి కాయలు తింటూ ఉండగా.. చెట్టు కొమ్మల మధ్య ఉన్న గూడులోంచి పక్షి పిల్లల అరుపులు వినిపించాయి.

వాటి దగ్గరకు వెళ్లి చూడగా వాటి తల్లి లేదు. బహుశా ఆహారం కోసం వెళ్లిన తల్లి కోసం ఎదురుచూస్తున్నాయి అనుకుంది.

ఎంత సేపటికీ పిల్లల అరుపులు ఆగకపోవడంతో మరోసారి వెళ్లి చూసింది.

అయినప్పటికీ తల్లి రాలేదు. ఈ విషయాన్ని తన స్నేహితుడు అయిన పిచ్చుకకు చెప్పింది.

అప్పుడు పిచ్చుక 'ఇప్పుడు మనం ఏమి చేయగలం' అని ప్రశ్నించింది.

'వాటి తల్లి ఏదైనా ప్రమాదానికి గురై ఉండవచ్చు, ఒకవేళ సాయంత్రం వరకు రాకపోతే వాటి బాధ్యత నేను తీసుకుంటాను. వాటికి ఆహారం అందించి పెద్ద చేస్తాను' అని చెప్పింది ఉడుత.

అప్పుడు పిచ్చుక ఇలా అంది 'నీది మంచి



## పద్యము

**చీమలు పెట్టిన పుట్టలు**
**పాముల కిరవైన యట్లు పామరుడు దగన్**
**హేమంబు గూడబెట్టిన**
**భూమీశుల పాలజేరు భువిలో సుమతీ!**

**భావం :** ఓ సుమతీ! భూమిలో చీమలు కష్టపడి పెట్టిన పుట్టలలో పాములు చేరును. అట్లే మూర్ఖుడు దాచి ఉంచిన బంగారం రాజులపాలై అతనికి ఉపయోగపడకపోవును.

## శ్లోకము

**హిమాలయం సమారభ్య**
**యావదిందు సరోవరమ్**
**తం దేవ నిర్మితం దేశం**
**హిందుస్థానం ప్రచక్షతే!!**

**భావం :** హిమాలయాల నుంచి హిందూ మహాసముద్రం వరకు గల ఈ విశాల దేశం దేవతల చేత నిర్మితమైంది. దీనిని హిందూస్థానం అంటారు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.


| | |
|---|---|
| నాగలి | డాక్టర్ |
| రంపం | రైతు |
| కుట్టుమిషన్ | కార్మికుడు |
| సుత్తి | వడ్రంగి |
| స్టెతస్కోప్ | దర్జీ |

**జవాబులు :** నాగలి–రైతు; రంపం–వడ్రంగి; కుట్టుమిషన్–దర్జీ; సుత్తి–కార్మికుడు; స్టెతస్కోప్–డాక్టర్.

నిర్వహణ : నయనశ్రీ

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### అనుగ్రహ నారాయణ్ సిన్హా



బిహార్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. 1887 జూన్ 18న జన్మించారు. 1916లో మహాత్మా గాంధీ పిలుపు మేరకు చంపారన్ సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. అందుకోసం తన న్యాయవాద వృత్తిని సైతం విడిచిపెట్టారు. శాసనోల్లంఘన ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించారు. 1942 నుంచి 1944 వరకు జైలు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ పరిషత్ సభ్యునిగా సేవలందించారు. 1957 జూలై 5న మరణించారు.

## జనరల్ నాలెడ్జ్

1. జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఎప్పుడు జరుపుకుంటారు?
2. థార్ ఎడారి ఏ రాష్ట్రంలో ఉంది?
3. పనాజీ అనేది ఏ రాష్ట్రానికి రాజధాని?

జవాబులు : 1. నవంబర్ 16; 2. రాజస్థాన్; 3. గోవా.

## మెదడుకు మేత

కాళ్లు, చేతులు లేని అందగత్తెకు బోలెడు దుస్తులు?

జవాబు : ఉల్లిపాయ



ఆలోచనే కానీ.. ఆ పక్షి పిల్లలకు ఆహారం సేకరించుకోవడం, ఎగరడం అన్నీ వాటి తల్లి నుంచే నేర్చుకోవాలి. అది నీవు చేయలేవు. అందువల్ల వాటి తల్లి ఏదైనా ప్రమాదంలో ఉందేమో వెళ్లి చూడు' అని సలహా ఇచ్చింది.

ఉడుత వెతుకుతూ ఉండగా ఒక చెట్టుకింద పడిపోయి ఉన్న తల్లి పక్షిని గమనించింది.

ఏమైందని ప్రశ్నించగా ఒక వేటగాడి బాణం తగలడం వల్ల తాను పడిపోయానని తల్లి పక్షి చెప్పింది.

వెంటనే ఆ తల్లి పక్షికి సపర్యలు చేసి.. పిల్లల వద్దకు చేర్చింది. తనను బ్రతికించి పిల్లల వద్దకు చేర్చిన ఉడుతకు తల్లి పక్షి కృతజ్ఞతలు చెప్పుకుంది. ★

## మంచిమాట

ఫలితాన్ని ఆశిస్తూ పరుగెత్తవద్దు.. పని చేస్తూ పోతే ఫలితం అదే పరుగెత్తుకు వస్తుంది!




# వారఫలాలు 25 నవంబర్ -1 డిసెంబర్, 2024




సింహంభట్ల సుబ్బారావు

6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆదాయం తగ్గి అప్పులు చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. కుటుంబంలో కొన్ని సమస్యలు,ఒత్తిళ్లు ఎదురవుతాయి. వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. ఉద్యోగులకు ఊహించని మార్పులు ఉండవచ్చు. రాజకీయవేత్తలకు ప్రత్యర్థుల నుంచి ఇబ్బందులు ఎదురుకావచ్చు. 25,26తేదీల్లో పరిచయాలు పెరుగుతాయి. ఆహ్వానాలు అందుతాయి. విందువినోదాలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఆస్తి వ్యవహారాలలో కొత్త అగ్రిమెంట్లు చేసుకుంటారు. వాహనయోగం. సోదరులతో వివాదాలు సర్దుబాటు కాగలవు. విద్యార్థులు, నిరుద్యోగులు కొత్త అవకాశాలు దక్కించుకుంటారు. ప్రముఖులతో పరిచయాలు. వ్యాపారులకు అధిక లాభాలు. ఉద్యోగులకు విధి నిర్వహణలో ప్రోత్సాహకరంగా ఉంటుంది. రచయితలు, క్రీడాకారులు, కళాకారులకు సత్కారాలు. 27,28 తేదీలలో దుబారా ఖర్చులు. అనారోగ్యం. శివాష్టకం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ఆదాయం మరింత పెరుగుతుంది. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ప్రముఖులతో పరిచయాలు. వాహనాలు, గృహం కొనుగోలు చేస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు లాభాలు అందుతాయి. ఉద్యోగులకు సంతోషకరమైన సమాచారం. కళాకారులు, రచయితలు, పరి శోధకులకు అవకాశాలు పెరుగుతాయి. 29,30 తేదీల్లో అనారోగ్యం. కుటుంబంలో చికాకులు. శివస్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుంటారు. కొత్త కాంట్రాక్టులు దక్కించుకుంటారు. శుభకార్యాలలో పాల్గొంటారు. వాహనసౌఖ్యం. వ్యాపారులు అనుకున్న లాభాలు దక్కించుకుంటారు. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు విదేశీ పర్యటనలు. 30, డిసెంబర్ 1తేదీలో శారీరక రుగ్మతలు. కుటుంబంలో ఒత్తిళ్లు. ఆంజనేయ దండకం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేసి సత్తా చాటుకుంటారు. విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. భూములు, వాహనాలు కొనుగోలుచేస్తారు. ఉద్యోగులకు ఉన్నతాధికారుల నుంచి ఆదరణ లభిస్తుంది. కళాకారులు, రచయితలు, పారిశ్రామికవేత్తలకు విదేశీ పర్యటనలు ఉంటాయి. 28,29 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. బంధువిరోధాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

కార్యక్రమాలలో ఆటంకాలు అధిగమిస్తారు. ఆప్తుల నుంచి ముఖ్య సందేశం అందుతుంది. రాబడి ఆశాజనకంగా ఉంటుంది. స్వల్ప అనారోగ్య సూచనలు. వ్యాపారులకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు మరింతగా అనుకూల సమయం. పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులకు పట్టిందీ బంగారమే. 29,30 తేదీలలో దూరప్రయాణాలు. వేంకటేశ్వరస్వామి స్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

కార్యక్రమాలు సకాలంలో పూర్తి. ప్రయాణాలలో కొత్త పరిచయాలు. విద్యార్థులకు అవకాశాలు దక్కుతాయి. ఆస్తి విషయంలో ఒప్పందాలు. వాహన, కుటుంబసౌఖ్యం. భూలాభాలు. వ్యాపారులకు ఆశించిన విధంగా లాభాలు. ఉద్యోగులకు ఉత్సాహ వంతంగా. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, రచ యితలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. 30,1తేదీల్లో ఖర్చులు. అనారోగ్యం. గణేశాష్టకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఆరోగ్యం కొంత కుదుటపడుతుంది. విద్యార్థులు చేజారిన అవకాశాలు తిరిగి దక్కించుకుంటారు. పరిచయాలు పెరుగుతాయి. లక్ష్యాలు సాధిస్తారు. దేవాలయ దర్శనాలు. వ్యాపారులకు ఆశించిన లాభాలు. ఉద్యోగులకు అనుకూల వాతావరణం. రాజకీయవేత్తలు, పరిశోధకులు, క్రీడాకారులకు కొత్త అవకాశాలు. 28,29తేదీల్లో వివాదాలు. మానసిక ఆందోళన. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ముఖ్యమైన కార్యక్రమాలు కొంత జాప్యంతో పూర్తి కాగలవు. అదనపు రాబడి లభిస్తుంది. కొన్ని బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఉద్యోగయత్నాలు ముమ్మరం చేస్తారు. వ్యాపారులు లాభాల బాటలో పయనిస్తారు. ఉద్యోగులకు మరింత గుర్తింపు. కళాకారులు, రచయితలు, పరిశోధకులకు నిరుత్సాహమే. 25,26తేదీల్లో ధనవ్యయం. కుటుంబంలో ఒత్తిడులు. వివాదాలు. ఆదిత్య హృదయం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

చేపట్టిన కార్యక్రమాలు సజావుగా సాగుతాయి. ఆదాయం సమృద్ధిగా ఉంటుంది. భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు. విద్యార్థులు కొత్త అవకాశాలు దక్కించుకుంటారు. వ్యాపారులకు లాభాలు అందుతుంది. ఉద్యోగుల సేవలకు గుర్తింపు రాగలదు. రాజకీయవేత్తలు, రచయితలు, క్రీడాకారులకు విశేష ఆదరణ. 26,27తేదీల్లో ఆస్తి వివాదాలు. మనశ్శాంతి లోపిస్తుంది. విష్ణుసహస్ర నామ పారాయణ చేయండి.


**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

అదనపు ఆదాయం. స్నేహితులతో ఉత్సాహంగా గడుపుతారు. సేవాకార్యక్రమాలపై ఆసక్తి చూపుతారు. విద్యార్థులు, నిరుద్యోగులకు అవకాశాలు పెరుగుతాయి. గృహం కొనుగోలు చేస్తారు. కోర్టు వ్యవహారాలలో కొంత పురోగతి. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు సానుకూలం. కళాకారులు, క్రీడాకారులకు సన్మానాలు. 28,29 తేదీల్లో దూర ప్రయాణాలు. సుబ్రహ్మణ్యేశ్వరుని స్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

పలుకుబడి పెరుగుతుంది. పోటీపరీక్షల్లో నిరుద్యోగులకు విజయం. ఆస్తి వివాదాలు తీరతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు మరింత లాభదాయకంగా ఉంటుంది. ఉద్యోగులకు విధుల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలు, రచయితలు, పరిశోధకులకు యత్నాలు సఫలమవుతాయి. 30,1తేదీల్లో దూరప్రయాణాలు. ఆరోగ్యసమస్యలు. నృసింహ స్తోత్రాలు పఠించండి.

# పదరసం-489



## ఆధారాలు

**అడ్డం**

1) కన్నుమూసి తెలిచేకాలం (4)
3) ధూపానికి వాడే చెట్టుబంక (3)
7) సంక్రాంతికి రంగవల్లులలో పెట్టి అలంకరించేవి (3)
8) కార్తీకమాసంలో ఇవి నిర్వహించడం ఆనవాయితీ (6)
11) గుడి (3)
14) "....లేదు, దమ్మిడీ ఆదాయం లేదు" అని సామెత (5)
15) తేలికగా లభ్యత (4)
18) (సాధారణంగా) భార్యాభర్తలమధ్య ఉండే గొడవలను ఇలా అంటారు (4)
21) గురువుయొక్క గురువు (4)
22) పడిపోవడం (3)
23) చాలాఎక్కువ ఉంటే ఇన్ని అంటారు (4)
24) దుద్దుకర్ర,అదుపాజ్ఞలు లేక తిరిగేవ్యక్తి (3)

**నిలువు**

1) ఎగదోసి ప్రేరేపించు (4)
2) సన్యాసులు ధరించే పాదుకలు (4)
4) మరింత క్లిష్టత పైకొచ్చింది (3)
5) ....పుట్టు అంటే నోరూరు, రుచిపుట్టు (3)
6) చాలా పెద్ద కథ (3)
9) పాతకాలపు పెద్ద పెట్టె (3)
10) సంస్కృతి, ఉండేవిధానం (5)
12) అరుచి, అసహ్యం (3)
13) వాదము, తగవు (2)
14) తలక్రిందులైన కఠిననిబంధన (2)
15) కుజుడు (5)
16) మంచి చెడులు (4)
17) తీరిక (4)
19) గురువారాన్ని కొందరు ఇలా కూడా అంటారు (4)
20) ఆశీర్వదిస్తూ తలమీద వేసేవి పైకొచ్చాయి (4)

**పదరసం 487లోని ఆధారాలలో దొర్లిన పొరపాటుకు క్షంతవ్యుడను**

**– పోపూరి విశ్వనాథ్**


**అడ్డం7) అపసవ్యంగాఉన్న ఉంగరపువేలు (4) అడ్డం 8) 'రాజశేఖర చరిత్ర' నవలా రచయిత, సంఘసంస్కర్త ఇంటిపేరు (4) పొరపాటున 'కన్యాశుల్కం' అని అచ్చయింది.**

## పదరసం - 488 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ఎ[1] | డ | బా[2] | టు | | బీ[3] | | | కం[4] | గు |
| గు | | ణా | | అ[5] | ట | కా[6] | యిం | చు | |
| మ[7] | తి | మ | రు | పు | | పే | | | ర్రి[8] |
| తి | | తి | | రూ | | రి[9] | క[10] | ల | తో |
| | తా[11] | | సం[12] | పం | గి | | రు | | |
| చో[13] | వి | | భా | | | వీ[14] | డు | కో | లు[15] |
| ద | | శ[16] | ష | భి | ష[17] | లు | | | వ |
| కు | | | ణ | | డ్డ | | | పా[18] | య |
| డు[19] | రు | ని[20] | | | కు[21] | జ | దో | షం | |
| | | జ[22] | న | కు | డు | | | డం[23] | గు |

సినిమా

తమిళ చిత్రసీమలో ఇవాళ చిత్రమైన పరిస్థితి నెలకొంది. దీపావళి కానుకగా విడుదలైన 'అమరన్' సినిమాను నిలిపివేయాలని కొన్ని వర్గాలు డిమాండ్ చేశాయి. తమ మాట వినకపోతే... థియేటర్లపై దాడి చేస్తామని బెదిరించాయి.ఈ డిమాండ్ చేసింది ఇస్లామిక్ సంస్థలు, వాటి నాయకులు. సహజంగా ఈ వర్గాలకు ఎప్పుడూ మద్దత్తుగా నిలిచే అధికార డీఎంకె పార్టీ ఇప్పుడు ఆ నిరసనలను పట్టించుకోకుండా త్రోసిరాజంది. ఈ సినిమా ప్రదర్శించే థియేటర్ల దగ్గర రక్షణ ఏర్పాట్లనూ చేసింది. అయితే దీనికి వెనుక కొన్ని ఆసక్తికరమైన సంఘటనలు చోటు చేసుకున్నాయి.




# 'అమరన్'లో ఏం చూపించారు? ఎందుకంత ఉలికిపాటు!?

తమిళనాడుకు చెందిన మేజర్ ముకుంద వరదరాజన్ దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనికాధికారి. అతనికి మరణానంతరం కేంద్రం అశోక చక్ర పురస్కారాన్ని అందించింది. చిన్నప్పటి నుండి సైనికుడు కావాలనే తలంపుతో మధ్య తరగతికి చెందిన ముకుంద్ కష్టపడి ఆర్మీలో ఉద్యోగం సంపాదించుకున్నాడు. అంచలంచెలుగా ఎదిగి మేజర్ అయ్యాడు. కశ్మీర్‌లోని ఉగ్రవాదులను ఏరివేసే క్రమంలో వీరమరణం పొందాడు. కశ్మీర్‌లో తలదాచుకుని, దేశ విచ్ఛిన్నానికి పాల్పడుతున్న ముస్లిం మూకలను అతను ప్రాణాలను పణంగా పెట్టి ఎదుర్కొన్నాడు. ఆ వీరుడి గాథను దర్శకుడు రాజ్ కుమార్ పెరియసామి 'అమరన్' పేరుతో సినిమాగా తెరకెక్కించాడు. సోనీ పిక్చర్స్‌తో కలిసి కమల్ హాసన్ దీనిని నిర్మించాడు. మేజర్ ముకుంద్ వరద రాజన్‌గా శివ కార్తికేయన్, అతని భార్య రెబకా జాన్ వర్గీస్‌గా సాయిపల్లవి నటించారు. మేజర్ ముకుంద్ జీవితంలోని ఘట్టాలను వీలైనంత సహజంగా రాజ్ కుమార్ తెరపై చూపించాడు. దాంతో థియేటర్ లో ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరూ ఇటు ముకుంద్ పాత్రతోనూ, అటు అతని భార్య రెబకా పాత్రతోనూ కనెక్ట్ అయ్యారు. కశ్మీర్ లోయలోని ముస్లిం ఉగ్రవాదులను వీరోచితంగా ముకుంద్ ఏరిపారేస్తుంటే థియేటర్లలో జనాలు చప్పట్లు కొట్టారు, కేరింతలు పెట్టారు. అదే సమయంలో పతాక సన్నివేశంలో దేశం కోసం ప్రాణాలు విడిచిన ముకుంద్‌ను చూసి అసంకల్పితంగా కన్నీరూ పెట్టుకున్నారు. అదే తమిళనాడులో కొందరికి కంటగింపయింది.


పొరుగు శత్రుదేశం నుండి కశ్మీర్ లోయలోకి చొరబడి, దారుణాలకు పాల్పడుతున్న ఉగ్రవాదులను ముకుంద్ ఎలా అంతం చేశాడో తెరకెక్కించడాన్ని వారు సహించలేకపోతున్నారు. ఇది ముస్లింలకు వ్యతిరేకమైన చిత్రంగానూ, అల్ప సంఖ్యాకులపై ద్వేషాన్ని రగిలించే చిత్రంగానూ ప్రచారం చేయడం మొదలు పెట్టారు. 'అమరన్' సినిమాను నిషేధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అది జరగకపోవడంతో విడుదలైన వారంలోనే తేనంపేటలోని చిత్ర నిర్మాత కమల్ హాసన్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఆయన దిష్టి బొమ్మను తగలబెట్టారు. ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది అన్నాడీఎంకేతో రాజకీయ అనుబంధం ఉన్న సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాను కేంద్రం నిషేధించిన క్రమంలో దాని రాజకీయ వాణిగా ఎస్.డి.పి.ఐ. పనిచేస్తోంది. ఇంత జరిగినా 'అమరన్' సినిమాను ప్రజలు ఆదరించడంతో తట్టుకోలేని కొన్ని వర్గాలు ఇటీవల తిరునల్వేలి జిల్లా మేలపాళయంలోని అలంకార్ థియేటర్‌లో పెట్రోల్ బాంబులు వేశాయి. ఈ దుశ్చర్యలకు ముగ్గురు పాల్పడినట్టు సీసీటీవీ ఫుటేజ్‌తో స్థానిక పోలీసులు గుర్తించారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక కమ్యూనిస్టులు, ముస్లిం వర్గాలు, ద్రవిడ నాయకులు ఉన్నట్టు ప్రాథమిక విచారణలో తేలింది. జాతీయతను ప్రేరేపించే 'అమరన్' లాంటి చిత్రాలకు ఆదరణ లభిస్తే తమ కుట్రలు సాగవనే భయంతో వారు ఇలాంటి చర్యలకు పాల్పడు తున్నారని స్థానికులు చెబుతున్నారు.

'అమరన్' చిత్ర నిర్మాతలలో కమల్ హాసన్ ఒకరు. తమిళనాడుకు చెందిన దేశభక్తుని కథను ప్రజలకు తెలియచేయాలని ఉద్దేశంతో కమల్ ఈ సినిమాను నిర్మించి ఉండొచ్చు. కమర్షియల్‌గా ఇలాంటి సినిమాలకు ఆదరణ ఉంటుందని భావించి ఉండొచ్చు. అయితే అవకాశం దొరికినప్పుడల్లా జాతీయవాదులను, జాతీయవాద పార్టీలను విమర్శించే కమల్ హాసన్‌కు ఇప్పుడైనా తాను ఇంతకాలం పాములకు పాలు పోసి పెంచుతున్నాననే విషయం అర్థమైందా? అనేది సందేహమే! డీఎంకేతో అంటకాగుతున్న ఆయనకు అంత తేలికగా జ్ఞానోదయం అవుతుందని అనుకోలేం. అయితే కమల్ 'అమరన్' చిత్ర నిర్మాతగా ఓ తెలివైన పనిచేశారు. ఈ సినిమాను మొదట ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం. కె. స్టాలిన్‌కు చూపించారు. 'దేశం కోసం ప్రాణాలు అర్పించే సైనికులు తమిళనాడు నుండి కూడా ఉన్నారని, ఇలాంటి అమరవీరుల కథలు మరిన్ని సినిమాలుగా రావాలని, దీనిని అందరూ ఆదరించాల'ని స్టాలిన్ కోరారు. డీఎంకే నేతలు సైతం ఆ సినిమా ప్రివ్యూ చూసి, ఆకాశానికి ఎత్తారు. దాంతో ఆ తర్వాత వచ్చిన నిరసనలను ఎదుర్కోవాల్సి వచ్చినా... వెనక్కి తగ్గలేని పరిస్థితి. తన సినిమాపై ముస్లిం వర్గాలు వ్యక్తం చేసిన నిరసన, తన దిష్టిబొమ్మను తగలబెట్టిన తీరు కమల్‌కు వ్యక్తిగతంగా కొంత బాధను కలిగించి ఉండొచ్చు. అయితే ఇది కూడా సినిమా పబ్లిసిటీకి ఉపయోగ పడుతుందని అనుకునీ ఉండొచ్చు. ఈ సినిమా విడుదలకు ముందు సాయిపల్లవి గతంలో భారతీయ సైనికుల గురించి ఓ ఇంటర్వ్యూలో చేసిన కొన్ని వ్యాఖ్యలను తెర మీదకు తీసుకొచ్చి, 'అమరన్'ను బహిష్కరించాలంటూ కొందరు సోషల్ మీడియాలో హంగామా చేశారు. ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యమిస్తూ, దేశభక్తిని ప్రేరేపించే ఇలాంటి సినిమాలను తిరస్కరించాలని కోరడం సమంజసం కాదు. అలానే ముకుంద్ వరద రాజన్ ఈ సినిమాలో ఎక్కడా కుల ప్రస్తావన తేలేదని, అతను క్రైస్తవ మహిళను ప్రేమించి వివాహం చేసుకున్న విషయానికి ప్రాధాన్యం ఇచ్చారని కొందరు విమర్శించక పోలేదు. దానికి దర్శకుడు రాజ్ కుమార్ సమాధానం చెబుతూ, 'కులానికంటే కూడా తమ కుమారుడు తమిళుడినని, దానిని మించి భారతీయుడినని గర్వం చెప్పుకునే వాడని, అతన్ని సినిమాలో అలానే చూపమ'ని కోరినట్టు వివరణ ఇచ్చాడు.


ఇక్కడ గమనించవలసిన విషయం...'అమరన్' చిత్రాన్ని కమల్ కాకుండా వేరే ఎవరైనా నిర్మించినా, దానిని ముఖ్యమంత్రి స్టాలిన్ తనయుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్ జెయింట్ మూవీస్ పంపిణీ చేయకుండా ఉండినా... ఈ పాటికి నిషేధించేవారేమో! నిరసనకారులకు మద్దతుగా వీరూ రోడ్లు ఎక్కేవారేమో! ఎందుకంటే... జాతీయవాదాన్ని అణచివేయడానికి ఇటు కమల్ హాసన్, అటు డీఎంకే ఎంతకైనా తెగిస్తాయనే సంగతి అందరికీ తెలిసిందే! ఇప్పుడు 'అమరన్'పై జరుగుతున్న నిరసనలను, థియేటర్లపై జరుగుతున్న దాడులను వీరు తేలుకుట్టిన దొంగలా భరిస్తున్నారు!

**అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.360/-



వెల : ₹.390/-



వెల : ₹.220/-




వెల : ₹.360/-




వెల : ₹.200/-




వెల : ₹.300/-




వెల : ₹.300/-




వెల : ₹.240/-




వెల : ₹.100/-




వెల : ₹.200/-




వెల : ₹.110/-




వెల : ₹.799/-



వెల :₹.495/-



వెల : ₹.549/-



వెల : ₹.399/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27. 040-27563236, 9290127329

వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠి, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 05

*With best compliments from:*

Estd : 1994-95

# G.PULLA REDDY COLLEGE OF PHARMACY

**Affiliated to Osmania University, Hyderabad**
**Approved by PCI & Accredited by NAAC,**
**G.Pulla Reddy Educational Campus, Mehdipatnam, Hyderabad-500 028.**
**Phone : +91 8297511177**
**Email: gprcphyd@gmail.com I website : gprcp.ac.in**

**EAMCET Code : GPRP**

**PGECET Code : GPRP1**



## COURSES OFFERED

**B.Pharm**

**M.Pharm**

1. M.Pharm (Pharma. Chemistry)
2. M.Pharm (Pharmaceutics)
3. M.Pharm (Pharmacology)
4. M.Pharm (Pharma. Analysis)
5. M.Pharm (Pharma. Regulatory Affairs)

**Pharm D**

Founder Chairman
**Late G. Pulla Reddy**

Chairman
**Sri P. Subba Reddy**

Managing Trustee
**Sri G. Raghava Reddy**